# సప్తగిరి

తిరుమల తిరుపతి దేవస్థానములు

సచిత్రమాసపత్రిక

ఏప్రిల్ 2020, వెల రూ.5/-



2020 ఏప్రిల్ 02 నుండి 10 వరకు

## ఒంటిమిట్ట
## శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం



## తిరుమల తిరుపతి దేవస్థానములు
## నాగులాపురం
## శ్రీవేదవల్లీసమేత శ్రీవేదనారాయణస్వామివారి బ్రహ్మోత్సవం
## 2020, మే 05 నుండి మే 13 వరకు

**05-05-2020**
మంగళవారం
పగలు: ధ్వజారోహణం
రాత్రి: పెద్దశేషవాహనం

**06-05-2020**
బుధవారం
పగలు: చిన్నశేషవాహనం
రాత్రి: హంసవాహనం

**07-05-2020**
గురువారం
పగలు: సింహవాహనం
రాత్రి: ముత్యపుపందిరివాహనం

**08-05-2020**
శుక్రవారం
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: సర్వభూపాలవాహనం

**09-05-2020**
శనివారం
పగలు: పల్లకిలో మోహినీఅవతారోత్సవం
రాత్రి: గరుడవాహనం

**10-05-2020**
ఆదివారం
పగలు: హనుమద్వాహనం,
సా॥ వసంతోత్సవం
రాత్రి: గజవాహనం

**11-05-2020**
సోమవారం
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం

**12-05-2020**
మంగళవారం
పగలు: రథోత్సవం
రాత్రి: అశ్వవాహనం

**13-05-2020**
బుధవారం
పగలు: చక్రస్నానం
రాత్రి: ధ్వజావరోహణం



# గీతాశ్లోకార్థసారం

**శ్లో : అన్యేచ బహవశ్శూరా మదర్థే త్యక్త జీవితాః ।**
**నానాశస్త్ర ప్రహరణా స్సర్వే యుద్ధవిశారదాః ॥**

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం-09వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** అన్యేచ= ఇతరులైన; బహవః= అనేకులైన; శూరాః= శూరులును; మదర్థే= నా కొరకు; త్యక్త జీవితాః= ప్రాణమును ధారపోయువారైన; నానా= వివిధములైన; శస్త్రప్రహరణాః= శస్త్రాస్త్రములు, ఆయుధములు కలవారును; సర్వే= అందరున్ను; యుద్ధవిశారదాః= యుద్ధమునందు ప్రవీణులు (అయి ఉన్నారు.)

**భావం:** తమ తమ జీవితాలను ధారపోయునట్టి అనేక ఇతర శూరులందరును నా కొరకు యుద్ధసమర్థులై, వివిధ శస్త్రాస్త్రసంపన్నులై ఇచట ఉన్నారు.



## శరణు శరణు రామచంద్ర నరేంద్రా...!!

శరణు శరణు రామచంద్ర నరేంద్రా
సరి మమ్ముఁగావు రామచంద్ర నరేంద్రా


ఘన దశరథునకుఁ గౌసల్యాదేవికిని
జననమందిన రామచంద్ర నరేంద్రా
కనలి తాటకిఁ జంపి కౌశికుజన్నము గాచి
చనవు లిచ్చిన రామచంద్ర నరేంద్రా ॥

అరిది సీతఁ బెండ్లాడి అభయమందరి కిచ్చి
శరధిఁ గట్టిన రామచంద్ర నరేంద్రా
అరసి రావణుఁ జంపి అయోధ్యానగర మేలి
సరవి నేలిన రామచంద్ర నరేంద్రా ॥

పన్నుగ నలమేల్మంగపతి శ్రీ వేంకటేశ్వరు
సన్నిధి నిల్చిన రామచంద్ర నరేంద్రా
అన్నిటా లక్ష్మణ భరతాంజనేయ శత్రుఘ్నుల
సన్నుతి కెక్కిన రామచంద్ర నరేంద్రా

(అధ్యాత్మ సంపుటం - 03, సంకీర్తనం - 505)

గొప్పదైనవంశచరిత్ర కల్గిన దశరథమహారాజు, కౌసల్యా దేవిల ముద్దుల తనయుడవూ, కౌశికుని యాగానికి భంగం కల్గిస్తున్న తాటకిని చంపి అతనికి ఆనందాన్నిచ్చిన అభయప్రదాతవూ, శివధనుస్సు విరిచి సీతను పెండ్లాడి అందరికీ అభయమిచ్చిన ఆపద్బాంధవుడవూ, రావణుని చంపి అయోధ్యానగరాన్ని అఖండంగా ఏలిన సురక్ష పరిపాలకుడవూ, అలవేలుమంగపతియైన శ్రీవేంకటేశునిసన్నిధిలో కొలువైనవాడవూ, ఎల్లవేళలా



లక్ష్మణ, భరత, ఆంజనేయ, శత్రుఘ్నుల నీరాజనాలను అందుకునే రామభద్రుడవూ ఐన నీవు శరణని కోరిన మమ్మల్ని ఎల్లప్పుడూ రక్షించి కాపాడు తండ్రీ అంటూ అన్నమయ్య కీర్తించాడు.

# అతడు సామాన్యుడు కాడు!!

- శ్రీ ఎ.లక్ష్మీపతిరావు, 89127 83475



(27-04-2020న శ్రీశంకరజయంతి సందర్భంగా...)

కేరళలో 'కాలడి' అనే గ్రామంలో ఆర్యాంబ, శివ గురువులకు ఈశ్వరుని వరప్రసాదంతో బిడ్డ పుట్టాడు. ఆ బిడ్డకు 'శంకరుడు' అని నామకరణం చేశారు.

ఈతడు ఏకసంథాగ్రాహి. వేదాలు, వేదాంగాలు, తర్క విద్య, సాంఖ్యము, పతంజలి యోగ వ్యాకరణాలను ఒక పర్యాయం విన్నంతనే గ్రహించేవాడు. అలా విని తోటిబాలురకు కూడా బోధించేవాడు. ఆతని ప్రతిభకు ఆశ్చర్యపడి ఆతడు సామాన్యుడు కాడని భగవదవతారమని అందరూ శ్లాఘించే వారు.

శ్రీశంకరయతీంద్రులు పాండ్య, చోళ, ద్రవిడదేశ మందున్న విద్వాంసులకందరకును అద్వైతమతతత్త్వముప దేశించి తన శిష్యులుగా చేసుకున్నాడు. ఆ మార్గంలో పృథివీ లింగరూపంలో ఆవిర్భవించిన ఏకాంబరేశ్వరుడు, వరదరాజ రూపంలో వెలసిన విష్ణువూ ఉన్నారు. శంకరుడు వారిరువురకు శివకాంచి, విష్ణుకాంచి అనే పేర్లతో నగరాలు నిర్మించాడు. కామాక్షిదేవాలయంలో తాంత్రికులైన అర్చకులను తొలగించి సమర్థులైన వైదికుల నేర్పరచాడు. శిష్యులతో ఆయన కాంచీ పురనుండి తిరుపతికెళ్లి శ్రీవేంకటేశ్వరస్వామిని సేవించి విదర్భ రాజు గౌరవం పొంది కన్నడదేశానికి వెళ్లాడు. కాపాలిక మతగురువు 'క్రకచుడు' వేలాది కాపాలికులతో శంకరుని ముట్ట డించాడు. అక్కడ శంకరుడు చేసిన హుంకారంతో అగ్నిజ్వాలలు వెలువడి కాపాలికులు దగ్ధమయ్యారు. వ్యాసమహర్షి రచించిన బ్రహ్మసూత్రాలకు భాష్యం రచించాడు.

శివానందలహరి, శివభుజంగప్రయాతము మొదలైన శివస్తోత్రం, విష్ణుస్తోత్రాలు, విష్ణుసహస్ర నామావళికి భాష్యం, గీతాభాష్యం, దేవీస్తోత్రాలు, అష్టో త్తరశతనామావళులు, సౌందర్యలహరి, కనకధారా స్తోత్రం రచించారు. పంచాయతనపూజను సూచించారు.

పంచాయతనంలో శివుడు, విష్ణువు, శక్తి, గణపతి, సూర్యుడు ఉంటారు. శంకరాచార్యులవారు 32 సం॥లు మాత్రమే జీవించి పరమాత్మునిలో ఐక్య మయ్యారు.

**శంకరాచార్యులవారు స్థాపించిన నాలుగుపీఠాలు నాలుగువేదాలకు ప్రాతినిధ్యం వహించాయి. ఇవే ఆ నాలుగు ఆమ్నాయ పీఠాలు**

| దిక్కు | స్థలం | పీఠం | దేవత | నదీతీరం | పీఠాధిపతి | వేదం |
|---|---|---|---|---|---|---|
| తూర్పు | జగన్నాథపూరీ | గోవర్ధనపీఠం | జగన్నాథపురుషోత్తమశక్తి | మహోదధి | శ్రీహస్తామలకాచార్యులు | ఋగ్వేదం |
| దక్షిణం | శృంగేరి | శారదాపీఠం | మలహనికరలింగంవరాహాశక్తి, శారద | తుంగభద్రానది | శ్రీసురేశ్వరాచార్యులు | యజుర్వేదం |
| ఉత్తరం | బదరికాశ్రమం | జ్యోతిర్మఠం | నారాయణశక్తి, పూర్ణగిరి | అలకానందగిరి | శ్రీతోటకాచార్యులు | అధర్వణవేదం |
| పశ్చిమం | ద్వారక | కాళికాపీఠం | సిద్ధేశ్వరశక్తి, భద్రకాళి | గోమతీనది | శ్రీపద్మపాదాచార్యులు (సునందుడు) | సామవేదం |




తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 50 ఏప్రిల్, 2020 సంచిక : 11


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| అతడు సామాన్యుడు కాడు!! | శ్రీ ఎ.లక్ష్మీపతిరావు | 04 |
| శ్రీరామచరితం మధురం మధురం | శ్రీమతి దేవలపల్లి వసుంధర | 07 |
| సందేహాలు - సమాధానాలు | 'సాహితీవాచస్పతి' మొవ్వవృషాద్రిపతి | 10 |
| శ్రీకృష్ణభగవద్విజయం | డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు | 11 |
| భృగువాక్కు | శ్రీ ఎం.జి.స్వామి | 12 |
| నీ సుఖదుఃఖాలకు నీవే కారణం | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 13 |
| తిరునామశోభితుడు | శ్రీమతి ఎమ్.వి.లక్ష్మి | 15 |
| అన్నమయ్య జీవితచరిత్ర | డా॥ మన్నూరు శివప్రవీణ్ | 19 |
| పరశురాముడు | డా॥ కె.అంజనప్ప | 21 |
| దండమయా... ఒంటిమిట్ట కోదండరామయ్యా! | శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి | 22 |
| దివ్యక్షేత్రం... తిరుమల | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 31 |
| కోడై తిరునాళ్ | శ్రీమతి ఎమ్.పద్మశ్రీ | 33 |
| శ్రీవేంకటేశ్వరవైభవం (గేయం) | శ్రీ గరిశకుర్తి రాజేంద్ర | 35 |
| చిత్రకేతువు వృత్తాంతము | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 36 |
| యుగ యుగాల ఏకశిలానగరం | విద్వాన్ కట్టా నరసింహులు | 38 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య & కిరణ్ భట్ | 40 |
| అక్షయం | కుమారి ఎస్.లావణ్య | 42 |
| కప్పవై పడి ఉండు!! | శ్రీ ఎమ్.ఎమ్.వి.ఆర్.ప్రసాద్ | 43 |
| నమ్మినవారిని బ్రోచే దేవుడు | శ్రీమతి వి.సుధాప్రసన్న | 44 |
| అమ్మలాంటి ఆరోగ్య దీవెనలను అందించే నిమ్మ | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 45 |
| హరిదాస వాఙ్మయంలో శ్రీవేంకటాచలాధీశుడు | శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు | 46 |
| సీతాదేవి సమాజానికి ఇచ్చిన సందేశం | డా॥ సూరపరాజు వసంతకుమారి | 48 |
| కైంకర్యమే తనువు దాల్చితే... | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 50 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 53 |


ముఖచిత్రం : శ్రీసీతాలక్ష్మణసమేతశ్రీకోదండరామస్వామివారు, ఒంటిమిట్ట
వెనుక చిత్రం : శ్రీసీతారాముల పట్టాభిషేకం

వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి ॥


గౌరవ సంపాదకుడు
శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకుడు
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

సంపాదకుడు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకురాలు
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

ముద్రాపకుడు
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఇడి.,
ఉపకార్యనిర్వహణాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.



24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777
2233333

వెబ్‌సైట్- www.tirumala.org, www.tirupati.org; ఆన్‌లైన్ సేవలు/వసతిసౌకర్యం కొరకు- www.ttdsevaonline.com
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

# శ్రీరామాయణ మహాకావ్యావతరణం

శ్రీరామచరితం రసభరితం. రామాయణంలాగా లోకవ్యవహారాన్ని విస్పష్టంగా బోధించే కావ్యం మరొకటి లేదు. కనపడదు. ఆదికవి వాల్మీకినుంచి నేటివరకూ రమణీయమైన రామకథ పలుభాషల్లో, పలురీతుల్లో రూపుదిద్దుకుంటోంది. ఇది భారతావనిలోనే కాకుండా భారతీయుల సంస్కృతి ప్రసరించిన అన్యదేశాల్లోనూ ప్రచారప్రశస్తి పొందింది.

రామాయణం ఆదికావ్యం. వాల్మీకిమహర్షి ఈ మహాకావ్యాన్ని రచించడానికి కారణం బ్రహ్మదేవుడి అనుగ్రహం. ఆ తపస్వి తమసానదికి స్నానానికి వెళ్లగా, ఆ నదీతీరాన ఒక కరుణ రసాత్మక దృశ్యం కంటబడింది. ఎదురుగా ఉన్న చెట్టుకొమ్మమీద క్రీడిస్తున్న క్రౌంచమిథునంలో మగపక్షి, కిరాతుడొకడు కొట్టిన బాణం దెబ్బతో నేలమీదపడి విల విల తన్నుకుని ప్రాణాలు విడిచింది. అదిచూసి ఆడపక్షి విలపిస్తోంది. దాని ఆక్రందనానికి మహర్షిహృదయం కరుణార్ద్రమైంది. ఆకస్మికంగా ఆయన హృదయశోకం శ్లోకరూపంగా వెలువడింది.

మా నిషాద! ప్రతిష్ఠాం త్వ మగమ శ్శాశ్వతీస్సమాః ।
యత్ క్రౌంచమిథునా దేక మవధీః కామమోహితమ్ ॥

"ఓ నిషాదుడా! కామమోహితమైన క్రౌంచపక్షులజంటలో ఒకదాన్ని చంపిన నీవు ఎక్కువ కాలం జీవించలేవు సుమా". ఇది కిరాతుడి కిచ్చిన శాపం మాత్రమే కాదు. ఈ శ్లోకంలో రామాయణకథా సూచకమైన మరో అర్థం కూడా ఉంది. అప్పుడాయనకు బ్రహ్మ ప్రత్యక్షమై "నీ నోటినుండి సరస్వతి వెలువడింది. ఇది నా సంకల్పం. ఇక నీవు రామాయణాన్ని రచించు. అది భూతలంలో శాశ్వతంగా ఉంటుంది." అని చెప్పాడు.

వాల్మీకిమహర్షి "మా నిషాద" అనే శ్లోకం ఉచ్చరించేవరకూ లౌకిక వాఙ్మయంలో ఛందోబద్ధమైన వాణి లేదు. రామాయణ కావ్యావతరణకు ఈ క్రౌంచమిథునకథ హేతుభూతమైంది. ఆదికవిగా వాల్మీకి వన్నెకెక్కాడు. మనోహరమైన కవిత్వానందంతో పాటు, మహిమాసిద్ధిని ప్రసాదించే మహాగ్రంథంగా కూడా ప్రశస్తిని పొందింది శ్రీరామాయణం.

తెలుగునాటా, తెలుగునోటా శ్రీసీతారాములు ప్రత్యణువులో, ప్రత్యక్షరంలో ప్రకాశించే దివ్య దంపతులు. శ్రీరామాయణం చదవడంవల్ల తల్లిదండ్రులపట్ల భక్తి, సోదరప్రీతి, జ్యేష్ఠానువర్తనం, లోక మర్యాదానుసరణం, ప్రతిజ్ఞాపాలనం, ఆశ్రితవాత్సల్యం, స్వామికార్యనిర్వహణం, స్వార్థపరత్వనివృత్తి, చిత్తశుద్ధి, పరోపకారబుద్ధి వంటి అనేక సద్గుణాలు అలవడుతాయి.

మనమందరమూ కూడా శ్రీరామాయణకావ్యాన్ని పారాయణ చేద్దాం. పావనులమవుదాం. శ్రీరామునిబాటలో నడవాలన్న దృఢమైన సంకల్పంతో ముందుకు సాగుదాం!! శ్రీసీతారాముల సంపూర్ణానుగ్రహానికి పాత్రులమవుదాం.

"ఓం శ్రీరామాయ నమః"

పచ్చతోరణం

# శ్రీరామ చరితం మధురం మధురం

– శ్రీమతి దేవలపల్లి వసుంధర,
94945 85546

శ్రీరాముడు విష్ణ్వంశచే జన్మించిన వాడగుటవలన ఆకర్షణీయమైన సుందరరూపంతో, గుణములతో పాటు మనకాదర్శంగా నిలిచి మనచే ధర్మమును ఆచరింప చేయవలెనన్న విజ్ఞానమునిచ్చువాడు. రాముడు ఉత్తమ పుత్రుడు. తండ్రి వాక్యము పరిపాలించిన ఆదర్శప్రాయుడు ఈ దశరథ రాముడు. ఈ విషయం దశరథుడు రాముని విశ్వామిత్రుని అనుసరించ వలెనని ఆదేశించిన సందర్భమున ప్రకటితమయింది. మారుమాట లేక రాముడు తన తండ్రి ఆదేశానుసారం విశ్వామిత్రుని ఆదేశాలను, ఆనతులను శిరసావహించాడు.

ఇక తల్లిని ఎలా అనునయించాలో, కష్టాలలో ఎలా ఆశ్వాసించాలో తెలిసినవాడు. అరణ్యవాసం వలదని, తనమాట మన్నింపుమని కౌసల్య అడిగినప్పుడు రాజాజ్ఞను అందరం పరిపాలించవలసినదే అని సూచించిన వాడు కౌసల్యారాముడు.

పినతల్లి కైకేయి తనకు చేసిన ఎగ్గును కూడా తలచక ఆమెపట్ల గౌరవమును చూపి అరణ్యవాసమునకు తరలే సమయంలో, ఆమె ఆజ్ఞను శిరసావహించు సందర్భమున ఆయన చూపిన త్యాగంతో కూడిన వినయం, ఔదార్యం చూపరులకు ఆశ్చర్యానందములు కలుగచేస్తుంది.

ఇంకొక పినతల్లి సుమిత్రపట్ల ఆయన చూపిన విధేయత గొప్పది. తన తల్లి కౌసల్యతోపాటు సమానంగా ప్రేమించి ఆమెపట్ల తన విధేయతను చాటిన వినమ్రమూర్తి.


గురువులదగ్గర విద్యను అభ్యసించు సందర్భంలోనైనా వారికి శుశ్రూషలు చేయుసందర్భములలోనైనా ఉచితానుచితములు అతిక్రమించని వినయశీలి.

తమ్ములను మిక్కిలి ప్రేమతో, ఆదరంతో చూస్తూ వారికై తన ప్రాణములు సైతం లెక్కపెట్టని సోదరప్రేమను తుదివరకు నిలిపిన ఆదర్శ భ్రాతృమూర్తి.

సీతను అత్యంతప్రేమతో, ఆదరంతో తన హృదికి మారుగా చేసుకుని సీతారాముడైనాడు.

సుగుణాభిరాముడగుటచే తనవారిచే, ఆత్మీయులచే, మిత్రులచే, పరివారముచే, పరిజనులచే మాత్రమేగాక, శత్రువైన మారీచునిచే "రామో విగ్రహవాన్ ధర్మః" అని కీర్తింపబడినాడు. చివరకు రాముని వరించి ఆయనను వివాహమాడుతానని వచ్చిన శూర్పణఖచే కూడ ప్రశంసింపబడినవాడు.

**02-04-2020న శ్రీరామనవమి సందర్భంగా...**



ధర్మబద్ధుడైన పుత్రునిగా, ఆదర్శ సోదరునిగా అనురాగ మయుడగు భర్తగా, ధర్మనిష్ఠగల వ్యక్తిగా రాముడు చూపిన ఒరవడి శ్లాఘనీయం. అమోఘం.

అయోధ్యాపురిప్రజలకు ప్రజారంజకపాలన అంద జేయుటలో తొలినుడికారము దిద్దిన అయోధ్యరాముడు. కాల క్రమమున ప్రజారంజకమైన రాజ్యము అంటే రామరాజ్యమే అని ఆదర్శంగా యుగయుగాలకు ప్రఖ్యాతి గాంచినది. ఇప్పటికైనా, ఎప్పటికైనా ప్రజాపాలనకు రాముడంతటివాడు, లేక రాముడినే రాజుగా తీసుకురావాలని, రామరాజ్యం మనకు శాశ్వతంగా కలగాలని వాంఛిస్తుంటారు. అట్టి దివ్యానుభూతికి శ్రీకారం చుట్టినవాడు రాముడు. రామ రాజ్యం అన్న అనుభూతిని మనకు వారసత్వంగా ఇచ్చినవాడు రాజారాముడు.

రాముడు ఆత్మవంతుడు. మిథిలానగరంలో కాని, కోసలరాజ్యమందుగాని ఎలాంటి రాజ్యకాంక్ష కలిగినట్లు మనకు తెలియరాదు. కానీ రాజ్యరక్షణ వహించు పౌరులకు హితము కలిగించని ఏ విషయమైననూ (తుదకు సీతనైననూ) పరిత్యజించవలసినదే అని తలచి తన ప్రాణానికి ప్రాణమైన సీతను త్యజించి రాజుకుండవలసిన ధర్మనిష్ఠను లోకమునకు చాటినాడు.

శ్రీరాముడు ఎంత వినయసంపన్నుడో శివధనుర్భంగ సందర్భంలో ప్రకటింపబడినది. శ్రీరాముని శౌర్య వీర్య సంపదకు సంతసించి మిథిలానగరరాజగు జనకుడు సీతను ఇచ్చి వివాహము జరిపించెదనని ప్రకటించగా తండ్రి ఆమో దించిన తర్వాతే తన వివాహమని తేల్చి చెప్పినవాడు. దీనిచే వివాహవిషయమున పెద్దల ఆమోదము ముఖ్యమను విషయము తనకై తానే ప్రకటించినాడు. పెద్దలకు ఎలాగున వినయగౌరవములు ఇయ్యవలెనో, వివాహవిషయమున జననీజనకులను అలక్ష్యము చేయరాదను విషయమున తాను ఆదర్శప్రాయుడై నిలిచాడు.

రాముడు తనకు చేసిన ఉపకారమును ఎన్నటికిని మరచువాడు కాదు. పైగా వారికి ప్రత్యుపకారము చేయు వాడు. పక్షిరాజగు జటాయువునకు అంత్యేష్టి చేసి తన పితృ దేవునికివలె సద్గతులు కల్పించినాడు. సుగ్రీవునకు రాజ్యం ఇప్పించినాడు. విభీషణునికి లంకాసామ్రాజ్యమును ఇచ్చి నాడు. సీతావృత్తాంతమును విని హనుమకు తాను బదులు తీర్చుకొను సందర్భము తనకు కలగరాదని, హనుమకు అట్టి క్లేశములు ఎప్పటికిని కలుగరాదని, ఇక ప్రత్యుపకారమునకై అవకాశమే లేక తనను తాను సమర్పించుకొనునట్లు ఆలింగనం చేసికొనిన ప్రేమైకమూర్తి.

రాముడు దృఢవ్రతుడు. ఋషితుల్యుడు. అరణ్య వాసమునకు పయనించుసమయమున దశరథుడు, కౌసల్య, లక్ష్మణుడు, గురువులు ఎంత అనునయించిననూ తన నిర్ణయమును వీడని పట్టుదల కలవాడు. భరతునికి పాదు కలు ప్రసాదించుసమయమున పౌరులు, భరతుడు, జాబాలి, మంత్రులు, వసిష్ఠుడు అభ్యర్థించిననూ రాజ్యమును భరతునికి అప్పగించి తాను అరణ్యవాసదీక్షలో ఉండుటకే ఇచ్చగించిన దృఢవ్రతుడు "రామోద్విర్నభాషతే".

ఆశ్రితరక్షణయందు రాముని మించిన ఆదర్శ ప్రాయుడు లేడు. విభీషణుడు శరణాగతిని కోరగా ఎందరు ఎన్ని చెప్పినా వినక విభీషణునికి ఆశ్రయమిచ్చిన శరణాగత పరిత్రాత.


సకలజీవులను కాపాడువాడు, ధర్మమును రక్షిస్తూ, తనవారిచేతకూడా ధర్మమును ఆచరించి కాపాడునట్లు చేయు వాడు. కావుననే ఎందరు ఎన్ని విధములు చెప్పిననూ వన వాసమునకు విముఖత చూపక వారికే ధర్మసూక్ష్మములను చెప్పి వారందరిచేత ధర్మమును ఆచరింపచేసినవాడు.

సర్వభూతములయందు కరుణచూపు ఉత్తమ మాన వునిగా శ్రీరాముడు సర్వజీవప్రేమను, జీవకారుణ్యాన్ని, పశు పక్ష్యాదులగు కాకాసురుడు, జటాయువుపైనను, వానరుల మీద, రాక్షసులగు విరాధ కబంధులపై కూడా చూపినాడు.

రాముడు విద్వాంసుడు. తాను వేదవేదాంగాలను అభ్యసించిననూ, తన అనుభవంలో ఉన్నదానిని ఆచరించి మార్గదర్శకుడైనాడు.

ప్రియదర్శనుడు– రాముడు. అయోధ్య– మిథిలాపుర ప్రజలకేగాక జనపదులకు, ఆటవికులకు, మహర్షులకు, రావణ శూర్పణఖ మొదలగు రాక్షసులకు, శబరివంటి

ఉత్తమోత్తమయోగినికి మంచిదర్శనము కలిగించి ప్రియదర్శనుడైనాడు.



స్నేహధర్మం పాటించుటలో కూడా ఉత్తమధర్మం పాటించి నాడు. గుహుడు తన రాజ్యం లోకి వచ్చి తన ఆతిథ్యం తీసుకొమ్మని వేడినప్పుడు, "నీ రాజ్యమంటే నాకు అయోధ్యతో సమానం. నీవైనా నేనైనా ఒకటే" అని స్నేహశీలత్వము చాటాడు.

రాముడు జితక్రోధుడు. సముద్రతీరమునందు తాను ప్రాయోపవేశము చేసి సముద్రుని ప్రార్థించిననూ వినకపోయేసరికి సముద్రునిపై శరసంధానం చేయుచూ అతనికి వారధి బంధనమునందు ఏ విధంగా సహకరించవలెనో వివరించినాడు. అంతేకాని శపించలేదు. ఇతరులయందు దోషములు వెతుకక, విరోధులపై కూడా జాలి కనబరచ గలిగిన ధీశాలి, కారుణ్యమూర్తి. యుద్ధసమయమున రావణుడు అలసి తన రథికుని, ఆయుధమును కోల్పోయి నిర్వీర్యుడై ఉండినపుడు చంపదగిన శత్రువు చేతికి చిక్కిననూ అలసిన, ఒంటరి అయిన నిరాయుధుని సంహరించననే యుద్ధనీతిని చూపినవాడు.

ఇట్లు పరబ్రహ్మతత్వము శ్రీరాముని సాకారమైన రూపమని చెప్పక తప్పదు. తాను అలౌకిక, అద్భుత, తేజో, తపో, బల వీర, శౌర్య, శక్తి సంపన్నుడైననూ రావణునికియ్య బడిన బ్రహ్మవరమును గౌరవించుచూ మానవుడిగా తన్ను అభివ్యక్తీకరించుకొని జీవితమన్న సుఖముల సమాహారము కాదనియు, ఎంతటి ధనవంతునికైనా లేమిరావచ్చు అనియు, ఎంతటి వీరుడు ఎంతటి ఆపదలు పైబడిననూ వీరత్వమును అన్యాయముగా ఎవరిపైననూ ప్రకటించకూడదని తెలిపిన వాడు. ఒకచో ఎవరైనా తన బల, వీరప్రదర్శనను అక్రమంగా, అన్యాయంగా ప్రయోగిస్తే దానిచే మదోన్మత్తత వచ్చుట తప్ప తనకు ఆ వీర్యము, బలము కీర్తి నివ్వదను విషయమున తాను ఆదర్శమై నిలిచినాడు. ఎంతటి క్లిష్ట సమయములోనైనా ధర్మాచరణ, సత్యసంధత విడిచిపెట్టక జీవితమును ధైర్యముతో ఎదురొడ్డి నిలిచినచో వారెన్నడూ నిరాశపడక విజయమునొంది, మహత్కార్యములాచరించి, ఉన్నతాదర్శములకు మార్గదర్శకులవుతారని స్వానుభవంతో చెప్పిన మహనీయమూర్తి.

శ్రీరామచంద్రమూర్తిని గురించి ఎంత చెప్పినా, మాట్లాడుకున్నా, చదివినా, విన్నా, అనుసరించినా అది ఎప్పటికీ పూర్ణము కాదు సశేషమే.

చివరగా రెండు విషయాలు- రాముడు ఒకశక్తి. అజేయమైన దివ్యచైతన్యం, ధర్మాచరణం, సత్యవాక్పరిపాలనే ఆయన కీలక మహత్తులు.

రాముడు కదలడు కానీ కదిలిస్తాడు.
రాముడు పలకడు కానీ పలికిస్తాడు.
కనుక పోతన మహాకవి కీర్తించినట్లు
"పలికించెడివాడు రామభద్రుడు"

పై విశేషములచే అందరిలో ఆత్మజ్యోతియై వెలిగేవాడు ఆత్మారాముడు.



# సందేహాలు - సమాధానాలు

– 'సాహితీవాచస్పతి' మొవ్వ వృషాద్రిపతి

**1) గర్భగుడిలో కిటికీలు, విద్యుద్దీపాలు ఎందుకుండవు?**

**– అనంత ప్రభాకరదత్తు, విశాఖపట్నం.**

గర్భగుడి పరమపవిత్రమైంది. కిటికీలుంటే ఎవరు బడితే వారు అందులోనికి తొంగిచూస్తారు. రజస్వలాదులు కూడ చూచే అవకాశం ఉంది. దుమ్ము ధూళి వచ్చి స్వామిని ఆక్రమిస్తాయి. అందులోనుండి వచ్చిన గాలికి దీపారాధనలు కొండెక్కుతాయి. పవిత్రతనాధారంగా దేవాలయ ఆగమశాస్త్రం కిటికీలు మొదలైన వాటిని నిషేధించింది. విద్యుద్దీపకాంతిలో విగ్రహంయొక్క నిజమైనరూపం గోచరించదు. స్వయంప్రకాశమానుడైన పరమాత్మను విద్యుత్సహాయంతో చూపిస్తారా? విద్యుత్తునకు కృత్రిమకాంతిని కల్పించినవాడు పరమాత్మ. ఆయనను విద్యుత్కాంతిలో దర్శించటం దోషంగా చెప్పబడింది.

**2) దేవతావిగ్రహాలు కొన్నింటిలో స్వామివారికళ్ళు తెరచుకొన్నట్లు, మరికొన్ని విగ్రహాలు కళ్ళు మూసుకొని ఉన్నట్లు ఉంటాయి. అందలి భావం తెలుపగలరు?**

**– అన్నవరం సత్యనారాయణరావు, నెల్లూరు.**

ఏ విగ్రహమైనా ప్రతిష్ఠసమయంలో, జలాధివాస, ధాన్యాధివాస, క్షీరాధివాసాది కార్యక్రమాలన్నీ అయిపోయిన తర్వాత, ప్రతిష్ఠకు ముందు అర్చకులు వేదమంత్రాలతో ఆ విగ్రహానికి 'నేత్రోన్మీలనం' చేస్తారు. అంటే కన్నులు చక్కగా వికసించేటట్లు చేయటం. కనుక స్వామి కన్నులు తెరచుకునే ఉంటాయి.

అందుకే మహాకవులు భగవంతుని నేత్రాలను, వికసించిన తామరపూవులుగా వర్ణిస్తారు. కేవలం తన భార్య నేత్రాలు తప్ప లోకంలో అంతటి అందమైన కన్నులు లేవని భావించిన ధనుర్దాసునకు, రామానుజులు శ్రీ రంగేశ్వరుని వికసితనేత్రపద్మాలను చూపించారు. అంతటితో ధనుర్దాసు మహాభక్తుడైనాడు. స్వామి కరుణాకటాక్షాలు వర్షించాలంటే కనులు తెరచుకొనే ఉండాలి. అగ్నినేత్రం మాత్రం ఎప్పుడూ మూసి ఉంటుంది.

**3) వరలక్ష్మీవ్రతం, సత్యనారాయణస్వామివ్రతం మొదలైన వ్రతాల్లో కలశాలపై పెట్టుకొన్న కొబ్బరికాయలు నిమజ్జనం చేయాలా? లేక పగులగొట్టి వాడొచ్చా?**

**– టి.వేంకటేశ్, తిరుమల.**

అలా వ్రతాలలో కలశాలమీద ఉంచిన కొబ్బరికాయలను, పూర్ణాహుతికోసం వాడతారు. వాటిని నిమజ్జనమూ చేయవచ్చు. అలాగాక దైవానికి నైవేద్యం చేయుటకు కూడా వాడుకోవచ్చు. ఏ విధమైన దోషం లేదు.

**4) భగవద్గీతను ఇంటిలో చదువవచ్చా?**

**– సి.త్రిపురసుందరి, బెంగళూరు.**

నిక్షేపంగా చదువవచ్చు. భగవద్గీత నిషిద్ధగ్రంథం కాదు. సంజయుడు యుద్ధరంగంలో శ్రీకృష్ణుడు అర్జునునకు బోధించిన భగవద్గీతను, ధృతరాష్ట్రునకు ఇంటిలోనే చెప్పాడు. నేటికీ గీతాశాస్త్రపారాయణ చేసేవారంతా ఇంట్లోనే పారాయణ చేస్తున్నారు. భగవద్గీతను పఠింపరాని ప్రదేశం లేదు.

**5) జన్మదినాలు తిథి వార నక్షత్రాదులనుబట్టి జరుపుకోవాలా? లేక అధునాతన రీతి క్యాలెండరులోని తేదీలనుబట్టా? ఏది సక్రమం?**

**– టేకుమళ్ళ శరత్, నెల్లూరు.**

తిథి వార నక్షత్రాదులనుబట్టి జన్మదినోత్సవం జరుపుకోవటం సక్రమం. అప్పుడే తాను పుట్టిన సరియైన కాలం జరుపుకున్నట్లు.



మంచికోసం ఆశపడు; కాని కష్టానికి కూడా సిద్ధంగా ఉండు

గత
సంచిక
తరువాయి
భాగం..

ధారావాహిక-12

# శ్రీకృష్ణభగవద్విజయం

– డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు, 89198 32285

**సత్యభామ** : ఆఁ!

**వసంతకుడు :** అవునమ్మా! మీ వివాహం కాగానే మన స్వామితో "స్వామీ! సత్యభామాదేవిగారు ప్రణయదేవత. కాబట్టి ఆ దేవిని చేపట్టిన తరువాత మరొక మగువను మనువాడటం తగదు" అని మనవి చేశాను. నామాట విన్నాడా? పెళ్లిమీద పెళ్లి, పెళ్లిమీద పెళ్లి ఎనిమిది పెళ్లిళ్లు చేసుకున్నాడు. ఇటువంటి శృంగారదేవుడు సన్యాసి కావటమా? కల్ల.

**సత్యభామ** : ఏమి స్వామీ! ఈవసంతయ్య చెప్పింది నిజమేనా?

**శ్రీకృష్ణుడు** : సత్యా! ఈ ఛాందసు డిలాగే చెబుతూ ఉంటాడు గాని.... ఇదుగో మిత్రమా! నీవీమధ్య కొంచెం లౌకికం నేర్చావు సుమా!

**వసంతకుడు :** నీవు నేర్పినదే కదా నీరజాక్ష!

**శ్రీకృష్ణుడు** : శివశివ!

**వసంతకుడు :** కృష్ణ కృష్ణ! వస్తా.

అంటూ విజయవీక్షణాలు విసిరి బయటికి నడిచాడు. వాకిలి దాటిన తరువాత మరల 'కృష్ణం వందే జగద్గురుమ్" అనే మహామంత్రాన్ని మననం చేస్తూ పారవశ్యంతో వెళుతున్నాడు.

సత్యాదేవి ప్రణయభారంతో స్వామియెదమీద వ్రాలిపోయింది.

**సత్యభామ** : ప్రాణేశ్వరా! వాళ్లుకూడా మిమ్మల్ని నాలాగా ప్రేమిస్తారా?

**శ్రీకృష్ణుడు** : ప్రణయినీ! నీవు మన వసంతయ్య చెప్పినట్టు నిజంగానే అమాయికురాలివి. అవును. నీ తరువాత వచ్చినవారెవరైనా నన్ను తమ విధేయుడుగా చేసుకున్నారా? లేదే. నేను నీకు మాత్రమే విధేయుణ్ణి గనుక లోకులు నన్ను సత్యావిధేయుడంటున్నారు. నీ ప్రణయసుధామహత్త్వానికి నిదర్శనమైన ఈ బిరుదు అంటేనే నా కిష్టం ప్రియా!

అంటూ ఆమె అధరాలను గాఢంగా చుంబించాడు. సత్యభామ పారవశ్యంతో పరమశోభను ధరించింది. స్వామికి ఉత్సాహం రెట్టింపయింది.

"మధురాంగమంజరీ! నీ అధరం మధురం
మనసైన నీ బిగి కౌగిలి మఱింత మధురం"

స్వామి అందుకున్న పల్లవికి అనుగుణంగా నర్తించింది నవలావణ్యసీమ సత్యభామ.

## 12

కైలాసపర్వతశ్రేణులమీద కమలబాంధవుడు (సూర్యుడు) తన సహస్రకిరణాలను ప్రసరింపజేస్తూ ధరాధర ధావళ్యాన్ని పరాకాష్ఠకు చేరుస్తున్నాడు.

హంసుడు, డిభకుడు శివలింగం ముందు కూర్చుండి మనస్సులో మహాతీవ్రంగా "ఓం నమశ్శివాయ" అనే షడక్షరీ మంత్రాన్ని జపిస్తున్నారు. మంత్రతరంగాలు కైలాసమందిరంలోని పరమశివునిహృదయాన్ని తాకుతున్నాయి. రాజకుమారుల తపస్తీవ్రతకు సంతసించిన రాజమౌళి వారిముందు ప్రత్యక్షమై మందహాసం చేస్తూ "భక్తశిఖామణులారా! హంసడిభకులారా! లేవండి!" అన్నాడు. హంసడిభకులు నెమ్మదిగా కన్నులు తెరచి నెమ్మదిలోని నీలకంఠుడు ఎదురుగా కనిపించేసరికి ఆశ్చర్యానందాలతో నిలబడి అంజలి ఘటించారు.

*(ఇంకా ఉంది)*

ఆశ ఓ ఔషధం. అది అంతర్గతశక్తిని ప్రసాదిస్తుంది

# భృగువాక్కు

- శ్రీ ఎం.జి.స్వామి,
99638 43275

'మహర్షీణాం భృగురహం' అని భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ మహర్షులలో భృగుమహర్షిని నేను అని చెప్పి ఉన్నారు. భృగుమహర్షికి అథర్వవేదంతో అనుబంధం అద్వితీయంగా కనిపిస్తుంది.

భృగుమహర్షి కారణంగానే శ్రీవేంకటేశ్వరస్వామి తిరుమలలో కొలువై ఉన్నాడు. బ్రహ్మ ఆస్థానంలో భృగు మహర్షి శాశ్వతస్థానాన్ని పొందినట్లు భారతం చెప్తోంది. భృగువు తపస్సుకు మెచ్చి శివుడు అనుగ్రహించిన ప్రాంతానికి భృగుతీర్థమనే పేరొచ్చింది. ఆ తీర్థంలో స్నానంచేసిన వారికి విశిష్టఫలం లభిస్తుందని భృగుమహర్షి వాక్కు. ఈ తీర్థం ఈనాడు దశాశ్వమేధప్రాంతానికి పశ్చిమదిగ్భాగంలో ఉందని పద్మపురాణం వాక్కు.

శ్రీవిఖనసమహర్షిచే ఉపదేశింపబడిన సూత్ర వాఙ్మయాన్ని ప్రమాణంగా తీసుకొని ఖిల-పురాతంత్ర-వాసాధికార-చిత్రాధికార-మానాధికార-క్రియాధికార-అర్చాధికార-యజ్ఞాధికార- వర్ణాధికార- ప్రకీర్ణాధికార- ప్రతిగృహ్యాధికార- నిరుక్తాధికార- ఖిలాదికారములు అనే పేర్లతో పదమూడు వైఖానస ఆగమగ్రంథాలను రచించి వైఖానసాగమాన్ని బహుళవ్యాప్తి చేసిన మహనీయుడు భృగుమహర్షి.

**26-04-2020న**
**శ్రీభృగుమహర్షి వర్షతిరునక్షత్రం**
**సందర్భంగా...**

ముండకోపనిషత్తులో దేవతలలో ప్రథముడైన బ్రహ్మదేవుడు తన వద్ద ఉన్న బ్రహ్మవిద్యను తన పెద్ద బిడ్డయైన భృగుమహర్షికి అందించినట్లు ఒక మంత్రంలో ఉంది. భాగవత ప్రమాణాన్ననుసరించి కుమారులైన భృగువు మరియు ఇతరపుత్రులకు ఉత్తమబ్రహ్మవిద్య ఐన జప-హోమ-అర్చన-ధ్యానాత్మకమైన వైఖానససిద్ధాంతాన్ని ఉపదేశించినట్లు తెలుస్తుంది. బ్రహ్మకు పర్యాయవాచకం విఖనస అని, అథర్వునకు పర్యాయవాచకం భృగువు అని పరిశీలనాత్మకవాక్కు.

బ్రహ్మమానసపుత్రులైన నారదమహర్షితో సత్సంగం గావించేవాడు భృగువు. ఆ కోవలో సత్సంగంలో పాల్గొనే ఇతర శిష్యులందరికీ కూడా ఇలా బోధించాడు.



ఆశ్రమధర్మనిర్వహణతో భగవదారాధనను ఆచరిస్తూ సంసారసముద్రమునందు నిమగ్నమైన జీవాత్మ, పరమాత్ముడైన శ్రీమన్నారాయణుణ్ణి స్మరిస్తూ, జనన మరణ ప్రవాహము లేని దివ్యలోకాన్ని పొంది కృతకృత్యుడు కావాలని ఆదేశింపబడిన సిద్ధాంతమే శ్రీవైఖానసశాస్త్ర తత్త్వమని భృగుమహర్షి ప్రతిపాదించాడు.

వైఖానససిద్ధాంతంలో సర్వజ్ఞుడు, సర్వాధారుడు, నిత్యుడు, సనాతనుడు, నిర్మలుడు, నిష్కళుడు, శుద్ధుడు, అవ్యయుడు, పరమాత్ముడైన పరమాత్ముని జ్ఞానయోగములతో సకలస్వరూపాన్ని అవగాహన చేసుకొని తద్ద్వారా నిష్కలస్వరూపాన్ని అనుభవించవలెననేది భృగువు ఆదేశం. ఇదే విశేషప్రాధాన్యంగా చెప్పబడింది.

## భగవద్గీత-యువత

# నీ సుఖదుఃఖాలకు నీవే కారణం

- డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్
9821914642

ప్రపంచంలో కొందరు సుఖంగా ఉన్నట్లు, మరి కొందరు దుఃఖంతో ఉన్నట్లు కనపడుతూ ఉంటుంది. కొందరు విజయసీమలలో ప్రయాణిస్తుంటే, ఇంకొందరు నిరంతరం ఓటమి పాలౌతున్నట్లు కనిపిస్తుంది. కొందరు 90 ఏళ్ళ వయస్సులోను కొండలెక్కుతూ ఉంటే, ఇంకొందరు 40 ఏళ్ళకే మంచమెక్కుతున్నారు. ఎందుకిలా జరుగుతోంది?

ఇదంతా చూసి కొందరు నేరుగా భగవంతుడినే నిందించడం మొదలుపెడతారు. లేదా భక్తి చేస్తున్నవాళ్ళు కూడ భక్తి మానేసి నాస్తికులుగా అయిపోతుంటారు. లేదా నానారకాల దేవుళ్ళను మార్చేస్తుంటారు. లేదా ఏవో క్రొత్త క్రొత్త వ్రతాలు చేపట్టే ప్రయత్నాలు చేస్తుంటారు. ఇంతకూ మనిషికి కలిగే సుఖదుఃఖాలకు కారణమెవరు?

యువతను సాధారణంగా పీడించేవి చదువు, ఉద్యోగం, భవిష్యత్తు, వినోదం ఎలా కలుగుతున్నాయనే



విషయాలే! అవి కొందరికి సులభంగా, పుష్కలంగా లభిస్తున్నట్లు కనిపిస్తుంది, ఇంకొందరికి అవి ఏవీ లేనట్లుగా అనిపిస్తుంది. ఉద్యోగాలు, చదువులు లేనట్టి యువతే సంఘ వ్యతిరేకకార్యాలకు పూనుకోవడం జరుగుతూ ఉంటుంది. దానితో వారి జీవితమే ప్రమాదకరంగా అవుతుంది. ఈ సమస్యకు భగవద్గీత చెప్పిన సమాధానమేమిటో చూద్దాం.

"భౌతిక కార్యకారణాలన్నింటికీ ప్రకృతియే కారణమని, జగత్తులోని పలు సుఖదుఃఖాలకు జీవుడే కారణమని చెప్పబడుతోంది." భగవద్గీత 13.21)

వేలాది, కోట్లాది సంవత్సరాలక్రిందటే చెప్పబడిన భగవద్గీత సందేశంప్రకారం ప్రతివ్యక్తి అనుభవించే సుఖ దుఃఖాలకు తానే కారణం తప్ప ఇంకొకరు కారణం కానే కాదు. ఎప్పుడైతే మనిషికి, యువతకు తామే తమ సుఖ దుఃఖాలకు కారణమని అర్థమౌతుందో అప్పుడు జీవితమే మారిపోతుంది.

అటువంటి మార్పు తేవడంకోసమే భగవద్గీత ఉంది. ప్రస్తుతం కలిగే దుఃఖాలకు పూర్వజన్మ కర్మఫలమే కారణమని విన్నామే! మేము ఇంతవరకు తెలిసి ఏదీ తప్పు చేయలేదు, ఏ పాపము చేయలేదు. ఎందుకీ కష్టాలు? ఎందుకీ దుఃఖాలు? అసలు మంచివాళ్ళకే ఎందుకు ఎక్కువ దుఃఖాలు కలుగుతాయి? పాపాలు చేసేవాళ్ళంతా హాయిగానే ఉన్నారు కదా! అంటూ చాలామంది వాపోతుంటారు.

గీతాజ్ఞానం తెలియకపోవడంవల్లనే అటువంటి మాటలు అంటున్నారు తప్ప దానికి ఇంకొక కారణం లేనే లేదు.

"అయితే మనం ఎప్పటికీ సుఖంగానే ఉండాలంటే, దుఃఖాలనుండి బయటపడాలంటే సాధ్యమేనా?" అని ఎవరైనా అడిగితే అది చేయడానికే మానవజన్మ వచ్చింది. దానిని చేసే విధంగా మార్గదర్శనం చేసేది భగవద్గీత అని జవాబు చెప్పవలసివస్తుంది.

మనిషి తయారుచేసికొనే కల్మషహృదయమే అతని దుఃఖానికి కారణం, మనిషి అలవరచుకునే దైవీగుణమే అతని సుఖానికి కారణం. హృదయం నిర్మలంగా ఉండాలి, లక్ష్యం మహోన్నతంగా ఉండాలి. అప్పుడే జీవితం సుఖ సాగరంగా మారుతుంది. హృదయం కల్మషంతో నిండి, లక్ష్యం అనేది లేకుండ ఉంటే జీవితం దుఃఖసాగరమే. హృదయం నిర్మలంగా ఉంచుకోవడం, మహోన్నతలక్ష్యం ఎంచుకోవడం మన కార్యమేగా? అది ఇంకొకరి కార్యం కానే కాదు. ఈ రెండు ఉంటే సుఖసీమలకు బాటలు వేసు కున్నట్లే.

హృదయం నిర్మలంగా ఉంచుకోవడమంటే ఏమిటి? ఇది చాలా ముఖ్యమైన ప్రశ్న. అసూయ లేక పోవడం, ద్వేషం లేకపోవడం, కోపం లేకపోవడం అనేవే హృదయం నిర్మలంగా ఉంచుకునే మార్గాలు. ధ్రువుడికి ఐదేళ్ళవయస్సులో తీవ్రమైన అవమానం జరిగినప్పుడు వెంటనే మహోన్నతమైన లక్ష్యాన్ని ఏర్పాటు చేసికొన్నాడు. తండ్రిఒడిలో కూర్చోవడానికి అతనికి అవరోధం కలిగింది.

అందుకే అతడు తండ్రికంటే, తాతకంటే, ముత్తాత కంటే పై స్థానంలో కూర్చుంటానని సంకల్పం చేసికొన్నాడు. లక్ష్యం ఏర్పాటు అయిపోయింది. అంతమాత్రాన పని జరిగిపోదు.

అప్పుడు అతనితల్లి సునీతి ఉపదేశం చేస్తూ ధ్రువా! నీకు అవమానం చేసినవారికి అపకారం కలగాలని మాత్రం తలచకు అని పలికింది.

అంటే, హృదయం నిర్మలంగా ఉంచుకొమ్మని, ద్వేషాన్ని దగ్గరకు రానివ్వద్దని చెప్పింది. అప్పుడు ధ్రువుడు తనను అవమానం చేసినవారిమీద ఏమాత్రం ద్వేషం పొందకుండ, వారిమీద కోపం చూపించకుండ మహోన్నత మైన లక్ష్యంతో అడవికివెళ్ళి తపస్సుచేసి భగవద్దర్శనంతో తన కోరికను సాధించుకొని ధ్రువతారగా మిగిలిపోయాడు. ఇదే జీవితంలో విజయరహస్యం!

## జమ్మలమడుగు శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీనారాపుర వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవం


### 2020, మే 06 నుండి 15 వరకు

| తేదీలు | వారం | పగలు ఉత్సవములు | రాత్రి ఉత్సవములు |
|---|---|---|---|
| 06-05-2020 | బుధవారం | ధ్వజారోహణం | పెద్దశేషవాహనం |
| 07-05-2020 | గురువారం | చిన్నశేషవాహనం | హంసవాహనం |
| 08-05-2020 | శుక్రవారం | ముత్యపుపందిరివాహనం | సింహవాహనం |
| 09-05-2020 | శనివారం | కల్పవృక్షవాహనం | హనుమద్వాహనం |
| 10-05-2020 | ఆదివారం | మోహినీ అవతారోత్సవం | గరుడవాహనం |
| 11-05-2020 | సోమవారం | సర్వభూపాలవాహనం | కల్యాణం, గజవాహనం |
| 12-05-2020 | మంగళవారం | రథోత్సవం | అశ్వవాహనం |
| 13-05-2020 | బుధవారం | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 14-05-2020 | గురువారం | చక్రస్నానం | ధ్వజావరోహణం |
| 15-05-2020 | శుక్రవారం | ---- | శ్రీపుష్పయాగ మహోత్సవం |

# తిరునామ శోభితుడు


– శ్రీమతి ఎమ్.వి. లక్ష్మి

**శ్రీరామానుజులు పెరుంబుదూరులో (భూతపురి) కేశవాచార్యులు, కాంతిమతి దంపతులకు జన్మించారు. వీరు పెరిగి పెద్దవారై వైష్ణవమతవ్యాప్తిలో భాగంగా ఎన్నో ఘనతరమైన కార్యాలు చేశారు. ఆకోవలో వీరు ఎన్నో 'తిరునామాలు' పొందారు. అవి ఎలా వచ్చాయి? ఎందుకు వచ్చాయి? కొన్నింటిని గురించి తెలుసుకుందాం...**



## 1) రామానుజులు

వీరు పుట్టినప్పుడు వీరిని చూడాలని వీరి మేనమామ తిరుమల నంబి పెరుంబుదూరుకు వచ్చారట. ఊయల్లో ఉన్న ఆ పసిబిడ్డ ముఖంలో గొప్ప తేజస్సు కనిపించిందట. రాముని అనుజులు అంటే రామునితో కూడా పుట్టిన అతని తమ్ముడు లక్ష్మణుడులాగా, పాలకడలిలో ఎల్లప్పుడూ విష్ణువునే అంటిపెట్టుకుని ఉండే ఆదిశేషునిలాగా, ఈ కలియుగంలో కూడా స్వామినే అంటిపెట్టుకుని ఉండేలా ఈ పిల్లాడు ఉద్భవించాడంటూ తిరుమలనంబి ఆ బిడ్డకు **'రామానుజులు'** అని నామకరణం చేశాడట. ఆయన ఏ ముహూర్తంలో ఆ పేరు పెట్టాడో జగద్విఖ్యాతి గాంచాడు.




## 2) శ్రీభాష్యకారులు

వీరు బ్రహ్మసూత్రాలకు భాష్యం రచించారు. దీనికే శ్రీభాష్యమని పేరు. కాశ్మీరదేశంలోని సరస్వతీపీఠంలో ఉన్న సరస్సునందు తన వ్యాఖ్యానాన్ని చేశారు. ఇది ఇతరమత సిద్ధాంతాల్లోకెల్లా గొప్పగా ఉందని సాక్షాత్తు సరస్వతీదేవి ఎంతగానో ప్రశంసించిందట. ఇతర బ్రహ్మసూత్రాల భాష్యాలన్నింటికంటె మిక్కిలి ప్రశంసించదగ్గదిగా ఉంది కావున దీనికి శ్రీభాష్యమనే పేరొచ్చింది. ఇది నాలుగు అధ్యాయాలతో ప్రణవాకారంగా ఉంది. దీన్ని రచించినందువల్లే వీరికి **'శ్రీభాష్యకారులు'** అన్నపేరు సార్థకమైంది.

## 3) యతీంద్రులు

వీరు తన గురువులైన తిరుక్కచ్చినంబి దంపతులకు ఒకానొక సందర్భంలో తన ఇంట్లో ఆశ్రయమిచ్చారట. కానీ, రామానుజులవారి భార్య బ్రాహ్మణేతరులంటే చాలా చులకనభావంతో చూసేదట. ఆ కోవలో తిరుక్కచ్చినంబి



**19-04-2020 నుండి 28-04-2020 వరకు తిరుమలఆలయంలో భాష్యకార్ల ఉత్సవాలు మరియు 28-04-2020న శ్రీరామానుజజయంతి సందర్భంగా...**



దంపతులను ఒక విషయమై ఘర్షణపడిందట. ఆ సంఘటనకు తిరుక్కచ్చినంబి ఎంతగానో నొచ్చుకుని రామానుజులవారికి కూడా చెప్పకుండా ఇంటినుండి వెళ్లిపోయారట.


ఆ విషయం విని రామానుజులు ఎంతగానో చింతించి, తన భార్యను వదలి అంటే గృహస్థాశ్రమాన్ని వదలి సన్యాసాశ్రమాన్ని తిరుక్కచ్చినంబినుండి స్వీకరించారట. అప్పుడు వరదరాజస్వామివారు మెచ్చి తిరుక్కచ్చినంబి ద్వారా **'యతీంద్రులు'** అని సంబోధించారట.

## 4) ఉడయవర్లు

ఓసారి రామానుజులవారు శ్రీరంగం వెళ్లారట. అక్కడ నంబెరుమాళ్లకు మంగళాశాసనం చేసి వారి తిరుమేని అందాన్ని అలాగే చూస్తూండిపోయారట.

అప్పుడు శ్రీరంగనాథస్వామి రామానుజులను చూచి, నేను నీకు ఉభయవిభూతులను అనుగ్రహిస్తున్నాను. ఇక మీరు నా కోవెల కైంకర్యపరులవుతారు అని అనుగ్రహించారట.

అప్పుడే నంబెరుమాళ్లు వీరికి **'ఉడయవర్లు'** అనే తిరునామాన్ని అనుగ్రహించారట. అలా రామానుజులు శ్రీరంగనాథస్వామికి అన్ని కైంకర్యాలు, ఉత్సవాలను



ప్రవేశపెట్టి, ఆచరించేలా చేసి **'ఉడయవర్లు'** అన్న పేరును సార్థకం చేసుకొన్నాడు.

## 5) ఎంబెరుమానార్

వీరు ఓసారి ఓ విషయమై తిరుక్కొట్టియూర్ నంబి గార్లను కలవడం జరిగింది. వీరిని ఆదరించి నంబిగారు ఎన్నో విషమపరీక్షలకు గురిచేసి, చివరికి మంత్ర రహస్యార్థాన్ని రహస్యంగా బోధించారట. ఎవ్వరికీ చెప్పకూడదని శాసించారట కూడా.

కానీ, రామానుజులు దానిని తానేగాక ప్రజలందరూ కూడా పఠించి భగవత్సాన్నిధ్యాన్ని పొందేలా చేయాలని తలచి ఆలయగోపురంపైకెక్కి అందరికీ వినబడేలా గట్టిగా అరచి చెప్పారట.

## తిరుమలలో భాష్యకార్ల ఉత్సవం తీరు



### హారతి-శేషహారతి

తిరుమలలో అర్చావతారంగా వేంచేసి ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామివారిసన్నిధిలో వేంచేసి ఉన్న శ్రీభాష్యకారులవారికి మేషమాసం, ఆరుద్ర నక్షత్రానికి పదిరోజుల ముందునుండి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయి.

మొదటిరోజు స్వామివారికి ప్రాతఃకాలారాధనం, నివేదనం, శాత్తుమొఱ పూర్తైన తర్వాత అధికారులు, అర్చకస్వాములు, పరిచారకులు మొదలైనవారు శ్వేతచ్ఛత్రాది మర్యాదలతో, మంగళవాద్యాలతో శ్రీవారి శఠారిని వేంచేపు చేసుకొని విమానప్రదక్షిణంగా శ్రీభాష్యకార్లవారిసన్నిధికి వేంచేస్తారు. అక్కడ శ్రీభాష్యకార్లవారిని ఒక తిరుచ్చిలో వేంచేపు చేసుకొని.. తిరువీధుల ఉత్సవం... చేస్తారు. ప్రదక్షిణంగా మహాద్వారంవద్దకు రాగానే ఇహల్‌దోశపడి ఆరగింపు జరిగి విమానప్రదక్షిణంగా శ్రీభాష్యకార్లవారు తమ సన్నిధిలోనికి వేంచేస్తారు. ఆ తర్వాత ఇహల్‌గోష్ఠికి వినియోగం జరుగుతుంది. శ్రీశఠారి శ్రీవారిసన్నిధికి వేంచేస్తారు. ఆ సాయంకాలం నిత్యోత్సవానికిగాను శ్రీమలయప్పస్వామివారు ఒక తిరుచ్చిలో వారికి అభిముఖంగా శ్రీభాష్యకార్లవారు మరొక తిరుచ్చిలో వేంచేసి మహాద్వారం వద్దకు రాగానే శ్రీమలయప్పస్వామివారికి హారతి అయి, శేషహారతి శ్రీభాష్యకారులవారికి జరుగుతుంది. పిమ్మట తిరువీధుల ఉత్సవం జరిగి క్రమంగా శ్రీభాష్యకారులవారి ముఖమండపానికి శ్రీమలయప్పస్వామివారు వేంచేస్తారు. అక్కడ శ్రీవారికి ఆరాధనం, నివేదనములు జరిగి హారతి అయిన పిమ్మట శేషహారతి, శేషపుష్పహారము, శఠారి మొదలైన మర్యాదలు శ్రీభాష్యకార్లవారికి జరుగుతాయి. తర్వాత ఆరగింపు అయిన ప్రసాదం గోష్ఠికి ఆస్థాన బహుమాన పూర్వకంగా వినియోగం చేయబడుతుంది. శ్రీస్వామివారు సన్నిధికి వేంచేస్తారు.



అది విన్న నంబిగారు నీకు కీడు జరుగుతుందని తెలిసికూడా పరోపకారానికే మొగ్గుచూపావని అంటూ గొప్పగా పొగడి నీకు **'ఎంబెరుమానార్'** అన్న బిరుదును అనుగ్రహిస్తున్నాను అంటూ ప్రశంసించారు.

### 6) భూతపురిమునులు

శ్రీపెరుంబుదూరుకే మునుపు భూతపురి అని పేరు. ఇది విష్ణుప్రీతికరక్షేత్రం. ఈ క్షేత్రం ఎల్లప్పుడూ సర్వసంపదలతో, ఆధ్యాత్మికక్షేత్రంగా విలసిల్లుతూండేది.

అలాంటి ఈ క్షేత్రంలో పుట్టి, ఇంతింతై వటుడింతయై అన్నట్లు ఎన్నో ఘనమైన కార్యాలతో వీరికే గాక వీరి ఊరికి కూడా గొప్ప కీర్తి ప్రతిష్ఠలు ఆర్జించిపెట్టారు.



అందుకని వీరికి ఆ ఊరి ప్రజలనుండి **'భూత పురిమునులు'** అన్న నామధేయం సార్థకమైంది.

## 7) గోదాగ్రజులు


గోదాదేవి రచించిన '140' పాశురాలున్న **'నాచ్చియార్ తిరుమొళి'**లో శ్రీమహావిష్ణువును స్తుతించి ఉంది. అందు ఒకదాంట్లో సుందరాచలమునందున్న సుందరబాహుస్వామికి 'నాకు రంగనాథునితో పెళ్లైతే నీకు నూరు



వెన్నభాండాలను, నూరు చక్కెరపొంగలిఘటాలను నైవేద్యంగా పెడ తాను' అని మొక్కుకుందిట. కానీ ఆమెకు ఆ మొక్కు తీర్చడానికి అవకాశం లేకపోయిందట. ఎందుకంటే శ్రీరంగనాథస్వామితో పెళ్లైన వెంటనే ఆ స్వామిలో ఐక్యమైపోయింది కదా. ఆ మొక్కువిషయం తెలుసుకున్న రామానుజులు వానాద్రికి వెళ్లి ఆ మొక్కును చెల్లించారట.

తర్వాత శ్రీవిల్లిపుత్తూరుకు వెళ్లి, అక్కడ వటపత్రశాయిని సేవించి ముకుళితహస్తాలతో నిలబడ్డాడట. అప్పుడు ఆండాళ్‌దేవి అర్చకులద్వారా తీర్థప్రసాదాలు అనుగ్రహించిందట. తన అన్నలాగా తన కోరికను తీర్చాడని రామానుజులకు **'గోదాగ్రజులు'** అన్న బిరుదు నిచ్చి సత్కరించిందట.

## 8) తిరుప్పావైజీయరు



వీరు ఉంఛ వృత్తిలో ఉండి భిక్షాటనకు వెళ్లినప్పుడు గోదాదేవి రచించిన 'తిరుప్పావై'ని పఠించేవారట. ఇలా తిరుప్పావైని అందరికీ వినిపించి భక్తులంతా భాగవతకైంకర్యంలో పాల్గొనేలా చేసేవారట. అందుకే ఆయనకు **'తిరుప్పావైజీయరు'** అన్న నామధేయం సార్థకమైంది.

శ్రీమహావిష్ణువుకు శయ్య, వాహనాదులుగా ఉపయోగించు ఆదిశేషుడే శ్రీరామచంద్రుడికి అనుజుడైన లక్ష్మణుడే అనేకరీతులుగా భగవంతుడైన అగ్రజుని సేవించి కృతార్థుడైనాడు. రామానుజుడైన ఆ లక్ష్మణుడే మరలా ఈ రామానుజమునిగా అవతరించి విష్ణుభక్తిని విరివిగా వ్యాపింపజేసి సాక్షాత్ విష్ణుస్వరూపుడని, జగద్గురువని కీర్తింపబడ్డాడు. వీరు 120 సం॥లు జీవించి దీర్ఘాయుష్మంతులుగా కీర్తి గడించారు. పై చెప్పినట్లు వివిధ తిరునామాలతో, శ్రీవైష్ణవమత ప్రచారబోధకులుగా, చిరస్మరణీయులుగా ఆచంద్రతారార్కం ఈ భువిపై నిలిచిపోయిన మహనీయులుగా ప్రసిద్ధి పొందిన వీరికి ప్రణామాలర్పిద్దాం.



ఆశలేని చోట కృషి లోపిస్తుంది

# అన్నమయ్య జీవితచరిత్ర

01

- డా॥ మన్నూరు శివప్రవీణ్,
94405 15569

**భూ**లోకవైకుంఠంగా భాసిల్లే పవిత్రగిరి తిరుమల. ఆ పరమపావనమైన కొండలలో అణురేణు పరిపూర్ణుడై వ్యాపించిన శ్రీవేంకటాచలాధీశుడిని తన పదకవితలతో అర్చించిన అన్నమయ్య ధన్యజీవి. గానలోలుడైన ఆ శ్రీహరికి 32వేలసంకీర్తలను సమర్పించి, తనను తాను ధన్యం చేసుకోవడమే కాకుండ, తెలుగుజాతినీ ధన్యం చేశాడు. సభా ప్రశంసలకోసమో, సాహితీగోష్ఠులకోసమో, సన్మానాల కోసమో కాక కేవలం భగవంతుడైన శ్రీహరిని చేరుకోవడానికే తన సంకీర్తనారచనంతా సాగింది. అందుకే అన్నమయ్య చిరస్మరణీయుడైనాడు. చిరంజీవత్వాన్ని పొందాడు.

32వేల సంకీర్తనలతో స్వామివారి లీలలను గానం చేసిన అన్నమయ్య తెలుగుసాహిత్యచరిత్రలో పదకవితా పితామహుడిగా ఖ్యాతి గడించాడు. తిరుమల వేంకటేశ్వరుడిపై ఆశువుగా పదకవితలల్లి అనేకవిధాలుగా స్తుతించాడు. స్వామివారిలీలలను, దశావతారఘట్టాలను, రామాయణ, భారత, భాగవత పురాణాలను, తన పదకవితలలో ప్రస్తుతించాడు. శ్రీవేంకటేశ్వరస్వామి భక్తిని ప్రచారం చేస్తూ ఆనాటి ఆంధ్రదేశమంతా తిరిగాడు. ఎన్నో క్షేత్రాలు సందర్శించాడు. తీర్థాలను సేవించాడు. తిరుపతి శ్రీగోవిందరాజస్వామి, కడప శ్రీవేంకటేశ్వర స్వామి, ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి, ప్రొద్దుటూరు శ్రీచెన్నకేశవస్వామి, అహోబిల శ్రీనారసింహస్వామి, మార్కాపురం శ్రీచెన్నకేశవస్వామి, కోయిలకుంట్ల శ్రీపాండురంగ స్వామి, శ్రీరంగం శ్రీరంగనాథ స్వామి, వాయల్పాడు శ్రీపట్టాభిరామస్వామి, కసాపురం శ్రీఆంజనేయస్వామి... ఇలా ఎన్నో క్షేత్రాలలో వెలసిన వివిధ అర్చావతారమూర్తులను దర్శించి, తాను సందర్శించిన అర్చావతారాలలో నిరంతరం తాను కొలిచే శ్రీవేంకటేశ్వరుని భావించి, వారంతా శ్రీనివాసుని ప్రతిరూపాలుగా ఊహించి పదాలు పాడాడు.

నిత్యకల్యాణోత్సవం, మేలుకొలుపు, పవ్వళింపు, వసంతోత్సవం ఇలా స్వామివారికి జరిగే ప్రతి కైంకర్యంలోనూ ఆయా సందర్భాలకు తగిన పదాలు రచించి కృతార్థుడయ్యాడు.

కడపజిల్లా, రాజంపేట మండలంలోని చిన్నగ్రామమైన తాళ్లపాకలో లక్కమాంబ, నారాయణసూరి అనే పుణ్య దంపతుల గర్భవాసాన క్రీ.శ.1408వ సంవత్సరం వైశాఖ మాసపౌర్ణమితిథినాడు శ్రీహరి నందకాంశతో జన్మించాడు అన్నమయ్య. తన అయిదవఏట ఉపనయన, విద్యాభ్యాసాలు జరుగగా, ఒకనాడు గడ్డికోసమై అడవికి వెళ్లి అటు నుండి వేంకటేశుని భక్తులతో గూడి తిరుమలగిరి చేరుకొని స్వామిని దర్శించి, తన పదహారవఏట సంకీర్తనయజ్ఞాన్ని ప్రారంభించాడు.

సాళువ నరసింహరాయల ఆహ్వానంమేరకు పెనుగొండ చేరి అక్కడ కొంతకాలం రాజాశ్రయంలో ఉండి పదకవిగా జగత్ప్రసిద్ధుడయ్యాడు. రాయలను కీర్తించలేదనే



కారణంతో సంకెళ్ళతో బంధింపబడి, విముక్తుడై, విరక్తుడై తిరుమల పురాధీశునిసేవలో శేషజీవితాన్ని గడిపి తరువాతి పదకవులకు మార్గదర్శకుడయ్యాడు. ఇది అన్నమయ్య గురించిన సంక్షిప్తచరిత్ర.

అన్నమయ్య పదార్చన ఆయనతోనే ముగిసిపోలేదు. వారి వంశం ఒక సాహితీవనం. ఆ వనంలో విరబూసిన ప్రతికుసుమమూ స్వామివారి దివ్యపాదపద్మాలను ఆశ్ర యించినదే. అన్నమయ్య పదకవితాపితామహుడైతే, ఆయన భార్య తాళ్లపాక తిమ్మక్క తెలుగులో ప్రథమ కవయిత్రి. అదొక విశిష్టమైన కుటుంబం. ఆయనవంశంలో, ఆయన తరువాత అయిదుతరాలవారు తమ సాహిత్యంతో ఆ అల మేలుమంగాపతిని సమర్చించటం మరెక్కడ దర్శించలేము.


తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

**గోదాతలకు విజ్ఞప్తి**

1) **దేశవాళీ గోవులను తిరుపతిలోని తి.తి.దేవస్థానమునకు సంబంధించిన శ్రీవేంకటేశ్వర గోసంరక్షణశాల నందు మాత్రమే ముందస్తు అనుమతితో స్వీకరించబడతాయి.**

2) **ఆరోగ్యవంతమైన దేశవాళీ గోజాతి ఆవులు మాత్రమే స్వీకరించబడుతాయి.**

గోసంరక్షణాధికారి,
తి.తి.దే., తిరుపతి




తాము నమ్మిన తిరుమలనాథుని గుణగానసంకీర్తనమే ఉచ్ఛ్వాసనిశ్వాసాలుగా జీవించిన తాళ్లపాకవారి వంశం గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

## అన్నమయ్యవంశం

అన్నమయ్య నందవరాన్వయుడని తాళ్లపాక చిన్నన్న వ్రాసిన అన్నమాచార్యచరిత్ర ద్విపదకావ్యంలో పేర్కొన్నాడు. నందవరీక బ్రాహ్మణకుటుంబానికి చెందినవాడు అన్నమయ్య.

ఈ వంశం వెనుక ఒక ఐతిహ్యం ఉంది. క్రీ.శ. 10వ శతాబ్దంలో ఇప్పటి కర్నూలుజిల్లాలోని "నందవరం" అనే గ్రామాన్ని నందుడనే రాజు పరిపాలించేవాడు. ఇతడు పాండవవంశానికి చెందినవాడని ప్రతీతి.

ఇతనికి ప్రతిరోజూ కాశికి వెళ్ళి ఉషఃకాలంలో గంగాస్నానం చేసి రావాలనే కోరిక ఉండేది. దత్తాత్రేయుడు అనే సిద్ధుడి మంత్రశక్తిద్వారా ప్రతిరోజూ కాశికి వెళ్ళి, గంగాస్నానమాచరించి, సూర్యోదయానికి ముందే ఇల్లు చేరేవాడు.

ఒకరోజు ఆయనభార్య ఈ విధానాన్నంతా గమనించి, తాను కాశికి వస్తానని పట్టుబట్టి, అతనితో కాశికి వెళ్ళి గంగాస్నానమాచరించి తిరిగి వచ్చేవేళ ఋతుస్నాత అవడంచేత, వారి మంత్రశక్తి పని చేయలేదు. ఆ సమయంలో నందుడు కాశిలో ఉండే మహిమాన్వితులైన వేదపండితులను ఆశ్రయించాడు. ఆ కాశీబ్రాహ్మణులు తమ తపఃశక్తి ధారపోసి వారిని ఇల్లు చేర్చారు.

అందుకు ప్రతిగా వారికి ఎలాంటి సహాయం కావాలన్నా తాను చేస్తానని గంగాదేవి ప్రతిరూపంగా భాసిల్లే చాముండేశ్వరీదేవి సాక్షిగా నందుడు ప్రతిజ్ఞ చేశాడు.

కొంతకాలానికి కాశిలో క్షామం ఏర్పడటంవలన, రాజుగారి ప్రతిజ్ఞ జ్ఞప్తికి తెచ్చుకొని కాశీపండితులు నందవరానికి వచ్చి సహాయం అర్థించారు.

*(ఇంకా ఉంది)*



ఆశ ఉన్నచోట మంచి ఆలోచనలు ఉంటాయి

బాలప్రబోధం

# పరశురాముడు


-డా॥కె. అంజనప్ప, 040-23550005

భగవత్స్వరూపుడైన పరశురాముని పేరు వినగానే ఎందుకో చాలామంది భయపడతారు. పరశురామావతారం దశావతారాల్లో ఆరవ అవతారమైనప్పటికి, ఇతని అవతారాన్ని అవశేష అవతారమంటారు. అతనంటె భయానికి ఆకారమే గాకుండా చేతిలో ఉన్న గండ్రగొడ్డలి గూడ కారణం గావచ్చు. అధికారబలమదాంధులైన రాజులను, రారాజులను తన గండ్రగొడ్డలితో నరికి శిక్షించిన మహనీయుడు. కర్తవ్యపాలనలో ఇతడికి సాటివచ్చే ధీశాలి మరొకడు కనిపించడు. మహాపరాక్రమవంతుడైన పరశురాముని తండ్రి జమదగ్నిమహర్షి ముక్కోపి. తల్లి రేణుకాదేవి సాధ్వి.

చిన్నతనంలోనే పరశురాముడు శివునివద్ద అస్త్ర, శస్త్రవిద్యలను అభ్యసించి పరాక్రమానికి మారుపేరుగా మారి, తన గండ్రగొడ్డలితో సాటి రాజులందరిని గడగడలాడించాడు. మహావీరుడైన కార్తవీర్యార్జునుని వేయిచేతులు, తలను, తన గండ్రగొడ్డలితో ఖండించి, అతని మదమడిచి, తండ్రికి జరిగిన అవమానానికి తగిన శాస్తిజేశాడు. ముక్కోపి ఐన జగదగ్నిమహర్షి భార్యపై కోపంతో, కొడుకులను బిలిచి ఆమె తల నరకమని ఆజ్ఞాపించాడు. అయితే, పెద్ద కొడుకులు తల్లిని తలనరకుట మహాపాపమని తలచి తండ్రి ఆజ్ఞ నెరవేర్చలేదు. చివరకు తండ్రి చిన్నకుమారుడైన పరశురాముని ఆజ్ఞాపించాడు.

పరశురాముడేమాత్రం సంకోచింపక తల్లిని నరకగా, తండ్రి వరం కోరుకొమ్మన్నాడు. తల్లిని బ్రతికించ మనగా తండ్రి అంగీకరించి బ్రతికించాడు. ఇది పరశురాముని సర్వజ్ఞతకు, సమయస్ఫూర్తికి గీటురాయి. భయపెట్టడమేగాక బ్రతికించగల శక్తి గలిగిన ధీశాలి.

సీతారామకల్యాణసందర్భంలో, శ్రీరాముడు శివ ధనుస్సును అవలీలగా విరిచాడు. ఆ విల్లు గురువైన శివుడిది కాబట్టి పరశురాముడు శ్రీరామునితో యుద్ధానికి సన్నద్ధుడయ్యాడు. చేతనైతే తన విల్లునెక్కుపెట్టమని ధనుస్సును శ్రీరామునికిచ్చాడు. శ్రీరాముడూ విష్ణుఅవతారం కాబట్టి, తన విల్లు తాను ఎక్కుపెట్టడం చేతిలో పని. ఎక్కుపెట్టిన బాణాన్ని పరశురాముని తపోశక్తిపై విడిచి అతని గర్వమణచాడు. ఒకే బాణాన్ని ఇద్దరు సులభంగా సంధించగలిగారు కాబట్టి, శ్రీరామునకు పరశురామునకు



బేధం లేదని తెలియడంవల్ల పరశురామావతారం అవశేషావతారం అంటారు.

విష్ణువవతారం కాబట్టే పరశురాముడు అస్త్ర శస్త్ర విద్యలలో ఆరితేరిన భీష్మపితామహునికి, ద్రోణాచార్యునికి, దానకర్ణునికి దివ్యాస్త్రాల ప్రయోగం నేర్పించి, మహామహుల గురువుగా కీర్తింపబడ్డాడు. కర్ణుడు బ్రాహ్మణుడని అబద్ధం చెప్పి శిష్యుడైనందువల్ల యుద్ధసమయమందు అస్త్రప్రయోగ మంత్రములు గుర్తుకు రాకుండా శపించాడు. ఈ శాపమే లేకపోతే కర్ణుని అడ్డుకొనేవాడు ఈ భూమండలంలో లేరు! అవశేషావతారం కావడంవల్ల పరశురామునకు చెప్పుకోదగ్గ ఆలయాలు ప్రత్యేకంగా ఎక్కడా లేవని చెప్పవచ్చు.

**25-04-2020న శ్రీపరశురామజయంతి సందర్భంగా...**



# దండమయా... ఒంటిమిట్ట కోదండరామయ్యా!

- శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
80996 81422

**02-04-2020 నుండి 11-04-2020 వరకు ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామివారి బ్రహ్మోత్సవం సందర్భంగా...**

ఆంధ్రప్రదేశ్‌లోని రామాలయాల్లో కడపజిల్లా ఒంటిమిట్ట గ్రామంలో ఉన్న శ్రీకోదండరామాలయం అత్యంత ప్రసిద్ధమైనదీ, చారిత్రక మైనదీ కూడా. ఇక్కడ ప్రతి ఏటా శ్రీరామనవమి సందర్భంగా శ్రీకోదండరామునికి బ్రహ్మోత్సవం తి.తి.దేవస్థానంవారి ఆధ్వర్యంలో అంగరంగవైభవంగా జరుగుతుంది. అందులో తొమ్మిదిరోజుల పాటు వివిధవాహనాలపై కొలువై పురవీథుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేస్తారు. ఈ వాహనసేవలు న్యాసాభిషేకం, అంకురార్పణతో మొదలై ఆ తర్వాత ధ్వజారోహణ కార్యక్రమంతో ప్రారంభమౌతాయి. ఇందులో ధ్వజపటాన్ని ఎగురవేసి ముక్కోటిదేవతలకు ఆహ్వానం పంపుతారు. ఆ తర్వాతే వాహనసేవలు ప్రారంభమవుతాయి. ఆ వాహనసేవల విశేషాలేంటి? వాటి ప్రాశస్త్యమేంటో తెలుసుకుందాం.....

## 1)శేషవాహనా శ్రీరామ

ఈసేవ మొదటిరోజురాత్రి జరుగుతుంది. ఆదిశేషుడే శ్రీమన్నారాయణుణ్ణి విడువకుండా రామావతారంలో లక్ష్మణస్వామిగా రామసేవలోనే ఉండి స్వామిభక్తిపరాయణుడైనాడు. శేషం అంటే ఎప్పటికీ మిగిలి ఉంటుందనేది అని అర్థం. ఆ శేషం తిరుగు లేని శాశ్వతమైన జ్ఞానానికి గుర్తు. అటువంటి జ్ఞానానికి ఆలయంగా, ఆలంబనంగా కలవాడు శ్రీమన్నారాయణుడు. కనుక ఆయన శేషశయనుడు. మనసా, వాచా, కర్మణా స్వామినే శరణువేడుమనేదే శేషుని సందేశం. నేను, నా సేవ, నా ఆరాధనను జ్ఞప్తికి తెస్తూ ఆర్తితో స్వామిని మనవైపు చూసేలా చేసుకోవాలన్నదే ఈ వాహనపరమోద్దేశ్యం. ఈ వాహనసేవవల్ల స్వామి కరుణాకటాక్షసిద్ధి లభిస్తుంది.



## 2) వేణుగానాలంకారా శ్రీరామ

ఈ సేవ రెండోరోజు ఉదయం జరుగుతుంది. వేణువులోపల ఖాళీగా ఉంటుంది. అదే దానియొక్క విశేషం. అందులో ఏ విధమైన సామగ్రి ఉండదు. వస్తులోకాన్నంతటిని వదలి అంతరంగాన్ని దృశ్యరహితంగా ఒనర్చుకుంటుంది. అందుకే ఇది శ్రీకృష్ణునకు అత్యంత సన్నిహితపాత్రమైంది. దానిలాగే ఎవరైనా సరే తమ అంతఃకరణమందున్న వాసనా జాలాన్ని, దుష్టసంస్కారాల్ని, ప్రాపంచిక విషయసంకల్పాలను తొలగించుకొని మనస్సును నిర్విషయం గావించి నిస్సంకల్పస్థితిని పొందినట్లైతే అట్టివారు భగవంతునికి అతి సమీపంలో



వర్తింపగల్గుతారు. మనశ్శుద్ధియే, అంతః కరణంయొక్క నిర్మలత్వమే దైవప్రాప్తికి హేతువౌతుంది. ఇదే వేణువుయొక్క హేతువాదసమన్విత పరమార్థం. భగవ త్ప్రాప్తికి మనోనిర్మలత్వమే ఏకైక కారణ మని వేణువుద్వారా స్వామి మనకు తెల్పు తున్నాడు. ఈ వాహనసేవవల్ల మనోనిర్మ లత్వం సిద్ధిస్తుంది.

## 3) హంసవాహనా శ్రీరామ


ఈ సేవ రెండోరోజు రాత్రి జరుగుతుంది. 'హంస' పదానికి 'ఆ పర బ్రహ్మం నేనే' అని అర్థం. 'శివోహం', 'శివుడు నేనే' అనే పదానికి సమానమైనది.



మోక్షానికి జపమంత్రాల్లో 'హంస' మంత్రమొకటి. ఇది ఒక జ్ఞానమంత్రం. దీని సాధన మోక్షసిద్ధి కల్గిస్తుంది. భగవం తుడు హంసరూపాన్నే ఎన్నుకొని వేదాల్ని ఉపదేశించాడు. హంస పరమాత్మవాచకం. పరమహంస మహాయోగివాచకం. హంస అతిస్వచ్ఛం, శుద్ధసత్త్వస్వరూపం. అందుకే వేదాత్మకుడైన బ్రహ్మ హంసను తనకు వాహనంగా ఎన్నుకున్నాడు. మంచి చెడ్డలు, బాగోగులు వేరుపరిచే వివేకప్రతీక హంస. ఈ వాహనసేవవల్ల ఆత్మానాత్మ వివేకసిద్ధి కల్గుతుంది.

## 4) వటపత్రశాయీ శ్రీరామ

ఈ సేవ మూడోరోజు ఉదయం జరుగుతుంది. ఒక్కొక్క మన్వంతరం పూర్తికాగానే ప్రళయం సంభవిస్తుంది. అప్పుడు యావత్సృష్టి బీజరూపంలో



మాత్రమే ఆ పరమాత్మునియందు నిక్షిప్తమై ఉంటుంది. కొత్త సృష్టి ప్రళయంతర్వాతనే. అప్పుడు మేఘాలను ఏకధారగా కురిపించగా మొత్తం జలమయమైపోతుంది. అప్పుడు ఆది విష్ణువు వటపత్రశాయి అయి సమస్తచరాచర జగత్తును సూక్ష్మరూపంలో తన బొజ్జలో ఉంచుకొని, రక్షించి, లేతమఱ్ఱిఆకుపై పరుండి, ప్రళయజలాలపై తేలియాడుతూ యోగనిద్రలో ఉంటాడు. ఈ అలంకారంలో స్వామి ఎంతో ముగ్ధతతో కనువిందు చేస్తాడు. ఈ వాహన సేవవల్ల పూర్వజన్మపుణ్యఫలసిద్ధి కల్గు తుంది.

## 5) సింహవాహనా శ్రీరామ

ఈ సేవ మూడోరోజు రాత్రి జరుగుతుంది. విష్ణుమూర్తికి హరి అనే



పేరుంది. సింహానికీ హరి అనే పేరుంది. హరి మీద హరి కూర్చుం టాడు. సింహం గాంభీర్యపరాక్రమాలకు పుట్టిల్లైన మృగరాజు. అందుకనే సింహాన్ని తన స్వరూపంగానే అను కున్నాడు స్వామి. దుర్మార్గులను సంహ రించడానికే సింహావతారమెత్తాడు కాబట్టి రాముడు ఈ వాహనంపై విజయం చేస్తాడు. ఈ వాహనసేవవల్ల శత్రుభయనివారణాసిద్ధి కల్గుతుంది.

## 6) నవనీతకృష్ణా శ్రీరామ

ఈ సేవ నాలుగోరోజు ఉదయం జరుగుతుంది. వ్రేపల్లెలో ఉన్న ప్పుడు చిన్నారికన్నయ్య గోపకాంతుల హృదయాలనే కడవలనుండి భక్తి అనే వెన్నను, ఆత్మార్పణం అనే మీగడను దొంగలించి, వారితో దోబూచులాడాడు.



ఆధ్యాత్మిక విలువల గురించి ఏమీ తెలీని గోపకులకు నేర్పించే విధంగా మనకుకూడా ఈ అలంకారంలో తెలియజెప్పడమే ఈ వాహన ముఖ్యోద్దేశ్యం. ఈ వాహనసేవవల్ల ఆధ్యాత్మిక విలువలతో కూడిన భక్తి, ఆత్మార్పణసిద్ధి కల్గుతాయి.

## 7) హనుమద్వాహనా శ్రీరామ

ఈ సేవ నాలుగోరోజు రాత్రి జరుగుతుంది. హనుమంతుడికున్న రామప్రభుభక్తి అనన్యసామాన్యం. మూర్తీ




భవించిన ప్రభుభక్తి ప్రభంజనసుతుడు. ఈయన రామునికి చేసిన మహోపకారాలూ, అనితరసాధ్య సాహసోదార కృత్యాలూ ఎనలేనివి. హనుమంతునిది ఒక ప్రత్యేక దివ్య చరిత్ర. అలాంటి హనుమంతుడి భుజాలపై అధిష్ఠించి రాముడు ఊరేగేసేవ చూడాలంటే కోటిజన్మలసుకృతఫలం లభించాల్సిందే. ఈ వాహనసేవవల్ల భగవద్భక్తిచింతన కల్గుతుంది.

## 8) మోహినీరూపా శ్రీరామ

ఈ సేవ ఐదోరోజు ఉదయం జరుగుతుంది. శ్రీరామచంద్రుడికి ఈ వేషధారణ బహుభావగర్భితం. మహానందసంధాయకం. ఈ అవతారమెత్తే స్వామి రాక్షసులను సంహరించి, దేవతలకు అమృతత్వసిద్ధిని కల్గించి, చిరంజీవులుగా వర్ధిల్లేట్లు చేశాడు. మోహినీఅవతారం ఐతిహ్యచిహ్నంగానే స్వామికి మోహినీఅవతరాం వేసి పల్లకిలో కన్నుల పండువుగా ఊరేగిస్తారు. ఈ వాహనసేవవల్ల మాయామోహబంధవిచ్ఛిత్తి కల్గుతుంది.



## 9) గరుడవాహనా శ్రీరామ

ఈ సేవ ఐదోరోజు రాత్రి జరుగుతుంది. ఈయన అతి బలాఢ్యుడు. పుట్టగానే తల్లి దాస్యశృంఖలాల్ని ఛేదించాడు. దానికోసం అవరావతిపైనే దండెత్తాడు. అప్పుడే తనతండ్రి కశ్యపుడు విష్ణువుకు వాహనంగా వరమిచ్చాడు.




మూర్తీభవించిన వేదాలే గరుడుడు. ఇంతటి మహిమాతిశయంవల్లనే ఈ విహగరాజు శ్రీస్వామికి మిక్కిలి అనుంగు సేవకుడయ్యాడు. గరుత్మంతుడు వేదాత్మకుడు కాబట్టి భగవంతుడు వేదప్రతిపాద్యుడే కాబట్టి తన పరమాత్మ స్వరూపాన్ని గరుడనిలో చూసుకుంటాడు. ఈ వాహనసేవ వల్ల అఖండతేజోసంపన్నసిద్ధి కల్గుతుంది.

## 10) శివధనుర్బాణాలంకార శ్రీరామ

ఈసేవ ఆరోరోజు ఉదయం జరుగుతుంది. రామలక్ష్మణులను విశ్వామిత్రుడు సీతాస్వయంవరానికి తీసుకెళ్లాడు. అక్కడ జనకుడు శివధనువును విరిచి తన కుమార్తె సీతను వివాహమాడాల్సిందిగా ప్రకటించాడు. అప్పుడు రాముడు ఆ శివధనువును ఒక్కవేటుతో విరిచి



సీతమ్మను పరిగ్రహించాడు. అందుకు గుర్తుగా శివ ధనుర్బాణాలను చేత ధరించిన అలంకారంలో స్వామి ఎంతో శోభాయమానంగా ఊరేగుతాడు.

ఈ వాహనసేవవల్ల ఇష్టకామ్యార్థసిద్ధులు కల్గుతాయి.

## 11) కల్యాణోత్సవ శ్రీరామ

ఈ ఉత్సవం ప్రత్యేకించి ఆరోరోజు రాత్రి అనగా చతుర్దశినాటి రాత్రి జరుగుతుంది. శ్రీరాముడు పునర్వసు నక్షత్రంలో, సీతాదేవి ఉత్తరఫల్గుణీనక్షత్రంలో జన్మించారు. సీతారామకల్యాణం ఉత్తరఫల్గుణీనక్షత్రంలోనే నిర్ణయమైంది.



ఇందులో అక్షతలకు ప్రాధాన్యముంటుంది. ఇందులో ధాన్యం అంటే పరబ్రహ్మస్వరూపం. పసుపు మంగళప్రదాయకం. కుంకుమ సాక్షాత్తు అమ్మవారిస్వరూపం. ఈ పసుపు కుంకుమ కలిపినదే సీతారాములస్వరూపం. అలాంటి అక్షతలను తలపై ధరిస్తే సర్వశుభాలూ కల్గుతాయని పురాణాల మాట. ఈ ఉత్సవసేవవల్ల సకలకల్యాణపరంపరలు సిద్ధిస్తాయి. ఈ కల్యాణోత్సవానికి రాష్ట్రప్రభుత్వం తరపున పట్టువస్త్రాలను కూడా ఘనంగా సమర్పించడం జరుగుతుంది.

## 12) గజవాహనా శ్రీరామ

ఈ సేవ ఆరోరోజు రాత్రి జరుగుతుంది. సామజం అని దీనికి పేరు. సామవేదంలోంచే పుట్టిందని అర్థం. సముద్రంనుండి పుట్టిన ఐరావతమే ఈ జాతికి కూటస్థమేమొ. ఏనుగు ఐశ్వర్యానికి ప్రతీక. సిరిసంపదలకు సామజం కాణాచి. అలాంటి ఈ గజం విష్ణుప్రియం. అలాంటి గజంపై ఊరేగుతూ రామభద్రుడు భక్తులకు.. ఎంతో ఠీవిగా కన్పిస్తాడు. ఈ వాహనసేవవల్ల అష్టైశ్వర్యసిద్ధి కల్గుతుంది.



## 13) బ్రహ్మరథారూఢా! శ్రీరామ

ఈ ఉత్సవం ఏడోరోజు ఉదయం జరుగుతుంది. 'రథ' శబ్దానికి మనసుకు ఉల్లాసాన్నిచ్చేదని అర్థం. రథోత్సవం చాలా ప్రశస్తం. రథంతోనే ఉత్సవానికి పూర్ణత. మానవుడొక్కసారి భక్తిశ్రద్ధలతో రథంలో ఉండే స్వామిని దర్శిస్తే చాలు!



జననమరణ ప్రవాహాత్మక సంసార జంజాటం ఇక ఉండదు. ముక్తుడౌతాడు. భక్తులందరూ రథాన్ని లాగుతూ స్వామిని ఎలుగెత్తి పిలుస్తూ ముందుకు సాగుతారు. ఈ ఉత్సవసేవవల్ల జీవన్ముక్తి కల్గుతుంది.


## 14) కాళీయమర్దనా శ్రీరామ

ఈ సేవ ఎనిమిదోరోజు ఉదయం జరుగుతుంది. కాళిందినదిలో కాళీయసర్పవిషంవల్ల గోవులన్నీ ఆ నీరు త్రాగి చనిపోతూండేవి. అది చూసి చిన్నికృష్ణుడికి చాలా కోపమొచ్చి కాళిందినదిలో ఉన్న కాళీయుని తోకను ముడిచి, దాని తలపై ఒక గెంతులో గెంతి నిలబడి నృత్యం చేశాడు. కాళీయుడు శరణువేడి అక్కడినుండి వెళ్లిపోయాడు. అప్పటినుండి గోవులన్నీ హాయిగా తిరుగాడసాగాయి. వేదాంత



పరంగా మనమనస్సే కాళీయుడు. దుష్ట ఆలోచనలే కోరలు. అరిషడ్వర్గాలే ఫణులు. అహం ఉన్నంత వరకు సోహంవైపు పయనించలేం. ఆ కన్నయ్య దర్శనం కల్గినపుడే తమస్సు తొలగుతుంది. కృష్ణుని పాదారవిందాలు మన శిరస్సున నాట్యం చేసినప్పుడే ముక్తి లభిస్తుంది. ఇలా శరణన్నవారికి అభయమిచ్చే ఈ అలంకారంలో స్వామి ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తాడు. ఈ వాహనసేవవల్ల భగవత్ కటాక్షసిద్ధి కల్గుతుంది.

## 15) అశ్వవాహనా శ్రీరామ



ఈ సేవ ఎనిమిదోరోజు రాత్రి జరుగుతుంది. సేనా చతురంగాల్లో గుర్రం చేరుతుంది. అశ్వం చాలా ముచ్చటైన సిరులొలికే నిగనిగలాడే రాజసం చిందులాడే అతి చలాకీ అయిన చతుష్పాత్తు. రాజలాంఛనాలలో అశ్వజాతికే ప్రాముఖ్యం. వాటి ఉనికి లక్ష్మీకరం. సముద్ర మథనవేళ ఉచ్చైశ్రవం పుట్టింది. ఇలాంటి అశ్వారూఢుడైన కోదండరాముణ్ణి వర్ణించ తరం కాదు. ఈ వాహనసేవవల్ల లక్ష్మీప్రదసిద్ధి కల్గుతుంది.

## 16) చక్రస్నానవిలసితా శ్రీరామ

ఈ ఉత్సవం తొమ్మిదోరోజు ఉదయం జరుగుతుంది. ఈ ఒంటిమిట్టలో రామయ్య సీతమ్మకోసం తన బాణంతో ఒకధారను రప్పించాడు. దాని పేరే రామతీర్థం. అందులోనే చివరిఘట్టం చక్రస్నానం జరుగుతుంది. ఎక్కడెక్కడినుండో భక్తులంతా వచ్చి ఈ రామతీర్థంలో చక్రస్నానసమయంలో మునుగుతూ మోక్షాన్ని ప్రసాదించమని వేడుకొంటారు. ఈ చక్రస్నాన వీక్షణంవల్ల సర్వాయురారోగ్యసిద్ధి కల్గుతుంది. ఈ విధంగా వాహనసేవలన్నీ



పూర్తైన తర్వాత ఆ రోజు సాయంత్రం ధ్వజావరోహణ కార్యక్రమంలో ధ్వజపతాకాన్ని క్రిందకు అనవరతం చేసి ఉత్సవ సమాప్తి గావిస్తారు. ఇంతటితో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

## 17) పుష్పయాగశోభితా! శ్రీరామ

ఈ యాగోత్సవం బ్రహ్మోత్సవాల అనంతరం మరుసటిరోజు జరుగుతుంది. ప్రకృతి ప్రసాదించిన వివిధ ఉత్తమ జాతిపుష్పాలను విశేషంగా స్వామికి సమర్పిస్తూ అఖండంగా మంగళకరవాతావారణంలో ఈ క్రియ జరుగుతుంది. ఈ యాగంవల్ల బ్రహ్మోత్సవంలో జ్ఞాతాజ్ఞాతదోషాలు ఉపశమిస్తాయి. ఈ వైభవాన్ని భక్తితో వీక్షించినవారికి ఉత్తమఫలాలు కల్గుతాయి. జరిపించినవారి ఇరవైఒక్కతరాలు విష్ణుసాయుజ్యం పొందుతారని వైఖానసశాస్త్రం వాక్కు.



ఇలా పై వాహనసేవాకార్యక్రమాల్లోనైతేనేమీ, రథోత్సవం, కల్యాణోత్సవం, చక్రస్నానం, పుష్పయాగంలాంటి మహత్తర ఉత్సవ కార్యక్రమాల్లోనైతేనేమీ భక్తులందరమూ పాల్గొని ఒంటిమిట్ట శ్రీకోదండరామయ్యస్వామివారి అపార విశేషఅనుగ్రహాన్ని పొందుదాం.

తిరుమల తిరుపతి దేవస్థానములు

# కార్వేటినగరం
# శ్రీవేణుగోపాలస్వామివారి బ్రహ్మోత్సవం
## 2020, మే 15 నుండి మే 23 వరకు



**15-05-2020**
శుక్రవారం
పగలు: ధ్వజారోహణం
రాత్రి: పెద్దశేషవాహనం

**16-05-2020**
శనివారం
పగలు: చిన్నశేషవాహనం
రాత్రి: హంసవాహనం

**17-05-2020**
ఆదివారం
పగలు: సింహవాహనం
రాత్రి: ముత్యపుపందిరివాహనం

**18-05-2020**
సోమవారం
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: సర్వభూపాలవాహనం

**19-05-2020**
మంగళవారం
పగలు: పల్లకిలో మోహినీఅవతారోత్సవం
రాత్రి: గరుడవాహనం

**20-05-2020**
బుధవారం
పగలు: హనుమద్వాహనం,
సా॥ వసంతోత్సవం
రాత్రి: గజవాహనం

**21-05-2020**
గురువారం
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం

**22-05-2020**
శుక్రవారం
పగలు: రథోత్సవం
రాత్రి: అశ్వవాహనం

**23-05-2020**
శనివారం
పగలు: చక్రస్నానం
రాత్రి: ధ్వజావరోహణం

**24-05-2020**
ఆదివారం
పగలు: పుష్పయాగ మహోత్సవం

## తిరుమల తిరుపతి దేవస్థానములు

## 14-02-2020 నుండి 23-02-2020 వరకు జరిగిన తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవ దృశ్యమాలిక మరియు కళాబృందాలు













# తిరుమల తిరుపతి దేవస్థానములు

## 14-02-2020 నుండి 22-02-2020 వరకు జరిగిన
## శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవ
## దృశ్యమాలిక మరియు కళాబృందాలు













## తిరుమల తిరుపతి దేవస్థానములు


## 05-03-2020 నుండి 09-03-2020 వరకు జరిగిన

## తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి

## తెప్పోత్సవ దృశ్యమాలిక







# దివ్యక్షేత్రం... తిరుమల

08

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152

*గత సంచిక తరువాయి భాగం...*

## 4) సంవత్సరోత్సవాలు

సప్తగిరీశునికి సంవత్సరంలో ఒకమారు మాత్రమే కొన్ని విశేషదినాల్లో కొన్ని ఉత్సవాలు జరుగుతాయి. వాటినే 'వార్షికోత్సవాలు' అనీ 'సంవత్సరోత్సవాలు' అనీ అంటారు. వాటిల్లో కొన్ని ముఖ్యమైన ఉత్సవాలను గూర్చి తెలుసుకుందాం.

**ఉగాదిఆస్థానం-ఇతర ఆస్థానసేవలు-** ప్రతి ఏటా ఉగాది పండుగనాడు తెలుగువారి ఇలువేలుపు అయిన తిరుమలేశుడికి "ఉగాదిఆస్థానం" బంగారువాకిలిముందు జరుగుతుంది. శ్రీదేవి భూదేవులతో శ్రీమలయప్పస్వామికి ఘనంగా నివేదనలు, నూతన వస్త్రసమర్పణ, నూతన పంచాంగ శ్రవణం జరుగుతుంది.

బంగారువాకిలి ముందు జరిగే ఈ ఆస్థానం వేడుకను అర్చకులు ఆలయ అధికారులు, ఆలయసిబ్బంది మాత్రమే దర్శించడానికి వీలవుతుంది. ఇంచుమించు ఇదే రీతిలో, **ఆణివారఆస్థానం (జూలై16), దీపావళిఆస్థానం, శ్రీరామనవమిఆస్థానం, శ్రీకృష్ణాష్టమీఆస్థానం** లాంటివన్నీ ఆలయంలో బంగారువాకిలి ముందు జరుగుతాయి. అందరూ దర్శించ వీలుకాదు.

**వార్షిక వసంతోత్సవం-** ప్రతిఏటా చైత్రమాసంలో పున్నమి నాటికి పూర్తి అయ్యేట్లుగా మూడురోజులపాటు వసంతోత్సవాలు నిర్వహింపబడతాయి. శ్రీవారిఆలయానికి నైరృతి మూలలో ఉన్న వసంతమండపంలో మూడురోజులపాటు జరిగే ఈ ఉత్సవంలో మొదటి, రెండురోజులు శ్రీదేవి భూదేవులతో శ్రీమలయప్పస్వామికీ, మూడవరోజున శ్రీమలయప్పస్వామితో పాటు శ్రీసీతారామలక్ష్మణులకు, శ్రీరుక్మిణీశ్రీకృష్ణులకు వసంతోత్సవాలు నిర్వహిస్తారు. రెండవరోజు ఉదయం శ్రీమలయప్పస్వామివారికి స్వర్ణరథోత్సవం నిర్వహిస్తారు.

**శ్రీపద్మావతీ పరిణయోత్సవం-** వైశాఖ శుద్ధ దశమినాడు, శ్రీవేంకటేశ్వరస్వామికి, ఆకాశరాజు పుత్రిక పద్మావతికి



వివాహం జరిగినరోజు. ఆ రోజును పురస్కరించుకొని 1992 నుండి వైశాఖమాసంలో శుద్ధనవమి, దశమి, ఏకాదశి ఇలా మూడురోజులపాటు సాయంత్రం తిరుమల నారాయణగిరి తోటలో శ్రీపద్మావతీ పరిణయోత్సవాలు వేడుకగా జరుగుతాయి. వీటిని భక్తులందరూ దర్శించవచ్చు.



**జ్యేష్ఠాభిషేకం–** ప్రతిఏటా జ్యేష్ఠమాసంలో జ్యేష్ఠానక్షత్రం నాటికి పూర్తి అయ్యేట్లుగా మూడురోజులపాటు ఆలయం లోపల శ్రీవారి ఉత్సవమూర్తులకు 'జ్యేష్ఠాభిషేకం' నిర్వ హిస్తారు. దీన్నే 'అభిధేయక అభిషేకం' అంటారు.



అత్యంత ప్రాచీనమైన శ్రీవారి ఉత్సవమూర్తులు, అభిషేకాలతో భిన్నం కాకుండా పరిరక్షించే నిమిత్తం చేసే ఉత్సవం ఇది. ప్రతి సంవత్సరం కేవలం ఈ మూడురోజుల్లో మాత్రమే పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసువు, చందనంవంటి అభిషేకద్రవ్యాలతో తిరుమంజనం జరుగు తుంది. మొదటిరోజు వజ్రకవచంతోను, రెండవరోజు ముత్యాలకవచంతోను, మూడవరోజు బంగారుకవచంతోను శ్రీమలయప్పస్వామివారు పురవీథుల్లో దర్శనమిస్తారు. చివరి రోజు శ్రీవారికి సమర్పించిన బంగారుకవచం, మళ్లీ ఏడాదికి జరిగే 'జ్యేష్ఠాభిషేకం'లో మాత్రమే తీసివేయబడుతుంది.

**నాగపంచమి-గరుడోత్సవం–** ప్రతి సంవత్సరం శ్రావణ మాసం శుద్ధపంచమిరోజున అనగా గరుడపంచమిరోజున సాయంత్రం తిరుమల స్వామివారికి "గరుడోత్సవం" జరుప బడుతుంది.

**పవిత్రోత్సవాలు–** కొన్ని సందర్భాల్లో కొందరు వ్యక్తులు అంటు, మైల ఉన్న సమయాల్లో ఆలయాల్లో ప్రవేశించ కూడదు. అయితే వాళ్లకు తెలియకుండానే ఆలయంలో ప్రవేశించినప్పుడు పవిత్రతకు కొంతభంగం కలుగుతుంది. ఇలాంటి తెలిసీ, తెలియని దోషాలు భక్తులవల్ల మాత్రమే కాక, ఆలయంలో పనిచేసే సిబ్బందివల్ల కూడా కలుగవచ్చు. అందువల్ల ఇలాంటి దోషాల నివారణకు మూడురోజులు జరిపే ఉత్సవమే 'పవిత్రోత్సవం'. ప్రతి సంవత్సరం శ్రావణ మాసం (ఆగష్టు)లో శుద్ధ దశమి, ఏకాదశి, ద్వాదశిరోజుల్లో హోమాలు, పవిత్రప్రతిష్ఠ, పవిత్రసమర్పణ వంటి వైదిక కార్యక్రమాలతో ఈ ఉత్సవం జరుపబడుతుంది. మూడు రోజులు సాయంత్రం శ్రీమలయప్పస్వామికి ఊరేగింపు జరుగుతుంది.

*(ఇంకా ఉంది)*

## విశ్వదాభిరామం — రాయి - రత్నం — వేమన పద్యసూక్తి

**నిక్క మైన మంచినీల మొక్కటి చాలు**
**తళుకు బెళుకు రాళ్లు తట్టె డేల?**
**చదువ పద్య మరయ చాలదా యొక్కటి**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**అర్థము:** నిక్కము= నిజం; నీలము = నవరత్నాల్లో నీలమణి ఒకటి; అరయ= విచారించగా, వెదకగా.

**భావం:** తళతళ మెరిసే నకిలీరాళ్లు తట్టెడెందుకు? మెరుపు తక్కువయినా, నిజమయినరత్నం ఒక్కటి చాలు. అలాగే సారం లేని పద్యాలు చాలా చెప్పడంకన్నా, గుణవంతమైన పద్యం ఒక్కటి చెప్పినా చాలు.

**వివరణ:** అసలు వస్తువులకంటె నకిలీవస్తువులు ఎప్పుడూ గొప్పగా మెరుస్తాయి. పైపై మెరుపులు చూసి అవి చాల శ్రేష్ఠమైనవని భ్రమపడగూడదు. మెరుపులు తక్కువగా ఉన్నా నిజమయిన వస్తువులకు విలువ ఎప్పుడూ ఎక్కువే. కవిత్వం కూడా శబ్దాల సొగసుతోనో, మరొకఆడంబరంతోనో అందంగా అనిపించవచ్చు. కాని అర్థగౌరవం లేకపోతే, కుప్ప లుగా చెప్పినా విలువుండదు. వ్యంగ్యంవంటి ఉత్తమకావ్య లక్షణాలు ఉన్నపద్యం ఒక్కటి వ్రాసినా, ఆ ఒక్కపద్యమే తత్కర్తకు ఉత్తమకవి అనేగౌరవం కలిగిస్తుంది. శబ్దప్రధాన కావ్యాలు రాళ్లు, అర్థప్రధానకావ్యాలు రత్నాలు.

*– విద్వాన్ కట్టా నరసింహులు, 9441337542*

# కోడై తిరునాళ్

– శ్రీమతి ఎమ్. పద్మశ్రీ

**05-04-2020 నుండి 07-04-2020 వరకు తిరుమల శ్రీవారి వసంతోత్సవాల సందర్భంగా...**

తిరుమలలో జరిగే వసంతోత్సవాలు ముఖ్యంగా మూడున్నాయి. అందులో మొదటిది బ్రహ్మోత్సవ సమయంలో జరిగే కార్యక్రమం. రెండవది వసంత ఋతువులో జరిగే ఉత్సవం. మూడవది భక్తాదులు 'ఆర్జిత సేవ'గా జరిపించే ఉత్సవం.

తిరుమలపై వెలసియున్న శ్రీవేంకటేశ్వరస్వామి వారికి, ప్రతి సంవత్సరం వసంత ఋతువునందు చైత్రమాసంలో శుద్ధ త్రయోదశి, చతుర్దశి, పూర్ణిమ అనే ఈ మూడు తిథులందు వసంతోత్సవాలు జరుగుతాయి. ఇందు–

మొదటిరోజు శ్రీవారికి ప్రాతఃకాలారాధనం, మాధ్యాహ్నికారాధనమైన తరువాత శ్రీమలయప్పస్వామివారు శ్రీభూదేవులతో బంగారుతిరుచ్చిలో వేంచేస్తారు. అలా తిరువీథులఉత్సవంలో ఆలయానికి పశ్చిమభాగంలో ఉన్న వసంతమండపానికి చేరుకుంటారు. అక్కడ శ్రీవారికి ఆరాధనం, అభిషేకం, అలంకారం జరుగుతాయి. ఈ రోజు సాయంకాలం ఆస్థానం జరిగి తిరువీథులఉత్సవంలో తిరిగి శ్రీవారి సన్నిధానానికి చేరుకుంటారు.

రెండోరోజు శ్రీమలయప్పస్వామి వారికి శ్రీభూదేవులతో కూడా ఆరాధనం జరుగుతుంది. ఈ రోజున వెండితేరును అధిరోహిస్తారు. ఆ రథోత్సవం పూర్తైన తర్వాత ఆ రథాన్ని వీడి వసంతమండపానికి చేరుకుంటారు. అచ్చట ఆరాధనం, అభిషేకం, అలంకారం జరుగుతాయి. ఈ రోజున సాయంకాలం ఆస్థానం జరిగి తిరువీథులఉత్సవంలో తిరిగి శ్రీవారి సన్నిధానానికి చేరుకుంటారు.

మూడోరోజు ఆరాధనమైన తర్వాత ఒక తిరుచ్చిలో శ్రీభూదేవులతో కూడా శ్రీమలయప్పస్వామివారు, రెండో తిరుచ్చిలో శ్రీసీతారామ లక్ష్మణులు, మూడోతిరుచ్చిలో శ్రీరుక్మిణీసమేత శ్రీకృష్ణస్వామివారు, నాలుగో తిరుచ్చిలో శ్రీఆంజనేయ స్వామివారు బయలుదేరి తిరువీథులఉత్సవంలో వసంత మండపానికి చేరుకుంటారు. అచ్చట శ్రీవార్లకు ఆరాధనం, అభిషేకం, అలంకారం జరుగుతాయి. ఈ రోజున సాయంకాలం త్రేతాయుగావతారమైన శ్రీరామచంద్రచక్రవర్తిస్వామివారు, ద్వాపరయుగావతారమైన శ్రీకృష్ణస్వామివారు, కలియుగ ప్రత్యక్ష అర్చావతారమైన శ్రీవేంకటేశ్వరస్వామివారు ఆస్థానంలో వేంచేసి ఉంటారు. ఆ దేవతామూర్తులందరినీ ఒకేచోట భక్తకోటి దర్శించి జన్మ సాఫల్యం పొందుతారు. ఇదొక అపూర్వసంఘటనగా భక్తకోటి తలుస్తారు. అలా ఆస్థానం పూర్తైన తర్వాత సమస్తపరివారంతో, భక్తబృందంతో తిరువీథులఉత్సవంలో వేంచేసి శ్రీవారిసన్నిధానాన్ని ప్రవేశిస్తారు. ఈ ఉత్సవం వసంత ఋతువునందు జరుగుతుంది.

కాబట్టే దీనికి 'వసంతోత్సవం' అనిపేరు. అలాగే సమస్త కోరికలను కూడా సమకూర్చేదని ఆగమాలు చెప్తున్నాయి.

ఇదీ తిరుమలలో జరిగే మూడురోజుల వసంతోత్సవ వైభవం. ఈ వసంతోత్సవాలను మునుపు శ్రీకృష్ణదేవరాయలకాలంలో జరుపబడే 20 రోజులు జరిగే కోడైతిరునాళ్ అనే ఉత్సవాల్లో ఆఖరిరెండురోజులు జరిపేవారు. రానురాను అవి మూడురోజుల ఉత్సవాలుగా జరుపుతున్నారు. ఆ విధంగా ఆనాడు జరిగే కోడైతిరునాళ్



ఉత్సవాలకుగాను ఎందరో ఎన్నోరకాల బహుమానాలిచ్చారని శాసనాల్లో వెల్లడౌతోంది. ఆ విశేషాలేంటో తెలుసుకుందాం.

**కోడైతిరునాళ్ :** 'కోడై' అంటే తమిళంలో వేసవికాలం. 'తిరునాళ్' అంటే పవిత్రమైన, మంగళకరమైన దినం. వేసవి కాలంలో స్వామివారికి జరిగే ఉత్సవమని అర్థం. ఈఉత్సవం ఒకప్పుడు ప్రసిద్ధమైనట్లు శాసనాధారాలవల్ల తెలుస్తోంది.

తిరుమల తిరుపతి దేవస్థానం యాజమాన్యంలో ఉన్న దేవాలయాల్లో ఎన్నోశాసనాలు గోడలపై చెక్కబడి ఉన్నాయి. వాటిల్లో ఎక్కువభాగం తమిళంలోనూ, కొన్ని కన్నడం, కొన్ని తెలుగులోను కన్పిస్తున్నాయి.

కోడైతిరునాళ్ ప్రశంస ఉన్న మొదటిశాసనం ఒకటి 1249వసం॥లో కన్పిస్తుంది. ఆ శాసనం తిరుమల దేవాలయంలో ముక్కోటిప్రదక్షిణంచేసే పడమటిగోడపై ఉంది. ఒకరాజు తన 17వసంవత్సరపు పరిపాలనాకాలంలో 400పణాల శాశ్వతనిధిని కోడైతిరునాళ్ ఉత్సవ నిర్వహణానికిగాను శ్రీస్వామి భాండారానికి సమర్పించినట్లు ఈ శాసనంవల్ల తెలుస్తోంది. ఈ ఉత్సవం ఎప్పుడు, ఎన్ని రోజులు జరుపబడేదో ఆ శాసనంలో సూచింపబడలేదు. అయితే ఈ శాసనం క్రీ.శ.1240కి ముందుకాలంనాటిదని ఒక వ్యాఖ్య.

సాళువనరసింహరాజు ఉడయార్ 1468 సంవత్సర శాసనంలో మురుక్కమ్‌పట్టుగ్రామాన్ని ద్వాదశిపర్వదినంలో సమర్పించాడు. స్వామికి అక్కడే పుష్కరిణిమధ్యలో మంటపాన్ని నిర్మించాడు. శ్రీవారు మంటపానికి వేంచేసినప్పుడు తెప్పోత్సవానికి, కోడైతిరునాళ్‌కు పైగ్రామాన్ని దానంచేసినట్లు ఈ శాసనంవల్ల స్పష్టమౌతోంది.

1473 సంవత్సరశాసనంలో కోడైతిరునాళ్ ఐదవరోజు ఉత్సవంలో అన్నదానంకోసం ఒకనిధిని ఏర్పాటు చేసినట్లు విదితమవుతుంది. కుమారతాతయ్యంగారి 1493 సంవత్సరశాసనంలో సొత్తై తిరుమలనంబి తిరువేంకటయ్యంగార్ కుమారుడు శఠమర్షణగోత్రుడు, ఆపస్తంబసూత్రుడు, తిరుపతి ఆచార్యపురుషుల్లో ప్రసిద్ధుడు. ఇతడు 20రోజులు తిరుక్కొడై తిరునాళ్‌కును, 64 అతిరసపడి నైవేద్యనిర్వహణకు కట్టడిచేశాడు.

కందాడ రామానుజయ్యంగారి 1495 సంవత్సర శాసనంలో తిరుమల తిరుపతులందు రామానుజకూటానికి శ్రీవేంకటేశ్వరుని బంగారు ఖజానాగారానికి ఇతడే నిర్వాహకుడు. ఇతడు కోడైతిరునాళ్‌కు 20 అప్పపడినిధిని ఏర్పాటు చేశాడు.

సాళువనరసింహునియొక్క సేనాధిపతి అడైప్పమ్ విశ్వనాథనాయకర్ 1537 సంవత్సరశాసనంలో 20రోజులు కోడైతిరునాళ్‌కు 20 అప్పపడివ్యవస్థ కల్పించాడు.

లింగసాని, తిర్నవెంకటమాణిక్యం దేవదాసీలు 1540 సంవత్సరం 20 పన్నీటిపాత్రలు, 20 బరువుగల శుద్ధ కర్పూరం, 20రోజుల కోడైతిరునాళ్‌కు స్వామికి సమర్పించే వ్యవస్థ కల్పించారు.

1560వసంవత్సరం తిరుమలైనంబి కుమార తాతయ్యంగార్ కుమారుడు సొత్తై ఎట్టురు తిరుమలైనంబి శ్రీనివాసయ్యంగార్ కోడైతిరునాళ్‌కు 20 అతిరసప్పడి నైవేద్యవస్థకు నియమనం చేశాడు.

బసవనాయకుని కుమారుడు పెరియతిమ్మప్ప, చిన్నరామప్ప 1540 సంవత్సరం, అచ్యుత మహారాయసేనాని దళవాయ్ తిర్మరాసయ్యర్ 1540 సంవత్సరం, తిరుమలయ్యరాజా. 1561వసంవత్సరం లింగసాని మరియు తిరువేంకటమాణిక్యం 1545వసంవత్సరం, 20రోజుల కోడైతిరునాళ్‌కు 20 అతిరసపడి నైవేద్యవ్యవస్థ కల్పించారు.

తి.తి.దే. శాసనసంపుటి నాలుగు 179 శాసనంలో ఒక అజ్ఞాతభక్తుడు 1070 పణమ్ శాశ్వతనిధిని 20రోజులకు 20కుండల పానకానికి, 20 ఇడ్లిపడికి వ్యవస్థ కల్పించాడు.

తి.తి.దే. నాల్గవశాసనసంపుటి 230వ శాసనంలో మల్లప్పయ్యర్ తిరుమలలో మలయనిన్రాన్ అనే పూలతోటలో ఆసీనులైనప్పుడు 20రోజుల కోడైతిరునాళ్‌కు 20 దోసెపడి దానంచేశారు.

ఇవేగాక అనుసంధానం తిరువేంకటజియ్యర్ 1504 సం॥శాసనంలోను, కారైవెట్టి పులైయాళ్వారు కుమారుడు అప్పాపిళ్ళై, 1506సం॥శాసనంలో కోడైతిరునాళ్ ప్రశంస స్పష్టమవుతుంది. అంధకాలం తీర్థర్ కుమారుడు ఎల్లప్పపిళ్ళై 1543వసం॥ శాసనంలో కరణీకం కామరాసప్పర్ 1558 సం॥ శాసనంలో కూడా కోడైతిరునాళ్ ప్రశంస వెల్లడవుతోంది.

పై శాసనాలవల్ల కోడైతిరునాళ్ పుష్కరిణిమధ్యలో ఉన్న మంటపంలో జరుపబడేదనీ, మలైనిన్రాన్‌తోటలో కూడా ఈ తిరునాళ్ నిర్వహింపబడుతుండేదనీ, ఇది 20 రోజులకాలం జరుపబడే ఉత్సవమనీ, స్వామివారు కోడై తిరునాళ్ జరిగే ప్రదేశానికి వేంచేసేమార్గంలో మజిలీలు ఉండేవనీ, ఆ మజిలీలలో స్వామికి ప్రత్యేక ఆరాధనలుండేవనీ మనకు తెలుస్తోంది.

## శ్రీవేంకటేశ్వరవైభవం

– శ్రీ గరిశకుర్తి రాజేంద్ర, 94937 02652

కలియుగ వైకుంఠము తిరుమల
దర్శించని బ్రతుకెందుకు వ్యర్థమే కదా!

తరతరాల పాపాలను పోగొట్టి-
ఆధ్యాత్మిక మార్గాన్ని మార్చేశక్తి
మనిషిని మాధవుడిగ మార్చేశక్తి
ఏడుకొండలవాడికి సాధ్యమే కదా!

నుదుట తిరునామాలు ధరించి-
శ్రీదేవి, భూదేవిని గుండెలలో నిలిపి-
కొండలకే తలమానికమగు తిరుమలకొండని-
వైకుంఠధామంగా మార్చినాడు స్వామి!

ఆళ్వారు లెందరో కొలిచినారు ఈ స్వామిని-
అన్నమయ్య పదాలలో కీర్తించినాడు ఈ దేవదేవుని-
నిత్యకల్యాణానికి వేదిక ఈ తిరుమల
భక్తులకోరికలు తీర్చే కొంగుబంగారమే కదా!

కొండలపై మారుమ్రోగు గోవిందుని నామం-
అదే అదే భక్తులకు తారకమంత్రం-
కలియుగ ప్రత్యక్ష దైవం వెంకన్న -
దర్శించిన తరియించును మానవజన్మం!

ఏడుకొండలవాడిని దర్శించిన వారికి-
మరుజన్మము లేదనుట సత్యం! సత్యం!

భాగవత కథాసాగరం

# చిత్రకేతువు వృత్తాంతము

– డా॥ వైష్ణవాంఘ్రి సేవకదాస్,
98219 14642

శుకమహర్షి వృత్రాసురునికి విష్ణుభక్తి కలగడానికి గల పూర్వచరిత్రను పరీక్షిన్మహారాజుకు వివరించారు. అదే చిత్రకేతువు వృత్తాంతము. ఈ కథాసారాంశం శ్రీమద్భాగవతములోని షష్ఠస్కంధములో వస్తుంది. శూరసేన దేశానికి రాజు చిత్రకేతువు. అతనికి కోటిమంది భార్యలు ఉండేవారు. అయితే వారిలో ఎవ్వరికి కూడ సంతానం కలుగలేదు. పుత్రలేమి బాధ చిత్రకేతువును మిగుల కలచివేసింది.

ఒకసారి అంగిరఋషి చిత్రకేతువు మందిరానికి వచ్చారు. అప్పుడు ఆయన ఆప్యాయంగా చిత్రకేతువును ఈ విధంగా అడిగారు–

"రాజా! నీ దేహము, మనస్సు, రాచపరివారము, సంపత్తులు క్షేమంగా ఉన్నాయా? నీ ముఖం చూస్తే నీవు ప్రసన్నంగా లేనట్లు, ఏదో తీవ్రమైన వేదనకు గురియైనట్లు గోచరిస్తున్నది అని ప్రశ్నించగానే పుత్రార్థియైన చిత్రకేతువు మహానుభావా! సంతానం లేకపోవడంవలన నరకంలో పడనున్న నన్ను, నా పితరులను కాపాడండి. నరకంనుండి నన్ను ఉద్ధరించే ఒక పుత్రుణ్ణి ప్రసాదించండి."

అందుకు అంగిరఋషి ఒక యజ్ఞం చేసి యజ్ఞ ప్రసాదంగా పరమాన్నమును రాజపత్నియైన కృతద్యుతికి ఇచ్చారు. యజ్ఞప్రసాదఫలంగా కృతద్యుతి పండంటి పుత్రునికి జన్మనిచ్చింది. ఆ వార్త చిత్రకేతువుకు చెవులలో అమృతం పోసినట్లుగా అనిపించింది.

విప్రులచే బాలునికి ఆశీర్వచనాలు, జాతకర్మలు చేయించాడు. లేకలేక కలిగిన సంతానంపై చిత్రకేతువుకు ఎనలేని ప్రేమ కలిగింది. భార్యపై చిత్రకేతువుకు కూడ అనురాగం పెరిగింది. ఇది చూసి సవతులకు అసూయ కలిగింది. రాజు తమపై చూపిస్తున్న నిర్లక్ష్యం వారికి తీవ్రమైన దుఃఖాన్ని కలుగజేసింది. రోజురోజుకు వారి మదిలోని అసూయాజ్వాల పెరిగిపోయింది. ఆ జ్వాలలో విచక్షణ దగ్ధము కాగా వారందరు చిన్నపిల్లవాడికి విషమిచ్చి చంపారు.

విషప్రభావంతో మరణించిన బాలుడు ఎంతకూ లేవకపోయేసరికి కృతద్యుతి సేవికను పంపింది. సేవిక ఏడ్పులు విన్న కృతద్యుతి అక్కడకు వెళ్ళి తన పుత్రుడు మరణించి ఉండడం చూసి మొదలునరికిన చెట్టులాగా పడిపోయింది. ఇంతలోనే రాజపుత్రుని మరణవార్త అంతఃపురంలో వ్యాపించింది. అందరూ గుండెలు బాదుకుంటూ ఏడ్వసాగారు. మిగతా రాణులు కూడ కపటదుఃఖం ప్రకటించారు. పుత్ర మరణవార్త చిత్రకేతువుకు పిడుగు పాటులా తోచింది. పిల్లవాడిని చూస్తూనే స్పృహ తప్పి పడిపోయాడు. స్పృహ రాగానే అతని కళ్ళనుండి అశ్రుధారలు కారాయి, నోటమాట రాలేదు. రాజదంపతుల దుఃఖం చూసేవారికి హృదయవిదారకంగా అయింది.

అప్పుడు అంగిరఋషి నారదునితో పాటు అతని అంతఃపురానికి వెళ్ళారు. దుఃఖార్తుడైన చిత్రకేతువును చూడగానే వారు అతనికి తత్త్వబోధ చేశారు. అనేకవిధాలుగా నారద అంగీరులు ఉపదేశం చేయగా చిత్రకేతుహృదయం కాస్త ఉపశమించింది. గ్రామ్యపశువులాగా అయిన తనను జ్ఞానజ్యోతితో రక్షింపుడని ప్రార్థించాడు.

అప్పుడు అంగిరఋషి అతనితో "రాజా! నీవు పుత్రుని కోరి ఉన్నప్పుడు నేను నీ అంతఃపురానికి వచ్చాను. నీకు పుత్రుని ప్రసాదించిన అంగిరఋషిని నేనే. నా వెంట ఉన్న మహనీయుడు సాక్షాత్తుగా బ్రహ్మతనయుడైన నారద ముని. నిన్ను మిథ్యాశోకంనుండి బయటపడవేయడానికే మేమిద్దరము వచ్చాము. చిత్రకేతూ! ఆత్మస్థితిని చక్కగా తెలిసికో. నీవెవడవో తెలిసికోవడానికి ప్రయత్నించు. నిజమైన స్థితిని తెలిసికొంటే ఆసక్తి తొలగి శాంతిని పొందుతావు" అని అన్నారు.


అప్పుడు నారదముని ఎంతో కరుణతో చిత్రకేతువుకు మంత్రదీక్షనిచ్చి ఆ మంత్రజపంతో ఏడురాత్రుల



ఆశలేని ప్రాణి అణగారిపోతుంది. ఆశ చంపుకోవడం ఆత్మహత్య

లోనే సంకర్షణుని దర్శనం కలుగుతుందని ఆశ్వాసం కలిగించారు. సంకర్షణుని పాదపద్మాశ్రయంతో శివాదులే ద్వైతభావనను తొలగించుకున్నారని ఆయన తెలియజేశారు.

తరువాత నారదముని తన యోగబలంతో మృత పుత్రుని వెనుకకు రప్పించారు. మృతబాలుడు తిరిగి మాట్లాడడము చూసి శోకతప్తులైన బంధువులందరూ ఆశ్చర్య చకితులయ్యారు. నారదముని ప్రభావం చేత వెనుకకు వచ్చిన బద్ధాత్మ ఆ విధంగా జ్ఞానాన్ని పలికి వెనుకకు వెళ్ళిపోయింది. అది విని రాజు, రాణి, బంధువులందరూ విస్మయం చెందారు. ఆ పిల్లవాడితో అంతవరకు ఉన్నట్టి ప్రేమపాశాన్ని వారు అవలీలగా త్రుంచివేసికొని శోకాన్ని విడిచారు.



తరువాత బాలుని మృతదేహానికి దహనక్రియలు చేసి శోకమోహభయాలనుండి బయటపడ్డారు. అప్పుడు చిత్రకేతువుపట్ల ప్రసన్నుడైన నారదముని అతనికి దివ్యోపదేశం చేశారు. ఆ విధంగా నారదముని చిత్రకేతువుకు మంత్రాన్ని ఉపదేశించి అంగిరఋషితో పాటు బ్రహ్మలోకానికి వెళ్ళిపోయారు.

గురుకరుణవలన లభించిన మంత్రాన్ని భక్తిశ్రద్ధలతో జపించిన చిత్రకేతువుకు విద్యాధరలోకప్రాప్తి అవాంతరఫలంగా లభించింది. తరువాత భగవద్దర్శనం కలిగింది.

తరువాత చిత్రకేతువు అనంతదేవుడు ఏ దిక్కుగా అంతర్హితుడయ్యాడో ఆ దిక్కుకు నమస్కరించి విద్యాధరపతిగా గగనమండలంలో ప్రయాణించాడు. ఒకసారి అతడు ఆ విధంగా విమానంలో విహరిస్తుండగా సిద్ధచారణులతో పరివృతుడైన శివుడు కనిపించాడు. శివునిఒడిలో పార్వతీదేవి కూర్చొని ఉంది. ఆమెను అతడు ఆలింగనము చేసికొని కూర్చొని ఉన్నాడు. అది చూసి చిత్రకేతువు పరిహాసంగా మాట్లాడాడు. శివుని కార్యాన్నే అతడు అధిక్షేపించాడు. శివుడు ఆ మాటలకు చలించలేదు. మౌనముగా ఉండిపోయాడు. కాని పార్వతీదేవి ఆ మాటలను సహింపలేక శివుని అవమానించిన చిత్రకేతువు విష్ణుపాదపద్మాశ్రయానికి అనర్హుడయ్యాడని గట్టిగా పలికి అసురుడవు కమ్మని తీవ్రంగా శపించింది. పార్వతీదేవి శాపకారణంగానే చిత్రకేతువు త్వష్ట నిర్వహించిన యజ్ఞంలో వృత్రాసురునిగా జన్మించాడు. తరువాత అతడే ఇంద్రునిచేతిలో హతమొంది భగవద్ధామాన్ని చేరుకున్నాడు. ఈ చరిత్రమును వింటే శ్రోతయొక్క సంసారబంధాలు తేలికగా తొలగిపోతాయి. ప్రాతఃకాలంలో నిద్రలేచి మనోవాక్కులను నిగ్రహించి, శ్రీహరిని స్మరిస్తూ ఈ వృత్తాంతాన్ని పఠించే మానవుడు ఎటువంటి కష్టం లేకుండా భగవద్ధామానికి చేరుకుంటాడు.

# యుగయుగాల ఏకశిలానగరం...

– విద్వాన్ కట్టా నరసింహులు,
94413 37542

ఇప్పుడు కలియుగం నడుస్తూ ఉంది. ఇంతకు మునుపు ద్వాపరయుగం, అంతకు మునుపు త్రేతాయుగం, అంతకంటె ముందు కృతయుగం. ఇవి నాలుగుయుగాలు. ఈ నాలుగుయుగాలను మహాయుగం అంటారు. సృష్టి పుట్టినప్పటినుండి ఇలాంటి మహాయుగాలు ఇరవైఏడు గడిచిపోయాయి. ఇప్పుడు నడుస్తున్నది ఇరవైఎనిమిదో మహాయుగం. ఆ మహాయుగంలోని కలియుగంలో ఉన్నాం. కలియుగంలోనూ ఇప్పుడు అయిదువేల నూట ఇరవయ్యో సంవత్సరంలో ఉన్నాం. ప్రతి మహాయుగంలోను ప్రధాన పాత్రలు రామకృష్ణాదులు పునరావృతం అవుతూ ఉంటారు. కొద్ది కొద్ది భేదాలుండవచ్చు. అంటే– త్రేతాయుగంలోని శ్రీరామచంద్రుడు– ఇప్పటికి 28 యుగాల్లోను అవతరించాడు. ఇది పెద్దలు చెబుతున్న మాట.

## కృతయుగంలో జాంబవంతుని తపస్సు

జాంబవంతుడు కృతయుగంనుంచి మూడుయుగాలుగా దర్శనమిస్తున్నారు. ఆయన కృతయుగంలో శ్రీరామచంద్రుని గూర్చి వందసంవత్సరాలు తపస్సు చేశాడు. హిమాలయాలలో ఉంటున్న ఆ మహనీయుడు దక్షిణదేశంలోని శేషాచల పర్వతశ్రేణుల్లోని పాలకొండల సమీపంలో ఉన్న ఒంటిమిట్టప్రాంతంలో ఏకశృంగశైలాన్ని తన తపస్సుకు స్థానంగా ఎంచుకొన్నాడు. ఆ ఏకశృంగశైలాన్ని ఋక్ష పర్వతం అని కూడా అనేవారు. ఎలుగుబంట్లు అధికంగా ఉండడంవల్ల ఈ కొండకు ఆ పేరు వచ్చింది. ఈ కొండమీద మారేడుచెట్లు విస్తారంగా ఉండేవి. స్కాందపురాణంలోని శ్రీశైల ఖండంలోని సిద్ధవట మాహాత్మ్యంలోని కొన్ని శ్లోకాలు ఈ సంగతి వివరిస్తున్నాయి. కాశీ రామేశ్వరమార్గంలో ఈ ఏకశృంగశైలం ఉంది. ఇది శివ కేశవులకు అభేదమైన స్థానం. జాంబవంతుడు ఏకశృంగ శైలంమీద ఉత్తరదిక్కుగా కూర్చొని తపస్సు చేశాడు. శ్రీరామచంద్రమూర్తి ఆ కొండకు ఎదురుగా ఉన్న మరో మిట్టపైనుంచి దివ్యదర్శనం అను గ్రహించాడు. చిరంజీవిగా దీవించాడు. నేడు ఆ మిట్టమీదనే శ్రీసీతాలక్ష్మణసమేత కోదండరామాలయం వెలసింది.

## శ్రీరామ వనవాసం

ఈ ఆలయంలో సీతారామలక్ష్మణులు ముగ్గురే ఉన్నారు. ఆంజనేయస్వామి లేరెందుకనే ప్రశ్న ఉదయిస్తుంది. సీతారామలక్ష్మణులు త్రేతాయుగంలో అరణ్యవాస సమయంలో కొంతకాలం ఈ మిట్టమీద నివసించారు. ఇక్కడికి పడమట అరకోసుదూరంలో మృకండుమహాముని ఆశ్రమం ఉంది. రామలక్ష్మణులు ఈ ఆశ్రమానికి రాక్షసుల పీడ లేకుండా చేశారు. మరి కొంతకాలం తరువాత రావణుడు సీతను అపహరించుకుపోయాడు. రామలక్ష్మణులు సీతను వెదుకుతూ ఉండగా ఆంజనేయుడు పరిచయమయ్యాడు. హనుమరామలక్ష్మణుల్ని ఇద్దర్ని మాత్రమే కదా మొదట చూచింది. కోదండం ధరించి సీతతోను, లక్ష్మణునితోను ఉన్న శ్రీరామచంద్రుణ్ణి ఆయన చూడలేదు. అందుకని ఒంటిమిట్టగుడిలో ఆంజనేయుడు లేడు అంటారు. ఆంజనేయస్వామిగుడి రామాలయానికి ఎదురుగా ఉంది. సంజీవరాయడుగా వెలసి ఉన్నాడు. రామ రావణయుద్ధసమయంలో హిమాలయాలకు వెళ్లి సంజీవనిని తీసుకువస్తూ ఒక్కక్షణం ఈ పవిత్ర స్థలంలో కాలుమోపి లంకకు వెళ్లిపోయాడు. అందుకు గుర్తుగా సంజీవరాయడుగా వెలసి



జీవన విధానానికి ఆచారం ప్రేరణ

ఉన్నాడు. సంజీవ రాయనిచేతిలో సంజీవనిమూలికలు చూడ వచ్చు. ప్రాణభీతి ఉన్నవారు, ప్రమాదాలు సంభవించకుండా ఈ స్వామిని సేవిస్తారు.

## ఇది జాంబవత్ ప్రతిష్ఠ

సీతమ్మను వెతుకుతూ రామలక్ష్మణులు కిష్కింధ ప్రాంతంలో ఉన్నప్పుడు రామసుగ్రీవులకు మైత్రి ఏర్పడింది. సీతమ్మను వెతికి పెట్టడానికి హనుమంతుడు, జాంబవంతుడు మొదలైన సుగ్రీవుని మంత్రులు అనుచరులు సిద్ధమయ్యారు. జాంబవంతునికి శ్రీరామచంద్రుడెవరో ముందుగానే తెలుసు. ఆయన ఆ ప్రయత్నంలో మొదట తాను తపస్సు చేసిన ఏక శృంగశైలంవద్దకు వచ్చాడు. రాముడు దివ్యదర్శనమిచ్చిన చోట ఆనాడు నిద్రించాడు. మరునాటి ఉదయం అక్కడ ఒక శిలలో సీతారామలక్ష్మణులను భావించి అర్చించాడు. సీతమ్మను వెతకడానికి బయలుదేరాడు. జాంబవంతుడు శిలను నిల్పినచోట కలియుగంలో ఆలయం నిర్మించాడు. అది జాంబవత్ ప్రతిష్ఠ అయింది.

## ఆలయ ప్రారంభం


కలియుగంలో ఒంటడు, మిట్టడు అనే బోయ సోదరులు ఈ ప్రాంతం అడవిమీద ఆధిపత్యం చేశారు. ఈ ప్రాంతాన్ని దర్శించడానికి వచ్చిన ఉదయగిరిరాజు కంప రాయలకు ఉపచారాలు చేశారు. సీతమ్మకోసం రాముడు సృష్టించిన నీటిబుగ్గను చూపించారు. జాంబవంతుడు తపస్సు చేసిన ఏకశృంగశైలాన్ని, రాముడు వన వాసంలో నివసించిన మిట్టను చూపించి, ఇక్కడ ఒక ఆలయాన్ని నిర్మించమని కోరారు. కంప రాయలు వారికోరిక మన్నించాడు. ఆలయ నిర్వహణకోసం చెరువును కూడా నిర్మించేం దుకు కంపరాయలు నిర్ణయించాడు. ఆ బాధ్యతలు ఆ సోదరులకు అప్పగించాడు. అలా తయారైంది ఒంటిమిట్ట కోదండరామా లయం. క్రీ.శ.1356లో కాశినుంచి రామే శ్వరయాత్ర చేస్తూ బుక్కరాయచక్రవర్తి విద్యారణ్యమహర్షిని ముందుంచు కొని విగ్రహప్రతిష్ఠ చేసి ఆలయాన్ని, చెరువును ప్రజలకు సమర్పించాడు. ఒంటడు, మిట్టడు నిర్మించిన ఆలయం ఉన్నచోట ఊరు ఏర్పడింది. దానిని ఒంటిమిట్ట అన్నారు.

## ఆలయ విస్తరణ

బుక్కరాయల ప్రతిష్ఠకాలానికి ఆలయం ఇప్పుడు చూస్తున్నంత విశాలమయింది కాదు. గర్భాలయం, ముఖ మండపం, గర్భాలయంపైన చిన్నగోపురం మాత్రం ఉండేవి. దాదాపు రెండున్నరశతాబ్దాలు గడిచాక సిద్ధవటం కేంద్రంగా విజయనగరసామ్రాజ్యంలో మట్లరాజులు రాజ్యానికి వచ్చారు. మట్ల ఎల్లమరాజు కుమారుడు అనంతరాజు, అనంతరాజు కుమారుడు తిరువెంగళనాథరాజు, ఈ తిరువెంగళనాథ కుమారుడు కుమారఅనంతరాజు – ఈ ముప్పురు ఈ ఆలయాన్ని విస్తరించారు. రంగమంటపం, కల్యాణమంటపం, మహాప్రాకారం, మూడు గాలిగోపురాలు, సంజీవరాయస్వామి ఆలయం, రామతీర్థం, రాములవారి తేరు వీరికాలంలో నిర్మించినవే.

## తి.తి.దే. అధీనంలో ఆలయం

మహమ్మదీయులు ఈ దేశం ఆక్రమించుకున్నాక ఆలయనిర్వహణకు ఆర్థికలోపం ఏర్పడింది. ఆంగ్లేయులు వచ్చాక అదే పరిస్థితి సాగింది. ఇరువయ్యోశతాబ్దం ప్రారంభంలో వావిలికొలను సుబ్బారావు టెంకాయిచిప్ప పట్టుకొని దేశం తిరిగి విరాళాలు సేకరించి ఆలయానికి మునుపటి వెలుగులు తెప్పించాడు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణా విడిపోయాక ఒంటిమిట్ట ఆలయానికి రాష్ట్ర



స్థాయి గుర్తింపు లభించింది. ఆలయ నిర్వహణబాధ్యతలు తిరుమల తిరుపతి దేవస్థానం స్వీకరించింది. ఆలయం లోపల వెలుపల మార్పులు చోటు చేసుకొంటున్నాయి. ఆలయంచుట్టూ మాడవీధులు తయారయ్యాయి. లోపల ప్రాంగణంలో గ్రానైటురాయి పరుస్తున్నారు. బయట ఉద్యాన వనం, కొన్ని భవనాలు, తూర్పువైపు పుష్కరిణి నిర్మాణ మయ్యాయి. గ్రామానికి వెలుపల విశాలమైనప్రాంగణంలో కల్యాణవేదిక నిర్మించి అక్కడ కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తు న్నారు. సంవత్సరం పొడవునా జరిగే వివిధఉత్సవాలు జనాకర్షకంగా నిర్వహిస్తున్నారు. ప్రతిదినం వేదపారాయణం జరుగుతూ ఉంది. ప్రతి పూర్ణిమనాడు సీతారామకల్యాణం నిర్వహిస్తున్నారు.

## ఆలయాన్ని అన్నమయ్య దర్శించాడు

ఆలయం తిరుపతి- కడప మార్గంలో, చెన్నై- ముంబై రైల్వేమార్గంలో ఉండడంవల్ల యాత్రికులకు సౌకర్యంగా ఉంది. ఆలయవైభవం దినదినం అభివృద్ధి పొందుతూ ఉంది. తిరుమల వేంకటేశ్వరునిపై 32వేల పాటలు రచించిన అన్నమాచార్యులు ఈ సమీపంలోని తాళ్లపాకవాడే! అన్నమయ్య ఒంటిమిట్టస్వామిని దర్శించాడు. ఆయనపై గేయం చెప్పాడు. శ్రీరామచంద్రుని స్మరించు కొందాం. ఆలయాన్ని దర్శిద్దాం. మొక్కులు తీర్చుకొందాం. జీవితాన్ని తరింపజేసుకొందాం.

# సంస్కృతం నేర్చుకుందాం..!!

పాఠం-03

నిర్వహణ - మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య & కిరణ్ భట్

### संयुक्ताक्षराणि (సంయుక్తాక్షరాణి)

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| क क् | ख ख् | ग ग् | घ घ् | ङ ङ् | క ్క | ఖ ్ఖ | గ ్గ | ఘ ్ఘ | ఙ ్ఙ |
| च च् | छ छ् | ज ज् | झ झ् | ञ ञ् | చ ్చ | ఛ ్ఛ | జ ్జ | ఝ ్ఝ | ఞ ్ఞ |
| ट ट् | ठ ठ् | ड ड् | ढ ढ् | ण ण् | ట ్ట | ఠ ్ఠ | డ ్డ | ఢ ్ఢ | ణ ్ణ |
| त त् | थ थ् | द द् | ध ध् | न न् | త ్త | థ ్థ | ద ్ద | ధ ్ధ | న ్న |
| प प् | फ फ् | ब ब् | भ भ् | म म् | ప ్ప | ఫ ్ఫ | బ ్బ | భ ్భ | మ ్మ |
| य य्/य | र र्/्र | ल ल् | व व् | श श् | ष ष् | स स् | ह ह् | क्ष क्ष् | ज्ञ ज्ञ् |
| య ్య | ర ్ర | ల ్ల | వ ్వ | శ ్శ | ష ్ష | స ్స | హ ్హ | క్ష ్క్ష | జ్ఞ ్జ్ఞ |

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి




# బాలవాక్కు!

**పిల్లలూ.... మీరూ రాయండి!**

**పెద్దలూ...... మీరు ప్రోత్సహించండి!!**

బాలబాలికల్లో మన సంస్కృతిపట్ల, ధర్మంపట్ల, పురాణాలపట్ల, భగవంతుని పట్ల, పెద్దలపట్ల చక్కని అవగాహన కలిగించటానికి, ఆధ్యాత్మిక ఆలోచనల్ని పెంపొందించటానికి సప్తగిరి మాసపత్రిక ఈ వినూత్నశీర్షిక 'బాలవాక్కు'ను ప్రవేశపెట్టింది.

## ఎవరు రాయవచ్చు...

ఆరవతరగతినుండి పదవతరగతివరకు చదువుతున్న బాలబాలికలందరూ రాయవచ్చు.

## ఏం రాయాలి?

మీరు చదివిన లేక మీరు విన్న ధార్మికకథలు, హరికథలు, పురాణాలు, ఇతిహాసాలు, నీతిశతకాలు మొదలైనవాటిల్లోని ఆధ్యాత్మికసారాంశాన్ని ఆధారంగా చేసుకొని మీరు కథగానో, కవితగానో, వ్యాసంగానో లేక భగవంతుడిపట్ల మీ ఆలోచననో రాయొచ్చు. మీరుపంపే రచనలకు తగ్గట్టు వర్ణచిత్రాలుకూడా వేసి పంపవచ్చు.

## పెద్దలు చేయవలసింది...

పిల్లల్లో మన పురాణ, ఇతిహాసాలపట్ల జ్ఞానాన్ని పెంపొందించడానికి వారికి తగిన సలహాలను ఇచ్చి, చిన్న చిన్న ఆధ్యాత్మికగ్రంథాలు చదివించి, వారిని ప్రోత్సహించి, రాయించండి!

## నిబంధనలు...

1) రచన రెండు అరటావులకు మించరాదు. కాగితానికి ఒకవైపు మాత్రమే రాయాలి. రచన స్పష్టంగా అర్థమయ్యేలా ఉండాలి.

2) పూర్తిచిరునామా, పాస్‌పోర్టుసైజుఫోటోతోపాటు, **రచన మీ సొంతమేనన్న ధ్రువీకరణపత్రాన్ని మీరు చదువుతున్న పాఠశాల హెడ్‌మాస్టర్ సంతకంతో జతచేయాలి.**


3) **మీ రచనలు పోస్టుద్వారా పంపాల్సిన చిరునామా:** ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, తితిదే ప్రెస్‌కాంపౌండు, కె.టి.రోడ్డు, తిరుపతి – 517 507.

4) **తెలుగులో డిటిపి చేసి మెయిల్‌ద్వారా పంపాలనుకుంటే** పేజిమేకర్‌లో అనుఫాంట్స్‌లో (లేదా) ఎం.ఎస్.వర్డులో యూనికోడ్ ఫాంట్‌లోగాని టైపు చేసిన ఫైల్ మరియు **PDF** ఫైల్ కూడా తప్పనిసరిగా **telugusubeditor@gmail.com** మెయిల్ ఐడికి పంపగలరు.

5) ప్రచురించిన రచనలకు శ్రీవారి అక్షరప్రసాదంగా ఐదుప్రతులు మీ చిరునామాకు పంపుతాము.

6) మీరు రచన పంపినతరువాత తుదినిర్ణయం ప్రధాన సంపాదకునిదే.

7) రచనలపై ఎలాంటి ఉత్తరప్రత్యుత్తరాలకుగాని, ఫోన్ చేయడంలాంటివాటికిగాని చోటు లేదు.



**బాలల్లారా రాయండి..! శ్రీవారి ఆశీస్సులు పొందండి...!!**

గృహలక్ష్మి

# అక్షయం

- కుమారి ఎస్.లావణ్య,
88863 12045



వైశాఖమాసం, శుక్లపక్షంలో వచ్చే తదియను 'అక్షయతృతీయ' పర్వదినంగా హిందూసంప్రదాయంప్రకారం జరుపుకుంటారు. మానవజీవనవిధానంలో తరగని, లేదా క్షయంకాని సిరిసంపదలకోసం మనం శ్రీలక్ష్మీదేవిని ఆరాధిస్తాం. 'అక్షయం' అంటే క్షయం లేకుండా, లేదా అంతం లేకుండా ఉండడం అని అర్థం.

ఈ రోజున శ్రీలక్ష్మీదేవితో పాటు కుబేరుడిని కూడా పూజిస్తారు. ఈరోజునే శ్రీమహావిష్ణువు పరిపాలన సాగించాడని పురాణవచనం. ఈ రోజునే వేదవ్యాసమహర్షి మహాభారతగాథను శివపార్వతుల కుమారుడైన వినాయకునికి చెప్పి వ్రాయించు కున్నాడని పెద్దలమాట. ఈ రోజే కృతయగం ప్రారంభమైనట్లు విష్ణుపురాణం చెప్తోంది. కాబట్టే ఈ రోజును కృతయుగాదిగా జరుపుకుంటారు. ఉగాది నాడు ఆచరించే విధులనే ఈ కృతయుగంనాడు కూడా ఆచరించాలని శాస్త్రవచనం. నాడు ఆచరించాల్సిన విధులు- స్నాన, దాన, తప, శ్రాద్ధ, హోమాలు, పూజలు మొదలైనవి. ఈ రోజున ఉపవాసం ఉండి పుష్పం, ధూపం, దీపం, చందనం, అక్షతలు, బియ్యం మొద లైనవాటితో లక్ష్మీదేవినీ, లక్ష్మీవల్లభుడైన శ్రీమహావిష్ణుమూర్తినీ పూజించడంవల్ల అక్షయఫలదాయకం. అంతేకాకుండా ఈ రోజు వేటిని దానం చేసినా అక్షయఫలాన్నిస్తాయి. తెలుగువారు 'ఉగాది' పండుగను చేసినట్లుగా, మహారాష్ట్రలోను ఉత్తరాదిన 'అక్షయ తృతీయ' పండుగను ప్రధానంగా, ఘనంగా చేస్తారు.

ఈ రోజు పితృదేవతలను పూజించి, తర్పణాలు, శ్రాద్ధం చేస్తే వారు ఎంతో సంతోషిస్తారు. తల్లిదండ్రులకు, పెద్దలకు, గురువు లకు సేవచేస్తే పుణ్యదాయకం, అక్షయం. లక్ష్మీ సరస్వతీ పార్వతులను ఆరాధించి, నైవేద్యం సమర్పించిన, ఆ ముగు రమ్మల అనుగ్రహం లభిస్తుంది. జీవితాంతం అన్నవస్త్రా లకు లోటుండదు. శ్రీగౌరీసమేత శివుణ్ణి ఆరాధించి నట్లైతే, వారి అనుగ్రహం అక్షయఫలదాయకం. పితృదేవతల ప్రీత్యర్థం ఉదకకుంభదానం చేస్తే వారు వైకుంఠప్రాప్తిని పొందుతారు. పన్నీటితో నింపిన రజతపాత్రను అమ్మ వారి ఆలయంలో సమర్పిస్తే పాండిత్యం వృద్ధి చెందుతుంది. ముత్తైదువులను లక్ష్మీ స్వరూపులుగా భావించి, వారిని పసుపు, కుంకుమ చీరసారెలతో సత్కరిస్తే వారి సౌభాగ్యం కలకాలం ఉంటుంది.

## వ్రతకథ

**పూర్వం నిర్ధనుడనేవాడు అక్షయతృతీయరోజును ఎంతో భక్తిశ్రద్ధలతో ఆచరించేవాడు. ఆ విధంగా ఆచరించడంవల్ల, మరుజన్మలో నిర్ధనుడు కుశావతీనగరంలో ఒక రాజకుటుంబంలో జన్మించాడు.**

**యువరాజుగా సకలసంపదలను అనుభవిస్తూ ధర్మబద్ధంగా రాజ్యపరిపాలన చేసేవాడు. ఆ కోవలో ప్రజలందరిచేతకూడా అక్షయతృతీయను ఆచరింపజేశాడు. ఆ ఆచరణకు తన రాజ్యంలో అన్నీ అక్షయమై సుభిక్షంగా వర్ధిల్లింది. అతను మరణానంతరం వైకుంఠప్రాప్తిని పొందాడు.**

**ప్రకృతిని కూడా ఆరాధించాలని బోధించే పర్వదినమే అక్షయతృతీయ. కనుక ఈ రోజు లక్ష్మీదేవిని ఆరాధించి లక్ష్మీకటాక్షం పొందటంతో పాటు ప్రకృతిని పరిరక్షించే కార్యక్రమాలు కూడా చేపట్టినట్లైతే ప్రకృతి అనుగ్రహానికి, దైవానుగ్రహానికి పాత్రులమౌతాం.**

**26-04-2020న**
**అక్షయతృతీయ**
**సందర్భంగా...**


# కప్పవై పడి ఉండు!!

- శ్రీ ఎమ్.ఎమ్.వి.ఆర్.ప్రసాద్,
97018 24275

శ్రీవేంకటాద్రియందు వేంచేసి ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామివారి సన్నిధానానికి ఏడున్నరమైళ్లదూరంలో మహాపవిత్రమైన తుంబురుతీర్థం ఉంది. ఈ తీర్థం ముక్తిప్రద సప్తతీర్థాల్లో ఒకటిగా ప్రసిద్ధిపొందింది. చైత్రమాసం ఉత్తరఫల్గునీ నక్షత్రంతో కూడిన పూర్ణిమాదినమున మధ్యాహ్నకాలము ఈ తీర్థానికి పర్వకాలం. ఈ పర్వకాలంలో ఈ తీర్థమందు స్నానం మానవులకు సర్వదోషాలను, సర్వపాపాలను నివృత్తి చేసి సర్వవాంఛితాల్ని సమకూర్చుతుంది. దీనికి సంబంధించి స్కాందపురాణంలో ఓ కథ ఉంది.

పూర్వకాలంలో తుంబురుడు అనే గంధర్వుడు తన భార్యతో ఈ మాఘత్రయమందు స్నానమాచరించి విష్ణుపూజ

**07-04-2020న**
**తుంబురుతీర్థ ముక్కోటి సందర్భంగా...**




చేయాల్సిందిగా ఉపదేశించాడు. అందుకు ఆమె చలికి భయపడి నేను అలా చేయలేనన్నది. ఆ మాటలు విన్న తుంబురుడికి చాలా కోపమొచ్చింది. 'నీవు వేంకటాద్రియందు ఘోణతీర్థసమీపంలో అశ్వత్థము (రావిచెట్టు) తొఱ్ఱలో కప్పవై పడి ఉండు' అని శాపమిచ్చాడు. అందుకు భయపడి ఆమె శాపవిముక్తిని కోరింది. అందుకు తుంబురుడు "అగస్త్యమహర్షి ఈ ఘోణతీర్థంలో స్నానం చేసి, అశ్వత్థ వృక్షచ్ఛాయయందు ఘోణతీర్థమాహాత్మ్యాన్ని శిష్యులకు ఉపదేశిస్తాడు. దానిని విన్న తర్వాత శాపవిముక్తి అవుతుంది." అని చెప్పాడు.

అలా ఆమె కప్ప శరీరాన్ని పొంది అశ్వత్థవృక్షం తొఱ్ఱలో ప్రవేశించింది. కొంతకాలానికి అగస్త్యుడు వేంకటాద్రియందు శ్రీస్వామిని దర్శించి తుంబురుతీర్థానికి వచ్చి అక్కడే స్నానం చేసి ఆ అశ్వత్థ వృక్షచ్ఛాయయందు తుంబురుతీర్థ మాహాత్మ్యాన్ని శిష్యులకు ఉపదేశించాడు.

ఆ మాహాత్మ్యాన్ని విన్న ఆ గంధర్వస్త్రీ కప్ప శరీరాన్ని వదలి నారీ రూపం ధరించింది. అప్పుడు అగస్త్యుడివద్దకు వెళ్లి తన వృత్తాంతమంతా చెప్పుకొంది. అది విన్న అగస్త్యుడు ఆమెకు పతివ్రతాధర్మాలను గురించి ఉపదేశించాడు. అది విని ఆ తర్వాత తన భర్తను చేరుకొంది. ఈ తుంబురుతీర్థానికే **తుంబతీర్థం, ఘోణతీర్థం, ఫల్గుణీతీర్థం** అనే పేర్లున్నాయని పురాణాలు చెప్తున్నాయి.

## శ్రీవేంకటేశ్వరలీలలు



# నమ్మినవారిని బ్రోచేదేవుడు

– శ్రీమతి వి. సుధాప్రసన్న

సుమారు అరవైసంవత్సరాలపాటు ఇంచుమించు ప్రతి సంవత్సరమూ శ్రీవేంకటేశ్వరుని దర్శించుకొనే భాగ్యం నాకు కలుగుతూ వచ్చింది ఆ స్వామి కరుణాకటాక్షముల వల్ల. కాని, ఈ సంవత్సర ఆరంభంలో స్వామి నన్ను కరుణించిన తీరు తలచుకుంటే నా మనసూ తనువూ కూడా ఇనుమడించిన భక్తిపారవశ్యంలో పులకించుతాయి.

నా భర్తకు దురదృష్టవశాత్తు కుడిపాదం శస్త్ర చికిత్సతో తొలగించవలసి వచ్చింది. ప్రత్యామ్నాయంగా కృత్రిమకాలు అమర్చుకొని 'వాకర్' సహాయంతో నడక అభ్యాసం చేశారు. తిరుమలలో వికలాంగులకు ప్రత్యేక దర్శనపు వసతి ఉందని తెలుసుకొని మేము ఈ జనవరి 4వ తేదీన శ్రీవారి దర్శనార్థం ప్రత్యేకకౌంటరులో టోకెన్లు తీసుకుని వాకర్ సహాయంతో కొంచెం శ్రమపడి వికలాంగులకు, వృద్ధులకు కలిపి నిర్దేశించిన క్యూలైనులో చాలా ముందుగానే కూర్చున్నాం. 3 గంటలకు క్యూ కదులుతుందని చెప్పారు. మేము ఆ సమయంకొరకు ఎదురుచూస్తూ కూర్చున్నాం. మేము కూర్చున్నచోటునుంచి శ్రీవారి దర్శనానికి వెళ్లటానికి మార్గమేమిటో, నా భర్తను అక్కడ వరకూ ఎలాగ తీసుకుని వెళ్లటమో, భక్తజనం ఎక్కువగా ఉంటారో ఉండరో ఏమో తెలియని అయోమయపరిస్థితి. అక్కడ కనిపించిన వాలంటీర్లను అడిగితే ఒక్కొక్కరూ ఒక్కొక్క విధంగా చెప్పారు. ఎలాగో అక్కడదాకా వచ్చాం కదా దర్శనం అవుతుందిలే అని మాకు మేమే సర్దిచెప్పుకుంటూ కూర్చున్నాం. మా నమ్మకాన్ని నిజం చెయ్యటానికి ఆ శ్రీనివాసుడే పూనుకొన్నట్లు 3 గం॥లకు క్యూ కదిలిన వెంటనే ఒక అద్భుతం జరిగింది.

క్యూలో ఉన్నవారంతా ఎలాగో ఒకలాగ గబగబా కదిలి ముందుకు వెళ్లిపోతున్నారు. ఏడుపదులవయసులో కొత్తగా వచ్చిన అంగవైకల్యంవల్ల వాకర్ ఉన్నప్పటికీ గబగబా అడుగులు వెయ్యలేక నా భర్త నిదానంగా నడుస్తుంటే దేవాలయ సిబ్బంది 'త్వరగా కదలాలయ్యా..., మళ్లీ గేటు మూసేస్తారు' అని హెచ్చరించారు. ఆ సమయంలో చటుక్కున ఒక 'వాలంటీరు' మేము అడక్కుండానే నా భర్తను వీపుమీద ఉప్పుమూటలాగా ఎత్తుకుని అక్కడనుంచి పరుగులాంటి నడకతో ముందర ఉన్నవారిని తప్పుకోమని హెచ్చరిస్తూ తీసుకొని వచ్చి శ్రీవారి గర్భగుడి గుమ్మంముందు నిలబెట్టారు. అంతా పదినిమిషాల్లో జరిగిపోయింది. ఆ వెనకే నేనూ వచ్చి ఇద్దరమూ శ్రీవారిని తనివితీరా దర్శనం చేసుకున్నాం. ఆ వాలంటీరు అక్కడనుంచి శ్రీవారి హుండీ వరకు, మళ్లీ బయటవరకూ కూడా మావారిని మోసుకుని వచ్చి దించి, తర్వాత తనకు మరొక డ్యూటీ ఉందని చెప్పి వెళ్లిపోయాడు. మా వారిని మోయగలిగే శక్తి ఆ వాలంటీరుకి శ్రీనివాసుడే ప్రసాదించాడనే మా ప్రగాఢవిశ్వాసం. ఇంత చక్కగా తన దర్శనం తానే ఆ శ్రీనివాసుడు మాకు ఇప్పించాడు. ఇలా చేయటం ఆ లీలామానుషమూర్తికి మామూలే అయినా ఈ అద్భుతం అనుభవించిన మేము ఇది అందుకోగలిగిన అద్భుతమైన ఆనంద సన్నివేశం. ఇలా స్వామిని మనసా వాచా నమ్మినవారికి తోడునీడగా ఉంటాడనేదే ఈ శ్రీనివాసుని లీల.

ఆ వాలంటీరు పేరూ ఊరూ తెలియదు. భాషను బట్టి తమిళుడని మాత్రం గ్రహించాం. జన్మజన్మలకూ ఆయనకూ మేము ఋణపడి ఉంటాం. ఆ ఋణం తీరే మార్గం కూడా శ్రీనివాసుడే మాకు చూపించాలని కోరిక. శ్రీనివాసుని కరుణాకటాక్షములు ఆ వాలంటీరుకి, ఆయన కుటుంబానికి సదా ఉండాలని కోరుకుంటున్నాం.

ఆయుర్వేదం

# అమ్మలాంటి ఆరోగ్య దీవెనలను అందించే నిమ్మ

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 9000761390

భగవంతుడు ప్రసాదించిన నిమ్మని వివిధ అనారోగ్యసమస్యలలో ఏవిధంగా సద్వినియోగం చేసుకొని చక్కటి ఫలితం పొందవచ్చో ప్రస్తుతం తెలుసుకుందాం.

**ముఖంపై నలుపుమచ్చలు, నలుపుదనం తగ్గేందుకు:** రోజు ఒకసారి తగినంత నిమ్మపండురసంలో కాచినపాలు కలిపి ముఖంపై పట్టించి కొద్దిసేపు సున్నితంగా మర్దించి అరగంట ఆగి గోరువెచ్చనినీటితో శుభ్రం చేసుకోవడంవల్ల త్వరగా ఈ సమస్య తగ్గుతుంది.

**బాగా ఆకలి అయ్యేందుకు:** రోజు ఒకసారి ఆహారానికి అర గంట ముందు 100 మి.లీ. నీటిలో అర టీస్పూను బెల్లం పొడిని కరిగించి అందులో అరబద్ద నిమ్మరసం, ఒక గ్రాము ఉప్పు, ఒక గ్రాము జీలకర్రపొడి కలిపి సేవిస్తూంటే జీర్ణ రసాల ఉత్పత్తి బాగా జరిగి జఠరాగ్ని చైతన్యం అయి ఆకలి బాగా అవుతుంది.

**ఒంటి దురదలకు:** రోజు ఒకసారి తగినంత నిమ్మరసంలో తగినంత కొబ్బరినూనె కలిపి ఒంటికి రాసుకుంటు ఉండాలి.

**కేశాలు రాలకుండా ఉండటానికి:** 100 మీ.లీ.ల నిమ్మరసాన్ని అరకిలో కొబ్బరినూనెలో కలిపి సన్నమంటపై నూనె మాత్రం మిగిలేట్లు మరిగించి, దించి, చల్లార్చి, వడగట్టి నిల్వ ఉంచుకొని రోజూ కేశతైలంగా ఉపయోగిస్తూంటే వెంట్రుకలు దృఢత్వాన్ని సంతరించుకొని రాలకుండా ఉంటాయి. చుండ్రు దరిచేరదు. కేశాలు మృదువుగా, కోమలంగా తయారై మంచి నిగారింపు సంతరించుకుంటాయి.

**అధికబరువు తగ్గేందుకు:** మిరియాలపొడి, ధనియాలను వేయించి చేసినపొడి, జీలకర్రను వేయించి చేసినపొడి ఒక్కొక్కటికి 40 గ్రాములు, ఆయుర్వేదవిక్రయశాలల్లో లభించే సైంధవలవణంపొడి 10 గ్రాములు కలిపి ఉంచుకొని రోజు ఒకటి లేదా రెండుసార్లు పూటకు 200 మి.లీ. గోరువెచ్చనినీటిలో 2-3 గ్రాములు ఈ పొడిని మరియు 10 మి.లీ. నిమ్మరసాన్ని కలిపి సేవిస్తూ, చక్కటి వ్యాయామం చేస్తూ ఆహారనియమాలు పాటిస్తే త్వరగా చక్కటి పరిష్కారం దొరుకుతుంది.

**కిడ్నీల్లో రాళ్ళు కరిగేందుకు:** రోజు ఉదయం, సాయంత్రం, పూటకు 200 మి.లీ. నీటిలో ఒక గ్రాము సైంధవలవణం పొడి, 5-10 మి.లీ. నిమ్మరసం కలిపి సేవిస్తూంటే మూత్ర వ్యవస్థలోని రాళ్లు కరిగిపోతాయి.

**చిగుళ్ళనొప్పి, పంటినొప్పి:** తగినంత లవంగాల పొడిలో తగినంత నిమ్మరసం కలిపి పట్టిస్తే వెంటనే ఆ బాధ తగ్గుతుంది.



**తేలుకాటుకు:** తగినంత నిమ్మరసంలో తగినంత ఉప్పు వేసి నూరి పేస్టులా చేసి లేపనం చేస్తే వెంటనే తేలు కాటు వల్ల కలిగే బాధ, నొప్పి, పోటు, సలుపు, మంట తగ్గుతాయి.

**నోటిదుర్వాసనకు:** 10 మి.లీ. నిమ్మరసాన్ని 50 మి.లీ. పన్నీటిలో (రోజు వాటర్) కలిపి రోజు 1,2 సార్లు కొద్దిసేపు పుక్కిలించి ఉమ్మేస్తూంటే మంచిఫలితం ఉంటుంది.

**చెవిపోటుకు:** విత్తనాలు తొలగించిన అరబద్ద నిమ్మపండుపై కాస్త ఉప్పు అద్ది వేడిచేసి 2, 3 చుక్కలరసం చెవిలో పిండితే తక్షణమే చెవినొప్పినుంచి ఉపశమనం కలుగుతుంది.

**దంతాలు మెరిసేందుకు:** నిమ్మతొక్కలను ఎండించి చేసిన పొడి, ఉప్పు సమానంగా కలిపి ఉంచుకొని దంతధావన చూర్ణంగా ఉపయోగించుకోవడంవల్ల దంతాలపై గార తొలగి దంతాలు ఆకర్షణీయంగా తయారవుతాయి.



హరిదాస వాఙ్మయంలో...

# శ్రీవేంకటాచలాధీశుడు

1

- శ్రీ సుస్వరం నాగరాజాచార్యులు

## భక్తి ప్రాశస్త్యము-నిర్వచనము

"నాహం వేదై ర్నతపసా న దానేన న చేజ్యయా ।
శక్య ఏవం విధో ద్రష్టుం దృష్టవానసిమాం యథా॥
భక్త్యాత్వ నన్యయా శక్య అహమేవం విధోర్జున ।
జ్ఞాతుం ద్రష్టుం చ తత్త్వేన ప్రవేష్టుం చ పరంతప" ॥
(గీత-11-53, 54)

భగవదనుగ్రహానికి, మోక్షసాధనమునకు కేవలం వేదాధ్యయనము, తపస్సు, దానములు, యజ్ఞములు మాత్రము సరిపోదు. అనన్యమైన భక్తి కూడ పైవాటికి తోడైనప్పుడు సాధ్యమగునని శ్రీకృష్ణుని అభిప్రాయమై యున్నది. ఇదే భావాన్నే ప్రహ్లాదుడు కూడా భాగవతంలో ప్రసంగవశాత్తు తెలిపాడు.

"మన్యే ధనాభి జనరూప తపఃశృతౌజ ।
స్తేజ ప్రభావ బల పౌరుష బుద్ధియోగాః ॥
నారాధనా యాహి భవంతి పరస్యపుంసో ।
భక్త్యాతుతోష భగవాన్ నను (గజ) యూథపాయ"
(శ్రీమద్భాగవతం)

మ. "తపమున్ వంశముదేజమున్ శ్రుతము సౌందర్యంబు నుద్యోగమున్
నిపుణత్వంబు బ్రతాప పౌరుషములున్ నిష్ఠాబలప్రజ్ఞలున్
జపహోమంబులు జాలవీశ్వర భవత్సంతుష్టికైదంతి యూ-
థపుజందంబున భక్తిచేయవలయున్ దాత్పర్యసంయుక్తుడై॥
(పోతన-ఆంధ్ర మహాభాగవతం)

ఈ భావాన్నే హరిదాసశ్రేష్ఠులైన శ్రీవిజయదాసుల వారు ఇట్లు స్పష్టీకరిస్తారు-

"దాన ధర్మకె శిలుక । స్నానమౌనకె శిలుక ।
గాన యాగకె శిలుక । కాణికె కొట్టరె శిలుక ।
ఎణిసి జపిసలు శిలుక । నానా వ్రతమాడలు శిలుక
ఏ నేను కర్మకె శిలుక । మాణదె దృఢ భకుతి మాతుర విద్దరె
తానాగి కరెయదె బళియల్లి బందీగ కాణిసి కొంబను
భక్తనిగనుదిన ॥

పై వ్యాసదాససాహిత్యాన్ననుసరించి చూచిన భగవత్సాక్షాత్కారము, ఆతని అనుగ్రహము దానధర్మములచేగాని, స్నాన మౌనములచేగాని, గాన యాగ యజ్ఞములచేగాని, కానుకలు ఇచ్చుటచేగాని, జపతప హోమ వ్రతములు చేయడం మాత్రముచేకాక పరిపూర్ణమైన భక్తి అనెడిది ఉన్నప్పుడే సాధ్యమవుతుందని తెలియుచున్నది.

"సకల సాధనకెల్ల సిద్ధిగొళిసుదు భక్తిసాధనవల్ల దన్యసాధన ఉంటె" సకలములు సమకూర్చే సాధనము భక్తి కాక మరొకటి ఉన్నదా అని అంటారు పురందరదాసులవారు.

## భక్తి-నిర్వచనము

అయితే ఈ భక్తిని గూర్చి జగద్గురువులైన శ్రీమన్మధ్వాచార్యులవారు ఇట్లు చెప్పియున్నారు.

మాహాత్మ్య జ్ఞానపూర్వస్తు సుదృఢః సర్వతోఽధికః ।
స్నేహో భక్తిరితి ప్రోక్త స్తయాముక్తిర్నచాన్యథా ॥

మాహాత్మ్య జ్ఞానపూర్వకమును, అచలమును, సకల ఇతర విషయములకన్న అధికమును అయిన ప్రేమను కలిగి భగవంతుని ఉపాసనమును చేయుటే భక్తి. ఈ భక్తిచేతనే మోక్షము, ముఖ్యముగా ప్రాణాపాయము కల్గినను మనలోని భక్తిభావము మరుగున పడకూడదు. ఇదే సుదృఢభక్తి. పరివారము, పరిసరము, భోగభాగ్యములకన్న అధికము నా స్వామి అనే భావమును కలిగియుండడమే సర్వతోధికమగును. ఈ భక్తినిర్వచనమును గూర్చి మరింత విస్తారముగా శ్రీమధ్వాచార్యుల అభిప్రాయమునే దృష్టిలో నుంచుకొని శ్రీమజ్జయతీర్థులు -

"పరమేశ్వర భక్తిర్నామ నిరవధికానంతానవద్య కల్యాణగుణత్వ జ్ఞాన పూర్వకస్వాత్మాత్మీయ సమస్త వస్తుభ్యోఽ నేక గుణాధికో అంతరాయ సహస్రేణాప్య ప్రతి బద్ధ నిరంతర ప్రేమ ప్రవాహః ।"- అని అన్నారు మొత్తానికి శ్రీహరియొక్క అనుగ్రహమనేది భక్తివల్లనే సాధ్యము.

"భక్త్యర్థాన్యఖిలాన్యేవ భక్తిర్మోక్షాయకేవలా ।
ముక్తా నామపి భక్తిర్హి నిత్యానంద స్వరూపిణీ ॥"

సకలములు భక్తికొరకే. భక్తివల్లనే మోక్షము. ముక్తులకు కూడ భక్తి నిత్యానందస్వరూపమైయున్నది. కావున 'జ్ఞానపూర్వః పరఃస్నేహో నిత్యో భక్తిరితీర్యతే' జ్ఞాన పూర్వకము, అన్నిటికన్నా అధికము సుదృఢమైన స్నేహమే భక్తి అని జగద్గురువుల అభిప్రాయము. అంతేకాక శ్రీమహావిష్ణువుయొక్క ప్రసన్నము భక్తిమాత్రముచేతనే కాని మరొక దానితో కాదు. ఆతనియందు చేయు భక్తిముక్తికి ముఖ్య మార్గము అగును.

"భక్త్యైవ తుష్టి మభ్యేతి విష్ణుర్నాన్యేన కేనచిత్ ।
స ఏవముక్తి దాతాచ భక్తి స్తత్రైవ కారణమ్ ॥"

అయితే ఆభక్తి అమలభక్తి అయి యుండవలెను. "ముక్తిర్నైజ సుఖానుభూతి రమలా భక్తి శ్చ తత్సాధనమ్" త్రికరణములు పరిశుద్ధముగా ఉండవలెను. ఆచార్యులవారి భక్తి నిర్వచన భావమునే హరిదాసులు వక్కాణిస్తూ అమల భక్తిని గూర్చి ఎంతో విస్తారముగా మూడు చరణములలో భక్తుడు పాటించవలసిన విధివిధానాలను ఇట్లు తెలుపుతారు.

"భక్తిగె మూరు గుణగళుబేకు యుక్తివంతరు కేళి ।
ముక్తి శీలవ తిళిదు నిజ విరక్తతనదలిబాళి ॥

"ప్రేమ ప్రీతిరతినేమదలి శ్రీస్వామి చరణదల్లిర బేకు ।
సౌమ్య సమాధానదలి తానమృతవను ఉణబేకు ।

రోమరోమనుకోమల వాగి నిర్మలదల్లిదబేకు
శమ దమే యలితాక్షమే యనుపడెదు సమదృష్టిగుడబేకు"॥

భక్తికి మూడు గుణములవశ్యకములు అని యుక్తిమంతులు గ్రహించవలయును. ముక్తి శీలమును తెలిసి నిజముగా విరక్తులై జీవించవలెను. అదెట్లనగా ప్రేమ, ప్రీతి, రతి – ఈ మూడును క్రమంగా శ్రద్ధగా నిర్దుష్టముగా శ్రీహరి పాదపద్మములయందుండవలెను. "జిహ్వేమేమధుమత్తమా!" "వాఙ్మయం తప ఉచ్యతే" "ప్రియం బ్రూయాత్" అను ప్రమాణ వచనానుసారం సౌమ్యసమాధాన వాక్యములతో ఎదుటివారిని సంతృప్తిపరచుచూ అమృతమును గ్రోలవలెను. అంతేకాక శరీరమే కాదు కదా! ఈ శరీరముపై ఉన్న ప్రతి ఒక్క రోమమును కూడా పరిశుద్ధముగా నుంచుకొని, శమ, దమములను పాటించి క్షమాగుణముల నలవర్చుకొని, శత్రుమిత్రులయందు, మానావమానములయందు, శీతోష్ణ సుఖదుఃఖములయందు, నిందాస్తుతులయందు, లోష్ట కాంచనములయందు సమదృష్టిని కలిగియుండవలెను.

(ఇంకా ఉంది)


తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

## 'సప్తగిరి' చందాదారులకు విజ్ఞప్తి

**సప్తగిరి మాసపత్రిక చందాదారులకు ప్రతినెల సకాలంలో చేరడానికి అనేకచర్యలు తీసు కుంటున్న సంగతి పాఠకలోకానికి విదితమే! ఈ క్రమంలో చందాదారుల చిరు నామాల క్రమబద్ధీకరణకు అనేకచర్యలు తీసుకుంటున్నాం. చందాదారులు ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ క్రింది విధంగా ప్రధానసంపాదకకార్యాలయానికి తెలియజేయవచ్చు.**

01) 'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు/ఫిర్యాదులు sapthagiri_helpdesk@tirumala.org ద్వారా తెలియజేయవచ్చు.

02) సప్తగిరి చందాదారుల చిరునామాల క్రమబద్ధీకరణ కోసం 0877- 2264543 ఫోన్ నెంబరుకు చందా దారులు తమ పూర్తి చిరునామాను పిన్‌కోడ్, సెల్ ఫోన్‌నెంబరుతో సహా కార్యాలయ పనివేళల్లో (ఉ.10.30 గం॥ల నుండి సా.5.00 గం॥ల లోపు) మరొకసారి తెలియజేయగలరు.


03) పై ఫోనునెంబరుద్వారాగానీ, sapthagiri_helpdesk@ tirumala.org ద్వారా గానీ తెలుపగలరు.

04) ఆన్‌లైన్ చందాదారులు తమ పూర్తి చిరునామాలను క్రమబద్ధీకరణకోసం తి.తి.దే. వెబ్‌సైట్‌ద్వారా మరొక సారి తెలియజేయండి!

– ప్రధాన సంపాదకుడు

# సీతాదేవి సమాజానికి ఇచ్చిన సందేశం

- డా॥ సూరపరాజు వసంతకుమారి,
99083 91024



దుష్టశిక్షణ శిష్టరక్షణలో భాగంగా, రాక్షససంహారంతో పాటు రావణసంహారం చేసి, లోకకల్యాణం జరిపించడానికి జనియించింది జానకీదేవి. ఆమె జీవనంలోని అడుగడుగూ నేటి సమాజానికి ఆదర్శమై, అనుకరణ యోగ్యమైన జీవిత సందేశాలను అందిస్తుంది.

దివ్యసౌందర్యం, దేదీప్యమానమైన తేజం, అచంచలమైన పతిభక్తితత్వం, అసాధారణ పాతివ్రత్యం, ధర్మపరాయణత్వం, నిర్భయత్వం, సౌశీల్యం, త్యాగం, సహనశీలత్వం, సౌహార్దం, సంయమనం, సేవాతత్వం, సదాచారం, సాహసం, శౌర్యం, వినయం, క్షమాగుణం, ఇలా లెక్కకు మిక్కిలిగా మేలి సుగుణాలరాశి సీతమ్మ.

తండ్రిమాట నిలపడంకోసం అరణ్యాలకు వెళ్ళడానికి సంసిద్ధుడయ్యాడు రాముడు. సీత దగ్గరికి వచ్చి విషయాన్ని తెలిపి, సీతను అయోధ్యలో జాగ్రత్తగా ఉండమని, తాను అరణ్యాలకు వెళ్ళి వస్తానన్నాడు.

అందుకు సీత రాముడితో, 'సమస్తసుఖాలకు నిలయమైన రాజభవనాల్లో నివసించుటకంటె, స్వర్గాది లోకాల్లో విమానాల్లో విహరించుటకంటె, అష్టైశ్వర్యసంపదలతో అంబరమున హాయిగా సంచరించుటకంటె, ఎన్నికష్టాలు అనుభవించాల్సివచ్చినా పతి అడుగుజాడల్లో సాగిపోవడమే సతికి సుఖప్రదం, శుభప్రదం, ధర్మసమ్మతం. మీరు లేకుండా స్వర్గసుఖాలు లభించినా వాటికి నేను ఇష్టపడను. మీ వెంట ఉండటం తప్ప ఇంక నాకేమీ అక్కరలేదు. మీరు నాతో ఉంటే చాలు ఎంత కష్టమైనా నాకు సుఖంగానే అనిపిస్తుంది. అక్కడ మీకు ఏ విధంగాను భారంకాను. నీవు నాకు దూరమైతే నేను మరణించటం తథ్యం. నా ప్రార్థనను మన్నించి నన్ను మీవెంటే తీసుకు వెళ్లండి. సుఖాల్లోనే కాదు కష్టాల్లో కూడా ఎప్పుడు భర్తవెంటే భార్య ఉండాలని, భర్త తోడులేనపుడు ఎంతటి సుఖమైనా వ్యర్థమేనని, భార్యాభర్తల శరీరాలు రెండైనా ఆత్మ ఒక్కటే అన్న చందంగా జీవించాలని చెప్పింది సీతమ్మ.

సీత అరణ్యాల్లో కూడా ఆనందంగా, నిర్భయంగా రామునితో ఉండేది. అడవుల్లో తపస్సు చేసుకునే ఋషులు, రాక్షసులు పెడుతున్న బాధలను శ్రీరామునికి వివరించి, వారిని కాపాడమని కోరారు. రాముడు రాక్షసులందరినీ సంహరించి వారిని కాపాడుతానని మాట ఇచ్చాడు. ఆ తరువాత రాముడితో దారి మధ్యలో, రాక్షసులతో అకారణ వైరం వద్దని, హింసకు దూరంగా ఉండి ప్రశాంతంగా తాపసధర్మాన్ని స్వీకరించి పద్నాలుగేండ్లు అరణ్యవాసం పూర్తి చేసుకొని అయోధ్యకు తిరిగి వెళదాం అనే ధర్మాన్ని సీతమ్మ భర్తకు బోధించింది. అకారణవైరం ఎప్పుడూ ఎవరితోనూ మంచిది కాదనేదే సీతాసందేశం.

యతివేషంలో వచ్చి సీతను ప్రలోభపెట్టడానికి ప్రయత్నించి, తర్వాత తన నిజరూపాన్ని చూపి భయపెట్టిన రావణుడు లంకకు సీతను ఎత్తుకొని వెళ్ళి అక్కడ తన

గొప్పదనాలు చూపి, రకరకాల ఆశలు పెట్టి, పరిపరి విధాలుగా భయపెట్టి, నయాన్నో, భయాన్నో సీతను లొంగ దీసుకోవాలి అని ప్రయత్నించిన రావణుడితో సీత ఇలా చెప్పింది. నేను రామపత్నిని, పతివ్రతను, ఆడసింహాన్ని, రామునిముందు నీవు గడ్డిపరకతో సమానం. కోరి ప్రాణాలమీదికి తెచ్చుకోకు. నా పతియే నాకు దైవం. రాముడు లేనప్పుడు దొంగగా నన్ను అపహరించుకొని వచ్చావు. నీ ప్రాణాలు తీసి నా స్వామి నన్ను తీసుకు వెళ తాడు. నా ప్రాణం పోయినా నేను రాముడిని తప్ప అన్యులను కన్నెత్తి కూడా చూడనని చెప్పింది. ఆపదలు ఎదురైనా మొక్కవోని నిర్భయత్వం,ప్రలోభాలకు లొంగని పతివ్రతాతత్వం, ఇవన్నీ కూడా నేటి సమాజానికి సీత ఇచ్చిన సందేశాలు ఎంతో మార్గదర్శకం.

హనుమంతుడు లంకలో ఉన్న సీతను ఎన్నో హింసలకు గురిచేసిన రాక్షసకాంతలను చంపేస్తాను, అనుమతి ఇవ్వమని అడిగాడు. అందుకు సీత హనుమా! వాళ్ళు రావణుడి దాసీజనం. వాళ్ళరాజు ఏమి చెప్పాడో అదే వాళ్ళు చేశారు. దోషం వాళ్ళది కాదు, ప్రభువుది.

### వైకుంఠపాళి
### :: 52- సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 ప్ర | | 2 చై | త్ర | 3 ర | థ | 4 ము | | |
| హ | | త్రం | | థం | | వ్వ | | 5 సిం |
| 6 స్తు | తి | | 7 మా | త | లి | | 8 అ | హి |
| డు | | 9 భీ | | రి | | 10 కా | | క |
| | 11 ద | ము | డు | | 12 కా | ళిం | ది | |
| 13 అ | | డు | | 14 శ | | ది | | 15 మ |
| 16 ధ | ర | | 17 వై | కుం | ఠం | | 18 మ | హి |
| రం | | 19 వా | | త | | 20 కా | | ష |
| | | 21 కు | వ | ల | యా | పీ | డ | ము |

చెడు చేసినవానిపట్ల దయ ఉండాలి. అంతా మంచిగా ఉన్న వాడిమీద దయ ఎందుకు? కాబట్టి ఈ రాక్షసస్త్రీలపట్ల నేను దయతో ఉండాలి. నీవు ఇటువంటి వరం కోరకూడదు. వాళ్ళను చంపకూడదు. వీళ్ళందరికీ నారక్ష అని సీత హనుమంతుడితో పలికింది. ఇవి సీతమాతయొక్క దయ, క్షమాగుణాలు. భారతీయ స్త్రీలు ఇటువంటి గుణాలు కలిగి మంచి సంస్కారం కలిగి ఉండాలని సీత సమాజానికి సందేశాన్నిచ్చింది.

పద్నాలుగుసంవత్సరాల అరణ్యవాసానంతరం అయోధ్యలో పట్టాభిషేకానంతరం రాముడు సీత ఆనందంగా జీవిస్తున్నారు. సీత గర్భవతి అయ్యింది. మళ్ళీ లోకంలో ఎవరో సీతపై అపవాదు వేశారని వేగులు తెలపడంతో, రాముడు సీతను అడవుల్లో వదిలి రమ్మని లక్ష్మణుడితో కలిపి పంపాడు. గర్భవతియైన సీతను ఒంటరిగా అడవుల్లో రాముడి ఆజ్ఞ ప్రకారం వదిలి వెళ్ళిపోతున్న లక్ష్మణుడితో రాముడికి ఇలా తెలపమని, క్రింది విధంగా చెప్పింది.

లోకాపవాదం వల్ల రామునిపై వచ్చిన నిందను తొలగించడం భార్యగా నా ధర్మం. స్త్రీకి పతియే దైవం, బంధువు, గురువు, ప్రాణములకంటే మిన్న అన్నది. లోకులను కానీ, రాముణ్ణి కానీ, ఎవ్వరినీ సీత ఎన్నడూ నిందించని మహానుభావురాలు.


మానవుడిగా పుట్టి మాధవుడైన శ్రీరామచంద్రుడి వ్యక్తిత్వాన్ని మించిన మహోజ్వలమైన వ్యక్తిత్వాన్ని సొంతం చేసుకొన్న సీతాదేవి జీవితంలోని అడుగడుగు ఆదర్శమే. సీత స్త్రీ జాతికి గర్వకారణం. ఆమె చరిత్ర లోకోపకారం. ఆమె జీవితంలోని ప్రతి అడుగూ ఆదర్శం.

పైన వివరించినట్లు నేటి సమాజానికి సీతాదేవి ఇచ్చే అమూల్యమైన సందేశాలు లెక్కకు మిక్కిలి. ఆ సందేశాలు ఆచంద్రతారార్కం మానవజాతి వ్యక్తిత్వవికాసా నికి మార్గదర్శనం చేసే అద్భుతమైన అఖండజ్యోతులుగా వెలుగొందుతూనే ఉంటాయి.

# కైంకర్యమే..
# తనువు దాల్చితే....

47

- డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478



**( కంబర్ మహాశయుడు నమ్మాళ్వార్ల దివ్యప్రభావాన్ని స్తుతించారు. ఇందుకు ఎంతో సంతోషపడ్డ మధురకవులు శ్రీనమ్మాళ్వార్లవారి దివ్య వైభవాన్ని, వారు అనుగ్రహించిన దివ్యప్రబంధాలను తలచుకొని మైమరచి 'కణ్ణినుణ్ శిఱుత్తాంబినాల్' గానం చేయడం ఈ సంచికలో చదువవచ్చు.)**

అవతారిక: భగవానుని వైలక్షణ్యం- పరమపదాన్ని చేరి, అప్రాకృతశరీరాన్ని పొందిన తర్వాత, తెలియదగింది. ఆళ్వార్ల వైలక్షణ్యం అటువంటిది కాకుండా, వారి సూక్తుల ద్వారా ఇక్కడే అనుభవించే రీతిలో ఉంది.

**ఇన్బమ్ ఎయ్‌దినేన్-** ఆనందరసంయొక్క పరమావధిని పొందాను. భగవానుని "శుళిపట్టోడుమ్ శుడర్ చ్చోది వెళ్ళత్తు" సుడులు తిరుగుతూ ప్రవహించే వెలిగే కాంతి ప్రవాహం అని చెప్పబడ్డ భగవదనుభవం సగం కడుపు (పూర్ణం కాదు) అనే రీతిలో కదా, ఈ మధురకవులు పొందిన ఆళ్వార్ల అనుభవమనే ఆనందం ఉంది.

మేవినేన్ అవన్ పొన్నడి- "కోలమామ్ ఎన్ శెన్నిక్కు ఉన్ కమలమన్న కుఱై కనల్" (తిరువాయ్-4-3-6) (నా శిరస్సుకు నీ కమలంవంటి, ధ్వనించే కడియాలను కల శ్రీపాదం ఆభరణం) అని, **"తళిర్ పురైయుమ్ తిరువడి ఎన్ తలైమేలవే"** (తిరునెడు-1) (చిగురుటాకువంటి శ్రీచరణం నా శిరస్సుపై ఉంది) అని పలికే రీతిలో ఆళ్వార్లు భగవానుని శ్రీచరణాన్ని దర్శించి అనుభవించారు. వీరికి (మధురకవులకు) అన్నీ ఆళ్వార్ల శ్రీచరణాలే అయ్యాయి.

**మెయ్‌మ్మైయే- "ఇమైయోర్ తలైవా! మెయ్‌న్నిన్ను కేట్టరుళాయ్"** (నిత్యసూరినాథా! నేను చేసే ఈ విన్నపాన్ని నీవు ఆలకించు) అని ఆళ్వార్లు అన్నారు. **"కురుకూర్‌నమ్బి పొన్నడి మేవినేన్ మెయ్‌మ్మైయే"** అని వీరు అన్నారు.

తేవు మఱ్ఱఱియేన్- "భగవద్విషయం వద్దని నేను అనడం లేదు. దానిని గూర్చిన వ్యుత్పత్తి (జ్ఞానం) లేనందున అది "ఇటువంటిది" అని తెలియలేను- అని అంటున్నారు- అని భావం. **"భావో నాన్యత్ర గచ్ఛతి"** (రామా-ఉత్తర-40-15) (నా భావం వేఱొక విషయంలో పోవడం లేదు) అని అంటూ హనుమంతుడు "శ్రీరామునిపై తప్ప ఇంకొకరిపై నామనస్సు అభినివేశాన్ని పొందదు" అని పల్కినట్లే, "మఱ్ఱఱియేన్" (వేఱొకరిని తెలియను) అని అంటూ మధురకవులు కూడా "నా మనస్సు ఆళ్వార్లలో తప్ప, వేరొక విషయంలో ఆసక్తిని పొందదు" అని అంటున్నారు. 'మఱ్ఱు' (వేఱు) అని అనడంవల్ల విడచిన విషయంయొక్క పేరును చెప్పడంలో కూడా ఆసక్తి (ఉద్దేశ్యం) లేదు- అని తెలుస్తోంది.

పావిన్ ఇన్నిశై పాడి త్తిరివనే- ఇహలోకంలోని ఐశ్వర్యాన్ని అల్పమని, అస్థిరమని తలచి, త్యజించి, స్థిరమైన ఆత్మప్రాప్తిని (కైవల్యాన్ని) మహానందం కాదని వదలిపెట్టి, స్థిరమైన, మహానందం అయిన భగవత్ప్రాప్తిని ప్రాప్యంయొక్క ప్రథమపర్వమేనని విడచి, దాని చరమపర్వమైన ఆళ్వార్లను కూడా ఉద్దేశ్యులుకారని వదలిపెట్టి, వారి సంబంధాన్ని కల్గిన పాశురాలను కూడా మిక్కిలి భోగ్యం కాదని తలచి త్యజించి, ఆ పాశురాలతో సంబంధాన్ని కల రాగమే తమకు ఉద్దేశ్యమని అంటున్నారు, మధురకవులు పాడి త్తిరివనే-ఔషధ సేవను చేసి (బలాన్ని పొంది) సంచరించేవారివలె, ఇదే కదా మధురకవులకు ధారకమై, సంచరించేటట్లు చేస్తోంది.

*(ఇంకా ఉంది)*

మీ ఇంటికే శ్రీవారు వచ్చిన
అనుభూతిని పొందండి.



'సప్తగిరి' మాసపత్రికకు
చందాకట్టి

శ్రీవారి అక్షరప్రసాదాన్ని
నెలనెలా అందుకోండి.





తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

(తెలుగు, తమిళం, కన్నడ, హిందీ, ఇంగ్లీషు, సంస్కృత భాషలు)

చందా వివరాలు

**సంవత్సర చందా : రూ. 60-00**
**జీవిత చందా : రూ. 500-00**
**విదేశాలకు సంవత్సర చందా : రూ. 850-00**

సంస్కృతం సప్తగిరి పత్రికకు జీవిత చందా సౌకర్యం లేదు.

వివరాలకు:
**ప్రధాన సంపాదకుడు**

తి.తి.దే. ప్రెస్ ప్రాంగణం,
కే.టి. రోడ్డు, తిరుపతి. 517 507
ఫోన్: 0877 - 2264363,
2264543.

# అద్వైతాచార్య అప్పయ్యదీక్షితులు

**రచయిత - రావినూతల శ్రీరాములు**
**ఆకృతి-1/8 డెమ్మీ, పుటలు-40, వెల-రూ.25/-**
**ప్రాప్తిస్థానం- ఎ.భరద్వాజ, సరస్వతి నిలయం, ఇ.నెం.12-13-414/11, తార్నాక, సికింద్రాబాద్-500 017.**

తమిళరాష్ట్రంలో అత్యంత ప్రసిద్ధి చెందిన ఆర్ష పండితుడు అప్పయ్యదీక్షితులు. వీరి పూర్వీకులు ఆంధ్రులని పరిశోధకులు తేల్చారు. ఆయన స్వయంగా ఆంధ్రదేశంలో, అందులోనూ యజుశ్శాఖలో జన్మించడం ఎంతో పుణ్యం చేసుకుంటే గాని జరగదని ఒక శ్లోకంలో చెప్పారు. వీరు సాహిత్యం, తత్త్వశాస్త్రాలపై సంస్కృతంలో 104 ప్రామాణికగ్రంథాలు వ్రాశారు. అంతటి పండితుని గూర్చి రావినూతన శ్రీరాములుగారు 'అద్వైతాచార్య అప్పయ్య దీక్షితులు' అనే చిన్న గ్రంథం వ్రాశారు. ఈ గ్రంథంలో అప్పయ్యదీక్షితుల జీవిత విశేషాలున్నాయి. ఇందులో ఆదిశంకరులు, అప్పయ్యదీక్షితులు, వక్షఃస్థలాచార్యుడు, తోటాంబి, రంగరాజాధ్వరి, అప్పయ్య బాల్యం- విద్యాభ్యాసం, వివాహం, వాజపేయ క్రతువు, వేలూరు చినబొమ్మనాయకుడు, సమన్వయ మార్గనిర్దేశకుడు, ఆంధ్రాభిమానం, అప్పయ్యను ఆదరించిన రాజులు, విరించిపురం-అడయపాలెం, సంచారం, తాతాచార్యులు, తాతాచార్యుల కుతంత్రాలు, వైష్ణవంపట్ల అప్పయ్య వైఖరి, చరమాంకం, అప్పయ్యదీక్షితులవంశంలోని ప్రముఖులు వంటి శీర్షికలతో విషయ విశ్లేషణ ఉంది.

అప్పయ్యదీక్షితుల గురించి సమగ్రంగా తెలుసుకోదలచిన ఈ గ్రంథం ఉపకరిస్తుంది. పుస్తకం చిన్నదే అయినా విషయం సమగ్రంగా ఉందని చెప్పవచ్చు.

**- డా॥ జె.కొండలరావు**

---

# ముకుందమాల

**రచయిత - డా॥ బి.రామాచార్యులు**
**ఆకృతి-1/8 డెమ్మీ, పుటలు-281, వెల-రూ.100/-**
**ప్రతులకు- రచయిత, గుల్లదుర్తి(పో), కోవెలకుంట్ల (మం), కర్నూలుజిల్లా - 518 134.**
**చరవాణి - 96182 39912**

ముకుందస్యమాలా- ముకుంద మాల. ముకుందుడు అంటే మోక్షాన్ని ఇచ్చేవాడు. ముకుందస్యమాలా అంటే మోక్షాన్ని ఇచ్చేవానికి మాల అని అర్థం. అనగా భగవంతునికి సమర్పించిన మాల.

ఈ మాల భగవంతునికి కృష్ణభక్తి పరవశులై ఉండే కులశేఖరఆళ్వార్లు సమర్పించారు. వీరు మహారాజులు. వీరికి భగవంతునియందు ఎంత ప్రేమో ఆ భగవంతుని భక్తులయందు మరింత ఎక్కువ ప్రేమ. కులశేఖరులకు ప్రజలందరితో కలసి శ్రీరంగం వెళ్లి రంగనాథుణ్ణి సేవించాలని కోరిక. అందువల్ల శ్రీరంగ యాత్ర గురించి చాటింపు వేయించేవారు. కానీ, వారి మంత్రులకు రాజు శ్రీరంగం వెళితే రంగనాథుని సౌందర్యానికి తన్మయత్వం చెంది మరి రాజ్యానికి తిరిగి రారేమో అని శంకించి, భగవద్భక్తుల్ని వీరి వద్దకు తీసుకు వచ్చేవారు. భగవంతుని కంటే వారి భక్తులయందు ఆదరం ఎక్కువ కనుక వారి యాత్ర వాయిదా పడుతూ ఉండేది. అలాంటి భక్తిపారవశ్యంతో ముకుందుడికి సమర్పించిన అక్షరమాలకు రచయిత బి.రామాచార్యులుగారు 'శ్రీచరణామృతం' అను వ్యాఖ్యానం వ్రాయడం ఆ స్వామి సంకల్పమే!

సంస్కృత భారత భాగవత రామాయణాల నుండి, పోతన భాగవతం నుండి, శేషప్పకవి రచించిన నరసింహశతకంనుండి, కంచెర్లగోపన్న వ్రాసిన దాశరథి శతకం నుండి, ధూర్జటి శ్రీకాళహస్తీశ్వరశతకం నుంచి సందర్భానుసారం ఉదాహరణలను గ్రహించి ఈ వ్యాఖ్యానంలో పొందుపరచారు.

ఇప్పటికి తిరుమల దేవాలయంలో ఒక సోపానానికి 'కులశేఖరపడి' అని వ్యవహారంలో ఉంది. ఇంతటి వైశిష్ట్యం కల్గిన ఈ గ్రంథాన్ని ప్రతిఒక్కరు చదివి జ్ఞానాన్ని సంపాదించాలి. సరళవ్యాఖ్యానంతో ఉంది.

**- కోగంటి వేంకట అప్పలాచార్యులు.**

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి



(ఆధ్యాత్మిక మాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పని సరి)

సెల్ నెం.

**2.** కావలసిన భాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం (సంవత్సరచందా మాత్రమే) ☐

**3.** సంవత్సర/జీవిత చందా :
రూ.60/- ☐ రూ.500/- ☐

**4.** చందా పునరుద్ధరణ :
(అ) చందా నెంబరు :
(ఆ) భాష :

**5.** చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. :
తేది :
(చెక్కులు స్వీకరించబడవు)

ప్రదేశం :
తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.60/-, జీవితచందా రూ.500/-లు; డి.డి. / ఎం.ఓ.ను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.

2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులో గానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి, పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప-మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.


3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

52

# వైకుంఠపాళి




**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

2)కుబేరుని ఉద్యానవనము(5); 6)పొగడ్త(2); 7)ఇంద్ర సారథి(3); 8)పాము(2); 11)విదర్భరాజు కొడుకు(3); 12)శ్రీకృష్ణుని అష్టభార్యలలో ఒకతె(3); 16)ద్రోణుని భార్య(2); 17)లక్ష్మీనారాయణుల నివాసం(3); 18)భూమి(2); 21)కంసుని గజము(7)

### నిలువు

1)రావణాసురుని సేనాధిపతి(4); 2)తెలుగు మాసాల్లో మొదటిది(2); 3)దుష్యంతుని తల్లి(4); 4)అందె(2); 5)రాహువు తల్లి(3); 9)విదర్భరాజు(3); 10)సుమతి భార్య(3); 13)స్త్రీ యొక్క క్రిందపెదవి(3); 14)కణ్వమహర్షి పెంచిన కూతురు(4); 15)యమధర్మరాజు వాహనం(4); 19)మాటే. 'వాక్కు'కు రూపాంతరం (2); 20)దస్తూరి అభివృద్ధికోసం చిన్నపిల్లల చేత ఇది వ్రాయిస్తూంటారు.(2).

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు

# భక్తుల సేవలో....




ఫిబ్రవరి 14, 2020 శుక్రవారం తిరుమలలో ఆధునీకరించిన అశ్వినిఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో తి.తి.దే.పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి పాల్గొని పూజలు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ తిరుమలకు విచ్చేసే భక్తులు, స్థానికుల సౌకర్యార్థం అపోలో, టాటాట్రస్టు వారి సహకారంతో అశ్వినిఆసుపత్రి అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఇకమీదట అపోలో, టాటాట్రస్టులవారి సహకారంతో తిరుమల అశ్వినీ ఆసుపత్రిలోనే మెరుగైన వైద్యసేవలు అందించబడతాయని అందరూ సద్వినియోగం చేసుకోవాల్సిందిగా తెలిపారు.

ఫిబ్రవరి 17, 2020 సోమవారం శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబసమేతమల్లికార్జునస్వామివారికి తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి. సుబ్బారెడ్డి, కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్. లు తి.తి.దే. తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. వీరికి శ్రీశైలం కార్యనిర్వహణాధికారి శ్రీ కె.ఎస్.రామారావు, అర్చకులు స్వాగతం పలికారు.





ఫిబ్రవరి 23, 2020 ఆదివారం చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తిలో నిర్వహించిన మహాశివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాశస్త్యమైన కల్యాణోత్సవం సందర్భంగా సోమస్కందమూర్తి, జ్ఞానాంబికలకు తి.తి.దేవస్థానం తరపున తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి, కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్. దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు.


Edited and published on behalf of T.T.Devasthanams by **Dr. K.Radha Ramana,** M.A., M.Phil., Ph.D., Chief Editor, T.T.D. and printed at T.T.D. Press by **Sri R.V.Vijaya Kumar,** B.A., B.Ed., Dy. E.O., (Publications & Press), T.T.D. Press, Tirupati - 517507.

## తిరుమల తిరుపతి దేవస్థానములు
## తిరుపతి

# శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవం

### 2020, మే 28 నుండి జూన్ 05 వరకు



**28-05-2020**
గురువారం
పగలు: ధ్వజారోహణం
రాత్రి: పెద్దశేషవాహనం

**29-05-2020**
శుక్రవారం
పగలు: చిన్నశేషవాహనం
రాత్రి: హంసవాహనం

**30-05-2020**
శనివారం
పగలు: సింహవాహనం
రాత్రి: ముత్యపుపందిరివాహనం

**31-05-2020**
ఆదివారం
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: సర్వభూపాలవాహనం

**01-06-2020**
సోమవారం
పగలు: పల్లకిలో మోహినీఅవతారోత్సవం
రాత్రి: గరుడవాహనం


**02-06-2020**
మంగళవారం
పగలు: హనుమద్వాహనం,
సా॥ వసంతోత్సవం
రాత్రి: గజవాహనం

**03-06-2020**
బుధవారం
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం

**04-06-2020**
గురువారం
పగలు: రథోత్సవం
రాత్రి: అశ్వవాహనం

**05-06-2020**
శుక్రవారం
పగలు: చక్రస్నానం
రాత్రి: ధ్వజావరోహణం

SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams printing on 25-03-2020. Regd. with the Registrar of Newspapers under "RNI" No.10742.
Postal Regd.No.TRP/10- 2018-2020, Licensed to post without prepayment
No.PMGK/RNP/WPP-04/2018-2020



అయోధ్యలో రాముడికి మహావైభవంగా పట్టాభిషేకం జరిగింది. రాముడు రాజ్యం పరిపాలించిన కాలంలో దేశంలో ప్రజలంతా ఏ కష్టమూ లేకుండా హాయిగా సుఖంగా సంతోషంగా జీవించారు. రాముడి రాజ్యంలో ధర్మం నాలుగు పాదాలతో నడిచింది. రాముడి పరిపాలన తరువాతి రాజులకి ఆదర్శమై రామ రాజ్యం అనే పేరు యుగయుగాలకీ శాశ్వతంగా నిలిచిపోయింది.